ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
శుక్రవారం 27, డిసెంబరు 2024



దోర్నాల సమీపంలో ఆరబెట్టిన మిర్చిలోకి చేరిన నీటిని తొలగిస్తున్న మహిళా రైతు (ఇన్‌సెట్‌లో) మిరప కాయలపై పట్టలు కప్పుతున్న రైతులు

అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా ముసురు వానకు మిరప రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. పెద్దదోర్నాల మండలంలో జులై-ఆగస్టులో మొక్కలు నాటిన కొందరు రైతులు మిరప కోతలు చేశారు. కల్లాల్లో ఆరబోశారు. ఈక్రమంలో చిరుజల్లులు కురుస్తుండడంతో టార్పాలిన్ పట్టలు కప్పుతున్నారు. అయితే ఎక్కువ సమయం పట్టలు కప్పి ఉన్నా గాలి లేక కాయలు పాడయ్యే అవకాశం ఉంది. దీంతో కల్లాల వద్దే రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. వాన తెరిపి ఇస్తే పట్టలు తొలగించి కాయల్లోకి చేరిన నీటిని తొలగిస్తూ అవస్థలు పడుతున్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పొదిలి మండలం అన్నవరంలో 100 ఎకరాలకుపైగా వరికి నష్టం వాటిల్లింది. అలాగే వరి, కంది, మినుము, బొబ్బర పంటలు బాగా దెబ్బతిన్నాయి. వరి, మినుము, బొబ్బర్లు కోత దశకు కొచ్చిన ఈ సమయంలో వానపాల య్యాయి. గురువారం ఏవో షేక్ జైనులుబ్దీన్ గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న కందిపంట, వరి పంటలను పరిశీలించారు. వర్షం ఇదేవిధంగా కొనసాగితే కందికి ముప్పుతప్పదన్నారు. వరి ఓదెలు తడిసి మొలకలు వస్తున్నాయన్నారు.


తర్లుపాడు, కారుమానుపల్లె, మీర్జపేటలో సాగుచేసిన వరి పంట కోసి ఓదెలు వేశారు. ప్రస్తుత వర్షానికి తడిచి గింజ మొలకెత్తుతుండటంతో ఆరుగాలం శ్రమించిన పంట చేతికి అందుతున్న దశలో ఈ వర్షం నట్టేటముంచిందని రైతులు కన్నీరు పెడుతున్నారు. కంది కూడా ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఈ వర్షాలకు రాలిపోయి కట్టె మాత్రమే మిగులుతుంది. ఈ ఏడాది వరిగ పంటను విస్తారంగా సాగు చేశారు. వర్షాలకు వరిగ నేలకొరిగింది. కోత దశలో ఉన్న మిర్చి వర్షాలకు దెబ్బతిన్నది. కోసిన కాయలు కూడా తాలు రావటంతో రేట్లు కూడా తక్కువగా ఉండటంతో రైతులకు ఈ ఏడాది తీవ్ర నష్టం సంభవించేలా ఉంది.



పంట నష్టం ప్రాథమిక అంచనా..

పంట రకం	విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	566
మినుము	2,206
శనగ	167
జొన్న	2
అలసంద	2,950
పొగాకు	590
మొత్తం	6,481

పొగాకు రైతులకు భారీ నష్టమే



కొండపి వద్ద పొగతోటలో నిలిచిన వర్షపు నీరు

జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో పొగ తోటలు సాగయ్యాయి. అందులో లేతతోటలు వర్షాలతో ఉరకెత్తిపోతుండగా నెలరోజులు వ్యవధి ఉండేవి ఎదుగుదల తగ్గాయి. రెండు మాసాల క్రితం వేసి ప్రస్తుతం ఆకు రెలుపు జరుగుతున్న తోటల్లో మడ్డికారి పోయి నాణ్యత పూర్తిగా తగ్గిపోతోంది. నెల పొడవునా సాగుతున్న జల్లులు, మంగు వాతావరణంతో అన్ని పంటలపైనా పురుగులు, తెగుళ్ల దాడి పెరిగిపోయింది. మొత్తంగా ఇప్పటికే దెబ్బతిన్న పంటలతో సగానికి సగం దిగుబడులు తగ్గే పరిస్థితి ఉంది. వర్షాలు మరికాస్త పెరిగితే అన్నిరకాల పంటలు తుడిచిపెట్టుకొని పోయే ప్రమాదం కనిపిస్తోంది.

వెన్ను విరిగిన రైతు

ముసురుతో పంటలకు నష్టం

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ముసురు వాన కురుస్తుండటంతో పంటలకు భారీనష్టం వాటిల్లింది. కంది, శనగ, వరిగ, పొగాకు, మినుము, వరి పైర్లు దెబ్బతిన్నాయి. ఈ వర్షాలకు శనగ పైరు పులుసు కారిపోయి పూత కూడా రాలిపోతుంది. తెగుళ్లు కూడా విజృంభిస్తున్నాయి. వరి ఓదెలు తడిసిపోయి గింజలు మొలకెత్తుతున్నాయి. పొగాకు ఆకుకు మడ్డి కారిపోతోంది. దీంతో పొగాకు రైతులు నట్టేట మునిగారు. కోసి కల్లాల్లో ఉన్న మిరపకాయలు తడిసిపోయాయి. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని, లేకపోతే భారీస్థాయిలో నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కోతల సమయంలో వెంటాడిన అల్పపీడనాలు

- ఎన్నడూ లేనివిధంగా క్రిస్మస్ సమయంలోనూ వరుస వర్షాలు... పంటలపై తీవ్ర ప్రభావం
- కుళ్లుతున్న మినుము, శనగ, తడిసిన వరి ఓదెలు
- కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిన వైనం
- ఉరకెత్తిపోతున్న లేత పొగతోటలు...
- మడ్డికారి నాణ్యత కోల్పోతున్న ముదురు తోటలు
- కందిలో రాలిపోతున్న పూత, పిందె
- అన్ని పంటలపైనా తెగుళ్లు, పురుగుల ఉధృతి
- తొలివారంలో భారీ వర్షాలు, తర్వాత మంగు వాతావరణం... తాజా వర్షంతో అపార నష్టం



పీసీపల్లిలో పూత, పిందె రాలిపోయిన కంది

ఒంగోలు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి)/పొదిలి/పెద్దదోర్నాల/తర్లుపాడు: గతంలో ఎన్నడూ లేనివిధంగా డిసెంబరు నెల పొడవునా సాగిన విభిన్న వాతావరణం జిల్లా రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. తొలివారంలో అకాలంగా భారీవర్షాలు కురవగా అనంతరం దాదాపు మూడు వారాలు ఎండ అన్నది కనిపించకుండా మబ్బులు పట్టి మంగు వాతావరణం నెలకొనడంతో పంటలపై పురుగులు, తెగుళ్ల దాడి తీవ్రమైంది. తాజాగా ముసురుపట్టి పడిన జల్లులు పైర్లను మరింత దెబ్బతీశాయి. ఈ పరిస్థితి వల్ల పొలంలో ఉన్న అన్ని పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో పంటల సాగులో డిసెంబర్ నెల అత్యంత కీలకమైంది. కాయ, పిందె దశలో కొన్ని పైర్లు కోతకు వస్తాయి. రబీలో సాగు ముగిసి అధికశాతం పైర్లు ఎదుగుదల దశలో ఉంటాయి. అలాంటిది ఈ ఏడాది వాతావరణం పూర్తిగా మారింది. ఊహించని రీతిలో వాతావరణంలో భారీవర్షాలు కురిశాయి.

వరుస అల్పపీడనాలతో..

జిల్లాలో వార్షిక వర్షపాతం 751.50 మి.మీ కాగా మిగతా 6లో...

75 గ్రామాలు... 6,481 హెక్టార్లు..

- తాజా వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా
- పలుచోట్ల అధికారుల పరిశీలన 6





తర్లుపాడు సమీపంలో తెగులు సోకిన శనగ



తర్లుపాడు సమీపంలో వాలిన వరిగ

తడిసిన మిరప.. మొలకెత్తుతున్న వరి

తొలివారంలో కురిసిన భారీవర్షాలతో నష్టపోయిన పంటలను తాజాగా కురుస్తున్న వర్షాలు మరింతగా దెబ్బతీశాయి. ప్రస్తుతం జిల్లాలో వరి, మిరప కోతలు జరుగుతున్నాయి. చాలాప్రాంతాల్లో ప్రత్యేకించి సాగర్ ఆయకట్టులోని వేలాది ఎకరాలలో వరి ఓదెలు పొలంలో ఉన్నాయి. తాజా వర్షంతో పలుచోట్ల అవి తడిచిపోయి గింజ మొలకెత్తుతోంది. మిర్చిని కోసి కల్లాల్లో ఆరబోయగా వర్షాలతో అవి తడిసిపోతున్నాయి. వాటిని తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అగచాట్లు పడుతున్నారు. 25వేల ఎకరాల్లో వేసిన మినుము, మరో 40వేల ఎకరాల్లో వేసిన శనగపైరు కుళ్లిపోతుండగా 60వేల ఎకరాల్లోని కంది పైరులో పూత, పిందెరాలి పోతోంది.





పొదిలి సమీపంలో నీటిలో మునిగిపోయిన ఓదెలను పరిశీలిస్తున్న ఏవో, రైతులు

తమ్మలూరులో వైద్య శిబిరం

ముండ్లమూరు మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని తమ్మలూరులో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 'మంచం పట్టిన తుమ్మలూరు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి గ్రామంలో 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ సందర్శించారు. పంచాయతీ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. **- ముండ్లమూరు, ఆంధ్రజ్యోతి**





లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల, అధికారులు

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి

- మార్కాపురంలో ఇందిరమ్మ-2, ఇడుపూరు-3 లేఅవుట్‌లను పరిశీలించిన కలెక్టర్ అన్సారియా 6

శీనారెడ్డిపై విచారణ వేగవంతం

- ఫైళ్ల పరిశీలనతోపాటు ప్రస్తుత పీడీ నుంచి పలు వివరాలు సేకరించిన విచారణ కమిటీ
- ఆందోళన చెందుతున్న పలువురు ఉద్యోగులు.. సెలవు బాటలో మరికొందరు
- కమిటీ వద్ద విచారణకు సిద్ధమవుతున్న పూర్వ పీడీ



ప్రస్తుత డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకుంటున్న విచారణ కమిటీ అధికారులు

ఒంగోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీ విచారణలో వేగం పెంచింది. కమిటీకి నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు బృందం పలు అంశాలను లోతుగా పరిశీలన చేస్తున్నారు. దాదాపు నాలుగైదు రోజులు పలు విభాగాలకు చెందిన ఫైళ్లు పరిశీలన చేసిన కమిటీ రెండురోజుల క్రితం ప్రధాన ఫిర్యాదుదారు అయిన డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఈదర మోహన్‌ను పిలిచి పలు అంశాలపై స్పష్టత తీసుకొంది. అదే సమయంలో కలెక్టర్ తాజాగా అందిన మరికొన్ని ఫిర్యాదులు పరిశీలనలోకి తీసుకున్నారు. తొలుత తమకు ఇచ్చిన విచారణ అంశాలపై ఫైళ్లను కోరినవారు తాజాగా కలెక్టర్ నుంచి వచ్చిన అంశాలకు సంబంధించిన ఫైళ్లపై దృష్టిసారించారు. గురువారం సాయంత్రం డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ... ప్రస్తుత డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌ను కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ఇప్పటివరకు చేసిన విచారణలో తాము గుర్తించిన అంశాలు, వాటిపై తమకు ఉన్న సందేహాలు కొందరు ఉద్యోగుల భాగస్వామ్యం తదితర అంశాలపై పీడీతో మాట్లాడినవారు మరికొన్ని ఫైళ్లను కూడా చూడాల్సిన అవసరం ఉందని చెప్పినట్లు సమాచారం.

ట్యాంపరింగ్‌కూ అవకాశం

మరోవైపు విచారణ ఎదుర్కొంటున్న శీనారెడ్డి వారంక్రితం కార్యాలయానికి వెళ్లి తనకు సన్నిహితులుగా ఉండే ఉద్యోగుల నుంచి కొన్ని ఫైళ్ల నకళ్లను తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రికార్డులు ట్యాంపరింగ్‌కు కూడా అవకాశం ఉంటుందని, నకళ్లు ఇచ్చిన ఉద్యోగులు వాటిని కూడా మార్పులు, చేర్పులు చేసే అవకాశాలను విచారణ కమిటీ అధికారులు పీడీ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. అయితే తొలుత అందిన ఫిర్యాదులకు సంబంధించిన ఫైళ్ల విషయంలో ఆయా విభాగాల వారికి రాతపూర్వకంగా పలు సూచనలు, హెచ్చరికలు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను పీడీ వారికి వివరించారు. ఈ సందర్భంగా తాజాగా అందిన ఫిర్యాదుల ఫైళ్ల విషయం లోను అలాంటి చర్యలు తీసుకోవాలని వారు కోరినట్లు తెలిసింది. వచ్చే నెల 2న తమ కమిటీ ముందు హాజరై తగు వివరణ ఇవ్వాలని కమిటీనోటీసు ఇచ్చిన నేపథ్యంలో అందుకు విచారణను ఎదుర్కొంటున్న శీనారెడ్డి సన్నద్ధం అవుతున్నారు. అందుకు అవసరమైన కొన్ని ఫైళ్ల నకళ్లను గురువారం డ్వామా కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లారు.

సెలవు బాటలో కొందరు ఉద్యోగులు

గతంలో శీనారెడ్డితో అంటకాగి అప్పుడు జరిగిన అక్రమాలలో భాగస్వాములైన ఉద్యోగులు ప్రస్తుతం విచారణ జరుగుతున్న తీరుతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమపైకి రాకుండా వివిధ మార్గాలలో ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఈక్రమంలో కొందరు ఉద్యోగులు సెలవు బాటలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు ఉద్యోగులు సెలవులో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సెలవుపెట్టినా అవసరమైన సమయంలో సంబంధిత ఫైళ్లను చూసేందుకు రావాలనే సంకేతాలను అధికారుల కమిటీ, పీడీలు ఇవ్వడంతో మరింత ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

హద్దురాయి.. ఓ చరిత్ర కలదోయి..!

- రెండు శతాబ్దాలుగా పదిలం
- నాడు నెల్లూరు, కృష్ణా జిల్లాల సరిహద్దుగా అద్దంకి
- గుంటూరు జిల్లా ఏర్పాటుతో మారిన ముఖచిత్రం 7



కండరాల వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను పరామర్శించి మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ప్రభుత్వం నుంచి సాయానికి కృషి చేస్తా

కండరాల వ్యాధి బాధితులను పరామర్శించిన డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముండ్లమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడు పంచాయతీ పరిధిలోని బంగారమ్మగుట్టలో కండరాల వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఎస్తేర్‌రాణి, రాఘవేంద్రరావు దంపతుల కుమారులు హర్షవర్ధన్, విజయభవాన్, విరాట్ గురించి గురువారం ఆంధ్రజ్యోతిలో 'ఆ చిన్నారులు విధి వంచితులు' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు బంగారమ్మ గుట్టలో చిన్నారులను పరామర్శించారు. అనంతరం తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇది కండరాలకు సంబంధించిన వ్యాధి అని, తగ్గదని తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములకు వ్యాధి సోకటం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. ఆయన వెంట ముండ్లమూరు వైద్యాధికారి ఎం.జాస్మిన్, సీహెచ్‌వో నారాయణరావు, ఏఎన్ఎం సుజాత ఉన్నారు.

వెన్ను విరిగిన రైతు

(5వ పేజీ తరువాయి)

డిసెంబరులో వర్షపాతం 43.50 మి.మీ మాత్రమే. ఈ ఏడాది ఎక్కువ అల్పపీడనాలతో వర్షాలు కురిసి ఇప్పటికే ఏకంగా 85.20 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అందులో ఒక్క తొలివారం లోనే దాదాపు 70మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో సాధారణం కన్నా అయిదారు రెట్లు అధికంగా కురిసింది. అలా తొలివారంలో కురిసిన వర్షాలు పంటల సాగును జాప్యం జరిగేలా చేయడమే కాక పొలంలో ఉన్న పంటలు కూడా దెబ్బతిన్నాయి. అనంతరం మూడు వారాలు మంగు వాతావరణం నెలకొనగా తిరిగి రెండు రోజులుగా తెరపి లేకుండా జల్లులు పడుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి జిల్లాలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడుతున్నాయి.

రాష్ట్రంలోనే అత్యధికం

గడిచిన రెండు రోజుల్లో జిల్లాలో సగటున 10.0 మి.మీ వర్షపాతం నమోదైంది. గురువారం పగటిపూట తెరపి లేకుండా జల్లులు పడ్డాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలోపు గడిచిన 6 గంటల వ్యవధిలో రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలోని కొత్తపట్నం మండలంలో 60.75 మి.మీ వర్షపాతం నమోదైంది. టంగుటూరులో 44.75, చీమకుర్తి మండలంలో 39.25, ఒంగోలు మండలంలో 39.25, ఒంగోలు నగరంలో 31.75, సింగరాయకొండలో 29.0, త్రిపురాంతకంలో 25.75, ఎస్ఎన్‌పాడులో 25.25, పొదిలి, కనిగిరి, కొండపి, పెద్దారవీడు, మార్కాపురం, దోర్నాల, వై.పాలెం, కెకెమిట్ల, అర్ధవీడు, మద్దిపాడు, పుల్లలచెరువు, జరుగుమల్లి, దొనకొండ, దర్శి, కంభం, ఎన్‌జీపాడు హెచ్ఎంపాడు ఇలా అన్ని ప్రాంతాల్లోను 10 నుంచి 25 మి.మీ వర్షపాతం నమోదైంది.

75 గ్రామాలు... 6,481 హెక్టార్లు..

తాజా వర్షాలతో దెబ్బతిన్న పంటలు

వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా

పలుచోట్ల అధికారుల పరిశీలన

ఒంగోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాజాగా కురుస్తున్న వర్షాలతో 75 గ్రామాలలో 6,481 హెక్టార్లలో పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది. ఆ మేరకు జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారి (డీఏవో) సీహెచ్.శ్రీనివాసరావు గురువారం సాయంత్రానికి ఉన్నతాధికారులకు నివేదించారు. ఆ ప్రకారం చూస్తే దొనకొండ, పామూరు కురిచేడు, ముండ్లమూరు, ఒంగోలు, కేకేమిట్ల, టంగుటూరు మండలాల్లో వరి, మినుము, అలసంద, జొన్న, పొగాకు పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తం ఏడు మండలాల్లో 75 గ్రామాలలో పంటలకు నష్టం వాటిల్లగా, అందులో అత్యధికంగా కేకేమిట్ల మండలంలోని 24 గ్రామాల్లో నష్టం ఏర్పడింది. మొత్తం దెబ్బతిన్న విస్తీర్ణం 6,481 హెక్టార్లలో కూడా ఆయా మండలంలోని 4,232 హెక్టార్లు ఉంది. మొత్తం జిల్లాలోని 75 గ్రామాల్లో 6,591 మంది రైతులు ఉన్నట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలో గుర్తించింది. వివిధ ప్రాంతాల్లో వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాలను పరిశీలన చేసి, ప్రస్తుత సమయంలో పంటల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సూచనలు చేశారు. డీఏవో శ్రీనివాసరావు టంగుటూరు మండలంలోని పంటలను పరిశీలించగా, ఇతర ప్రాంతాల్లో సంబంధిత సబ్ డివిజన్, మండల అధికారులు పరిశీలించారు.

విద్యుత్‌షాక్‌కు గురై రెండు గేదెల మృతి

పొదిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌కు గురై రెండు గేదెలు మృత్యువాతపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... నగరపంచాయతీ పరిధిలోని రాజుపాలేనికి చెందిన కీర్తిప్రసాద్, కంచర్ల నాగేశ్వరరావుకు చెందిన రెండు గేదెలు పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. వాటి విలువ సుమారు లక్షా 50వేలు ఉంటుందని యజమానులు చెప్పారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి

- ఇందిరమ్మ-2, ఇడుపూరు-3 లేఅవుట్‌లను పరిశీలించిన కలెక్టర్ అన్సారియా



ఇడుపూరు వద్ద లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల, అధికారులు

మార్కాపురం, డిసెంబర్ 26(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి పట్టణ, మండల పరిధిలోని లేఅవుట్‌లలో నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గ్రామ రెవెన్యూ సదస్సుల్లో పాల్గొనేందుకు మార్కాపురం వచ్చిన ఆమె గురువారం రెండు లేఅవుట్‌లను ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా స్థానిక ఇందిరమ్మ-2 లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల అక్కడి సమస్యలను తెలియజేశారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రులను కలిసి నిర్మాణాలను ప్రారంభించని, బేస్‌మెంట్‌స్థాయిలో నిలిచిపోయిన వారికి ప్రస్తుత స్కీమ్ కింద బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరానన్నారు. అంతేకాక తాగునీరు, రహదారులు, డ్రైన్లు, విద్యుత్ తదితర మౌలిక వసతుల కోసం రూ.42 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇక్కడి సమస్యలను తాను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ అన్సారియా తెలిపారు. అనంతరం ఇడుపూరు గ్రామ సమీపంలోని లేఅవుట్‌ను పరిశీలించారు. అక్కడ జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఆధ్వర్యంలో 1,282 గృహాలు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాటిల్లో 772 గృహాలు దాదాపు పూర్తికావచ్చాయన్నారు. చిన్నపాటి పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అంతేకాక రహదారులు, డ్రైన్లులాంటి మౌలిక వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఇంకా చాలా గృహాలను ప్రారంభించలేదన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ అన్ని రకాల స్టేజీల్లో గృహాలు ఉన్న లబ్ధిదారులతో త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలను వివరించాలన్నారు. చివరి స్టేజీలోవున్న గృహాలను ఈ నెలాఖరుకల్లా సాధ్యమైన మేర పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, తహసీల్దార్ చిరంజీవి, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగ్నదొంగ అరెస్టు

- **దుస్తులు లేకుండా చోరీలు**
- **ఖాళీ స్థలాలకు పక్కన ఉన్న నివాసాలే టార్గెట్**
- **సీసీఎస్ పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర దొంగ**
- **రూ.26లక్షల విలువ చేసే బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదు స్వాధీనం**
- **చోరీల సొమ్ములతో విలాసవంతమైన భవన నిర్మాణం**



స్వాధీనం చేసుకున్న బంగారాన్ని చూపిస్తున్న పోలీసులు

విజయవాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాత్రిపూట ఒంటిపై దుస్తులు లేకుండా తిరుగుతాడు. తేలికపాటి వస్తువులను కొక్కీలుగా మార్చేశాడు. ఈ రెండు లక్షణాలు విన్న తర్వాత ఎవరైనా అతడ్ని అఘోరా గానో, ఇంజనీర్ గానో ఊహించుకుంటారు. అతడు ఈ రెండు లక్షణాలు కలగలిపిన కరుడుగట్టిన నేరగాడు. అంతరాష్ట్ర పోలీసుల రికార్డులు అతడు చేసిన నేరాలు పేజీల కొద్దీ ఉన్నాయి. ఒక్కసారి నేరం చేసిన తర్వాత అతడు పోలీసులకు చిక్కడం చాలా కష్టం. చేతులకు సంకెళ్లు పడకుండా ఎన్నో ఎత్తులు వేసిన ఆ నేరగాడిని విజయవాడ సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. ఆ వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, క్రైమ్స్ డీసీపీ టి.తిరుమలేశ్వరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావుతో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం వెల్లడించారు.

చిన్నతనంలోనే దొంగతనాలు

గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన కంచర్ల మోహనరావు ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నతనంలోనే దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. ఇలా వివిధ నేరాల్లో జైలుకు వెళ్లి రావడంతో తర్వాత తర్వాత కరుడుగట్టిన నేరగాడిగా మారిపోయాడు. ప్రస్తుతం కాకినాడ జిల్లా తుని మండలం మరువాడ గ్రామంలో భార్యా పిల్లలతో కలిసి ఉంటున్నాడు. అక్కడి నుంచి చోరీలకు బయలుదేరతాడు. గంజాయి, మద్యం తాగడానికి బానిసగా మారాడు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలో అక్టోబరు పదో తేదీన ఎంఎస్ అపార్ట్‌మెంట్‌లో ఉన్న కుటుంబం రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రపోయింది. ఉదయం నిద్ర లేచి చూసేసరికి కిటికీ నుంచి ప్రధాన ద్వారం తలుపు గడియను తీసి లోపలకు ప్రవేశించాడు. కప్‌బోర్డులో ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించాడు. దీనితోపాటు ఈ అపార్టుమెంట్‌కు వెనుక వైపు ఉన్న ఇంట్లో తాళాలు పగలుగొట్టి చోరీ చేశాడు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తును సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ చేపట్టారు. చోరీలు జరిగిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా అందులో మోహనరావు ముఖం కనిపించింది. మోహనరావు వద్ద నుంచి రూ.26లక్షల విలువ చేసే 349 గ్రాముల బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు.

నెల్లూరు నుంచి ఎస్.కోట వరకు..

మోహనరావు నెల్లూరులో ఉన్నట్టు పోలీసులకు ఉప్పందింది. దీనితో సీసీఎస్‌లోని ఒక బృందం అక్కడికి వెళ్లగా పరారయ్యాడు. తర్వాత కొన్ని రోజులకు అతడు విజయవాడలో ఉన్నట్టు సమాచారం తెలిసింది. ఈ సమాచారం అందిన కొద్దిసేపటికి హనుమాన్ జంక్షన్‌లో ఉన్నట్టు మరో సమాచారం లభించింది. దీనితో నిందితుడు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నాడని అనుమానించి పీఎన్‌బీఎస్‌కు వెళ్లారు. తుని వైపునకు వెళ్లే బస్సులను పరిశీలించగా అక్కడ మోహనరావు ఛాయలు కనిపించలేదు. పీఎన్‌బీఎస్‌లో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తే ఎస్.కోట వెళ్లే బస్సు ఎక్కినట్టు దృశ్యాలు కనిపించాయి. అప్పటికే ఎస్.కోటకు బయలుదేరిన బస్సు ఎక్కేశాడు. ఇక్కడ విచారణ కేంద్రంలో ఎస్.కోటకు వెళ్లిన బస్సుల డ్రైవర్ల ఫోన్ నంబర్లు, వివరాలు నమోదు కాలేదు. దీనితో వెంటనే ఎస్.కోట డిపో మేనేజర్‌తో ఫోన్‌లో టచ్‌లోకి వెళ్లారు. పీఎన్‌బీఎస్ నుంచి ఎస్.కోటకు బయలుదేరిన బస్సుల డ్రైవర్ల నంబర్లను తీసుకున్నారు. వారికి మోహనరావు ఫొటోను వాట్సాప్‌లో పంపగా ఒక బస్సు డ్రైవర్ తన బస్సులో ఉన్నట్టు సమాచారం ఇచ్చాడు. ఆ బస్సు ఎక్కడుందో తెలుసుని విజయవాడ నుంచి ప్రత్యేక వాహనంలో లక్ష్మీనారాయణ టీం బయలుదేరింది. సరిగ్గా రాజమండ్రిలోని దివాన్‌చెరువు వద్ద కాపుగాచి ఎస్.కోట బస్సును తనిఖీ చేయగా మోహనరావు ముఖానికి మాస్క్ ధరించి ఒక మూలన కూర్చున్నట్టు గుర్తించారు. అతడ్ని అక్కడి నుంచి విజయవాడకు తీసుకొచ్చి విచారించగా నేరాల చిట్టా వెలుగులోకి వచ్చింది. ఒకసారి చోరీ చేసిన తర్వాత రెండేళ్ల వరకు చిక్కడని పోలీసులకు ఒక నమ్మకం. విజయవాడ పోలీసులకు చిక్కడానికి రెండు నెలల ముందు హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యాడు.

నన్ను ఎలా పట్టుకున్నారో చెప్పండి ప్లీజ్..

ఏదైనా నేరంలో చిక్కినప్పుడు నిందితులను పోలీసులు ప్రశ్నిస్తారు. సీసీఎస్ పోలీసులను మాత్రం నిందితుడు మోహనరావు ప్రశ్నించాడు. తనను ఎలా పట్టుకున్నారో చెప్పాలని పలుమార్లు అడిగాడు. మోహనరావు చోరీ చేసిన తర్వాత పోలీసులకు చిక్కడానికి రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. అతడు ఎక్కడున్నాడో సమాచారం తెలుసుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. చర్లపల్లి జైలు నుంచి బయటకు రాగానే సీసీఎస్ పోలీసులకు చిక్కడంతో ఈ ప్రశ్న వేసినట్టు తెలిసింది.

ఒంటిపై దుస్తుల్లేకుండా చోరీలు

మోహనరావును విచారించే క్రమంలో పోలీసులకు అనేక కొత్త విషయాలు తెలిశాయి. సాధారణంగా చోరీలు చేయడాన్ని వ్యసనంగా మార్చుకున్న నేరగాళ్లు గ్యాంగ్‌లను నిర్వహిస్తారు. ఇద్దరు, ముగ్గురు కలిసి ఒక గ్యాంగ్‌గా ఏర్పడి చోరీలు చేస్తారు. మోహనరావు దీనికి భిన్నంగా నేరాలు చేస్తాడు. ఎక్కడ చోరీలు చేయాలనుకున్నా ఒంటరిగా వెళ్తాడు. దీనికి ముందుగా నేరం చేయాలనుకున్న ప్రదేశంలో రెండు, మూడు రెక్కీలు నిర్వహిస్తాడు. ఇంట్లో మనుషులు ఉన్నా, లేకపోయినా చోరీ చేయాలని నిర్ణయించుకున్న తర్వాత దాన్ని నెరవేర్చుకుంటాడు. చోరీ చేయాలనుకున్న ఇంటికి పక్కనే ఖాళీ స్థలం ఉంటేనే దాన్ని ఎంచుకుంటాడు. దొంగతనం చేయడానికి బయలుదేరినప్పుడు ఆ ఇంటికి సమీపంలో పాడుబడిన భవనంలోకి గానీ, తుప్పల్లోకి గానీ వెళ్తాడు. అక్కడ మొత్తం దుస్తులను తీసేస్తాడు. ఆ తర్వాత గోడ దూకి ఆ ఇంట్లోకి ప్రవేశిస్తాడు. అనుకున్న పని సజావుగా జరిగిన తర్వాత మళ్లీ దుస్తులు ధరించి అక్కడి నుంచి వెళ్లిపోతాడు. కొంతదూరం వచ్చిన తర్వాత ఉపయోగించిన ఫోన్, సిమ్ కార్డులను పడేస్తాడు. రూ.1000 విలువ చేసే ఫోన్లు మాత్రమే ఉపయోగిస్తాడు. ఇలా కాజేసిన సొత్తును రెండు, మూడు చోట్ల విక్రయించేస్తాడు. ఈ సొమ్మును తీసుకుని తునికి వెళ్తాడు. నేరుగా ఇంటికి వెళ్లకుండా తన బావమరిదికి కబురుపెడతాడు. తాను ఏ లాడ్జిలో ఉంటున్నాడో బావమరిదికి చెబుతాడు. భార్యపిల్లలను ఆ లాడ్జికి రప్పించుకుంటాడు. డబ్బును ఆమెకు ఇస్తాడు. భార్యపిల్లలతో అక్కడే ముచ్చటిస్తాడు. తర్వాత మళ్లీ దొంగతనాలు చేసే ఇళ్లను ఎంచుకునే పనిలో నిమగ్నమవుతాడు. తునికి సమీపంలో రూ.80లక్షలతో భారీ భవనాన్ని నిర్మిస్తున్నట్టు సమాచారం. కంచర్ల మోహనరావుపై రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ అనేక కేసులు ఉన్నాయి. విశాఖపట్నం, కాకినాడ, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజమండ్రి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, హైదరాబాద్‌లో సుమారుగా 40 కేసులు ఉన్నాయి.

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్ట్

రూ. 7 వేలు నగదు స్వాధీనం.. రిమాండ్‌కు తరలింపు

సింగరాయకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పలు చోరీ కేసుల్లో నిందితుడిని సింగరాయకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ. 7వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. గురువారం నిందితుడిని కనిగిరి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం పద్మనాభపురం గ్రామానికి చెందిన గోల్లంగి ప్రవీణ్‌కుమార్ చేడు వ్యసనాలకు బానిసై రాత్రిపూట సంచరిస్తూ తాళాలు వేసిన దుకాణాలను టార్గెట్‌చేసి వాటిని పగలకొట్టి నేరాలకు పాల్పడుతూ ఉంటాడు. ఈ క్రమంలో ఈనెల 22వ తేదీ రాత్రి సింగరాయకొండ కందుకూరు రోడ్డు సెంటర్‌లోని పాత ఇనుము కొట్టు తాళాలు పగలుకొట్టి అందులోని క్యాష్ టెబుల్లో ఉన్న రూ.5వేలు గుర్తు తెలియని దుండగుడు తీసుకెళ్లారు. 23వ తేదీ దుకాణానికి చెందిన షేక్ ముజీబ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన సమయంలో సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం రైల్వేస్టేషన్ రోడ్డులో సంచరిస్తున్న నిందితుడు ప్రవీణ్‌కుమార్‌ను ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. నిందుతుడి నుంచి రూ.7వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. గురువారం అతన్ని కనిగిరి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. పలు జిల్లాలో ఐదు కేసుల్లో నిందితుడిగా ఉన్న పాత నేరస్థుడు ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన సీఐ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, ఏఎస్సై మహబూబ్ బాషా, హెడ్‌కానిస్టేబుల్ తిరుపతిస్వామి, కానిస్టేబుళ్ల రవి, సుమన్‌లను డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్పీ దామోదర్ అభినందించారు.

అవీఇవీ

కాలువలో చిక్కుకున్న ఆవుదూడ

2 గంటలు శ్రమించిన ఫైర్, మున్సిపల్ సిబ్బంది

సురక్షితంగా బయటకు...



కాలువ లోపల చిక్కుకుపోయిన ఆవుదూడ

మార్కాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస థియేటర్ ప్రాంతంలోని శివాజీనగర్ 3వ లైన్‌లో ఒక ఆవుదూడ మురుగు కాలువలోకి దిగి చిక్కుకుపోయింది. ఎంత ప్రయత్నించినా వెనక్కి తిరిగి వచ్చేందుకు వీలులేకపోయింది. ఇది గమనించిన స్థానికులు విషయాన్ని పశుప్రేమికుడైన బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావుకు తెలియజేశారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న ఆయన ఫైర్, మున్సిపాలిటీ అధికారులకు సమాచారం అందించారు. వారు ఎంత ప్రయత్నించినా ఆవుదూడ ముందుకు, వెనక్కి కదల్లేకపోయింది. దీంతో సుమారు 10 అడుగుల మేర మురుగు కాలువను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. దూడకు ఎలాంటి ప్రమాదం కలగకుండా తాడు సాయంతో బయటకు లాగారు. సుమారు రెండు గంటలపాటు శ్రమించి ఆవుదూడను బయటకు తీసిన ఫైర్, మున్సిపల్ సిబ్బందికి ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



ఆవుకు తాడుకడుతున్న పోలీస్.. బయటకు తీశాక పూజలు చేస్తున్న ప్రజలు

భూకంపాలపై ఆందోళన వద్దు!

- ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్త శశిధర్



అవగాహన కల్పిస్తున్న ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్త శశిధర్, సీనియర్ సైంటిస్టు సురేష్, పక్కన ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ముండ్లమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు మండలంలో శనివారం నుంచి సోమవారం వరకు సంభవించిన భూకంపాలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ) శాస్త్రవేత్త డి.శశిధర్ అన్నారు. గురువారం ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రజలకు భూకంపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా భూకంపాలు ఎలా వస్తాయి?, ఎలా ఎదుర్కోవాలి? అనే విషయాలపై ప్రొజెక్టర్ ద్వారా ప్రజలకు వివరించారు. అనంతరం శశిధర్ మాట్లాడుతూ 1967 నుంచి భూకంపాలు వస్తున్నాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయని తెలిపారు. ప్రకాశం జిల్లాలో 1967లో రిక్టర్ స్కేల్‌పై 5.4గా చూపించిందన్నారు. 2007 నుంచి ప్రకాశం జిల్లాలో పలు ప్రాంతాల్లో భూకంపాలు వచ్చాయన్నారు. ముండ్లమూరు మండలంలో శనివారం వచ్చిన భూకంపం 3.1గా నమోదైందన్నారు. ఆ తరువాత ఎనిమిది సార్లు తక్కువగా నమోదైందన్నారు. దీనివల్ల ప్రజలు ఎలాంటి భయ భ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. అద్దంకి ప్రాంతమంతా జోన్-3గా గుర్తించినట్లు చెప్పారు. ఈప్రాంతంలో గుండ్లకమ్మ నది ఉండటంతో పాటు ఎక్కువ వర్షపాతం నమోదు అవ్వటం వల్ల ఇలాంటి శబ్దాలు వస్తుంటాయన్నారు. దీనివల్ల ఎటువంటి నష్టం ఉండదన్నారు. ప్రజలు అవగాహన చేసుకోవాలేగాని దాన్ని ఇతరులకు మరోరకంగా చెప్పి భయభ్రాంతులను చేయవద్దన్నారు. జోన్-3గా గుర్తించటం వల్ల అనేకసార్లు వచ్చినా కూడా తక్కువ స్థాయిలోనే వస్తుంది గాని ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉండవన్నారు. మన రాష్ట్రంలో పులిచింతల, నాగాయలంక లాంటి నదీ పరివాహక ప్రాంతాల్లో భూకంపాలు వచ్చాయన్నారు. ఎటువంటి నష్టాలు జరగ లేదన్నారు. అనంతరం భూకంపాలు ఆవశ్యకత, భద్రత అనే అంశాలపై వివరించారు. సంయోగ సరిహద్దు, రూపాంతర సరిహద్దు, వియోగ సరిహద్దు, రెండు పలకాలు కలిసిన సరిహద్దు వెంబడి ఒకదానొకటి వ్యతిరేక దిశలలో కదలటం వల్ల భూమి లోపలి నుంచి మాంగ్మా భూమి ఉపరి తలానికి వస్తుంది. ఇటువంటి పలకాలను వియోగ పలకాలు అని, సరిహద్దును వియోగ సరిహద్దు అంటారని ఆయన తెలిపారు. భూకంప అతి కేంద్రానికి దగ్గరలో గల భవనాలు అత్యధిక తీవ్రత గల తరంగాల తాకిడికి గురై ఒరిగిపోయి ప్రాణ , ఆస్తి నష్టం కలుగుతాయన్నారు. తక్కువ శాతం నమోదైతే భూకంపాల వల్ల ప్రమాదం ఉండదన్నారు.. ఇసుక తవ్వకాలు, గ్రావెల్ తవ్వకాలు వల్ల భూకంపాలు వస్తాయనేది అపోహ మాత్రమేనని చెప్పారు. గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతాల్లో భూకంపాల జోన్‌గా గుర్తించినా కూడా అంత ప్రమాదమంటూ ఏమి ఉండదన్నారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త సురేష్, విపత్తు నిర్వాహణ సంస్థ డిజార్టర్ మేనేజర్ కె.బస్వంత్‌రెడ్డి, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కరవది రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత

- **నిర్మాణం పూర్తి కాని ఫ్లాట్‌ఫాంలు, ఇతర అభివృద్ధి పనులు**
- **ఫ్లైఓవర్ వంతెన లేక అవస్థలు**
- **పలు రైళ్ల స్టాపింగ్‌ల కోసం ప్రయాణికుల విజ్ఞప్తి**



ప్లాట్‌ఫారాలు లేకుండా ఉన్నస్థితి

ఒంగోలు(రూరల్), డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది రైల్వేస్టేషలో పలు సమస్యలు కూత పెడుతున్నాయి. ఇక్కడి రైల్వేస్టేషన్ భవనం ఏడాది క్రితం నూతనంగా నిర్మించారు. కాని ప్రయాణికులకు మాత్రం ఎలాంటి మౌలికవసతులు, సౌకర్యాలను ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఈ స్టేషన్ నుంచి ప్యాసింజర్ రైళ్లు మాత్రం ప్రతి రోజు ప్రయాణిస్తుంటాయి. రైల్వే ట్రాక్‌కు తూర్పున స్టేషన్ భవనం ఉంది. అక్కడ టికెట్ తీసుకున్న ప్రయాణికులు రైలు ఎక్కాలంటే ప్లాంట్‌ఫాంకు వెళ్లాలి. అయితే ఎలాంటి ప్లాంట్‌ఫాంలు లేకపోవడంతో రైలు ఎక్కాలన్నా, దిగాలన్నా ప్రమాదకరంగా ఉంటోంది. దీనికితోడు ప్లాట్‌ఫాంలకు చేరుకోవటానికి ఫ్లై ఓవర్ నిర్మాణానికి కాంట్రాక్టర్ పునాదుల వరకు దిమ్మెలు పోసి వదిలేశారు. ఇందుకు సంబంధించిన ఇనుప పరికరాలను కూడా తెచ్చి స్టేషన్ దగ్గర ఉంచారు. సిమెంట్ దిమ్మెలు శిథిలావస్థకు చేరడంతో పాటు ఫ్లైఓవర్‌కు సంబంధించిన ఇనుప పరికరాలు మాత్రం తుప్పుపట్టిపోతున్నాయి. అంతేగాకుండా ఈ స్టేషన్ నుంచి వృద్ధులు, పిల్లలు, మహిళలు ప్రయాణం చేయలేక ప్రయాణం విరమించుకుంటున్నారు. గతంలో కరవది స్టేషన్‌లో కాకినాడ-తిరుపతి ప్యాసింజర్ రైలు ఆగేది. అయితే కరోనా తరువాత నుంచి ఈ రైలును ఎక్స్‌ప్రెస్‌గా మార్చటంతో ఇక్కడ స్టాపింగ్ లేకుండాపోయింది. కాగా ఈ స్టేషన్ పరిసరాలలో 15 గ్రామాలు ఉన్నాయి. ఎక్కువగా ప్రజలు తిరుపతి, విజయవాడ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు కంటే రైలు చార్జీలు తక్కువగా ఉండటంతో ప్రయాణికులు రైలు ప్రయాణానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈక్రమంలో కాకినాడ-తిరుపతి రైలు స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు తిరుపతికి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. సంబంధిత రైల్వే అధికారులు కాకినాడ-తిరుపతి రైలును స్టాపింగ్ ఏర్పాటు చేయడంతో పాటు స్టేషన్‌లో ప్లాంట్‌పాంలు. ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



వంతెన కోసం సిమెంట్ బేస్ మట్టం దిమ్మెలు



వంతెన నిర్మాణానికి తెచ్చిన సామగ్రికి తుప్పు

హద్దురాయి.. ఓ చరిత్ర కలదోయి...!

మానవ పుట్టుక తర్వాత.. రాతి యుగం నుంచే అనేక పరిణామాలు వేగంగా మారిపోయాయి. తొలుత రాతితో నిప్పును కనుగొన్నాక నాగరికతలో అనుహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. తొలినాళ్ల నుంచే రాళ్లకు, మానవులకు ఎన్నో విషయాలలో అవినాభావ సంబంధం ఉంది. అలాఅలా సమాజం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఊళ్ల సరిహద్దుల కోసమూ రాళ్లను వాడారు. అవి చిరస్థాయిగా ఉంటూ భావితరాలకు దిక్సూచిలా మారాయి. దాదాపు రెండు శతాబ్దాల కిందట అద్దంకి ప్రాంతంలో వేసిన సరిహద్దు రాయి ఎంతో చరిత్రను సొంతం చేసుకుంది. అదేంటో తెలుసుకుందాం..

- రెండు శతాబ్దాలుగా పదిలం
- నాడు నెల్లూరు, కృష్ణా జిల్లాల సరిహద్దుగా అద్దంకి
- నరసరావుపేట తాలూకా పరిధిలో
- బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాలు
- అప్పట్లో ఆ ప్రాంతాలు కృష్ణా జిల్లాలో కలిసి ఉండేవి...
- ఇక అద్దంకి ప్రాంతం నెల్లూరులో అంతర్భాగం
- గుంటూరు జిల్లా ఏర్పాటుతో మారిన ముఖచిత్రం



అద్దంకి, బల్లికురవ మండలాల సరిహద్దులో నామ్ రోడ్డు వెంబడి ఉన్న రెండు శతాబ్దాల నాటి హద్దు రాయి

అద్దంకి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : రెండు శతాబ్దాల క్రితం నాటి చరిత్రకు అద్దంకి ప్రాంతంలోని ఓ సరిహద్దు రాయి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. ప్రస్తుతం అద్దంకి, బల్లికురవ మండలాల సరిహద్దులో నామ్ రోడ్డు వెంబడి ఉన్న సరిహద్దు రాయి రెండు శతాబ్దాల క్రితం నెల్లూరు, కృష్ణా జిల్లాల సరిహద్దుగా ఉండేది. ఈ క్రమంలో రెండు జిల్లాల హద్దుగా అప్పట్లో ఆ రాయి ఆయా జిల్లాలకు స్వాగతం పలుకుతున్నట్లు ఏర్పాటైందని భావిస్తున్నారు. 1850 ప్రాంతంలో నెల్లూరు, కృష్ణా(అనంతరం కృష్ణా జిల్లాగా మార్పు చెందింది) జిల్లాలు మాత్రమే ఉన్నాయి. అద్దంకి కేంద్రంగా ఉన్న చందలూరు తాలూకా నెల్లూరు జిల్లా పరిధిలో ఉండేది. బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాలతో కలిసి ఉన్న నరసరావుపేట తాలూకా కృష్ణా జిల్లా పరిధిలో ఉండేది. దీనికి సరిహద్దుగా కొప్పెరపాడు,చినకొత్తపల్లి రెవెన్యూ సరిహద్దులో రాయిఏర్పాటు చేశారు. మధ్యలో కొద్దికాలం ఒంగోలు కేంద్రంగా పల్నాడు జిల్లా, గుంటూరు కేంద్రంగా గుంటూరు జిల్లాలు ఏర్పాటైనా కొద్దికాలానికే రద్దు చేశారు.

నామ్ రోడ్డు విస్తరణలో వెలుగులోకి...

నాటి జిల్లాల హద్దు రాయి కాస్తా రోడ్డు మార్జిన్‌లో పడి పోయి నిరాదరణకు గురైంది. నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల(నామ్) ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ సమయంలో హద్దురాయి వెలుగులోకి వచ్చింది. దీంతో అద్దంకికి చెందిన రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు, పురావస్తు పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి రెండు జిల్లాల సరిహద్దు రాయిగా గుర్తించి శాశ్వతంగా ఉండేలా నామ్‌రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకుపోయి భవిష్యత్ తరాలకు కూడా గుర్తు ఉండేలా కాంక్రీట్‌తో దిమ్మె వేయించి ఏర్పాటు చేయించారు.

1904 తర్వాత మారిన స్వరూపం

1904లో గుంటూరు జిల్లా ఏర్పాటు తరువాత అద్దంకి తాలూకా రద్దై ఒంగోలు తాలూకాలో కలిసింది. బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాలు మాత్రం నరసరావుపేట తాలూకా పరిధిలో ఉండి గుంటూరు జిల్లాలో అంతర్భాగంగా మారాయి. 1970లో ఒంగోలు జిల్లా(1972లో ప్రకాశం జిల్లా)గా ఏర్పాటు తరువాత నరసరావుపేట తాలూకా పరిధిలోని సంతమాగులూరు, బల్లికురవ ప్రాంతాలను తొలగించి మళ్లీ అద్దంకి తాలూకా కేంద్రంగా చేసి కలిపారు.



నెల్లూరు జిల్లా ప్రారంభం అవుతున్నట్లు సరిహద్దు రాయి →

← కృష్ణా జిల్లా ప్రారంభం అవుతున్నట్లు ఉన్నసరిహద్దు రాయి

భవిష్యత్ తరాలకు కూడా గుర్తుండేలా

జ్యోతి చంద్రమౌళి, పురావస్తు పరిశోధకుడు, అద్దంకి



రెండు శతాబ్దాల కిందట అద్దంకి ప్రాంతం అప్పటి నెల్లూరు, కృష్ణా జిల్లాల సరిహద్దుగా ఉండేది. ఈ క్రమంలో సరిహద్దులో రెండు జిల్లాలకు స్వాగతం పలుకుతున్నట్లు ఒక వైపు నెల్లూరు, మరో వైపు కృష్ణా పేర్లతో సరిహద్దు రాయి ఉండేది. నిరాదరణకు గురై రోడ్డు మార్జిన్‌లో పడి ఉండటంతో నామ్ రోడ్డు నిర్మాణ సమయంలో భవిష్యత్ తరాలు కూడా గుర్తుంచుకునే విధంగా ఏర్పాటు చేయించారు.

అద్భుతం..!



సీసాలో నూలు అల్లికతో మంచం తయారీ

అభినందించిన విశ్వకర్మ ప్రతినిధులు

పంగులూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గాజు సీసాలో మంచం అమర్చి, ఆ మంచానికి నూలు అల్లికతో అద్భుతకళను ప్రదర్శించారు దారుశిల్పి కళాకారుడు వంగవోలు నాగేశ్వరరావు. మండలంలోని బూదవాడ గ్రామానికి చెందిన నాగేశ్వరరావు తయారు చేసిన ఈ అద్భుతం చూపరులను అబ్బురపరుస్తోంది. నాగేశ్వరరావు ప్రదర్శించిన కళను విశ్వకర్మ ప్రతినిధులు అభినందించారు. గురువారం ఆ కళాకారునికి విశ్వకర్మ ప్రతినిధులు బియ్యంతోపాటు నిత్యావసరాలను బహూకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు టి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుకు అభినందనలు

- పుష్పగుచ్ఛం అందజేసిన ఎన్‌జీవో నాయకులు



డీఎంహెచ్‌వోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీఎన్‌జీవో నాయకులు

ఒంగోలుకల్చరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన వైద్యఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ టి.వెంకటేశ్వర్లు గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను పలు సంఘాల వారు కలిసి అభినందనలు తెలిపారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, హెచ్ఐవీ ప్రివెన్షన్ యూనిట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ డాక్టర్ వెంకటేశ్వర్లును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హెల్ప్, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా హెచ్ఐవీ నిర్మూలన సమీకృత వ్యూహం(దిషా) ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధితులకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఇక ఏపీఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌బాబు, కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ నేతలు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లును కలిసి అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి కె.శివకుమార్, ఉపాధ్యక్షులు పి.రామాంజనేయులు, బి.కృష్ణకిషోర్, నగర అధ్యక్షుడు కొత్తపల్లి మంజేష్, కార్యదర్శి షేక్ మగ్దూంషరీఫ్, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ పి.మాధవి, జిల్లా అధ్యక్షురాలు కె.కోటేశ్వరమ్మ, ఎస్.నారాయణమ్మ, చింతా శేషుబాబు, కె.బాలకోటయ్య పాల్గొన్నారు.


కిలాడీ లేడీ

- వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి దోపిడీ
- ఆరు సవర్ల బంగారు ఆభరణాల చోరీ
- విచారిస్తున్న పోలీసులు

ఒంగోలు(క్రైం), డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఓ మహిళ.. వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లింది. ఈ ఘటన ఒంగోలులో వెలుగుచూసింది. వివరాలలోకి వెళితే.. స్థానిక సమతానగర్‌లో సుమారు 65 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధురాలు నివాసం ఉంటుంది. ఆమెకు ఇద్దరు సంతానం. వృద్ధురాలు ఒక్కరే ఓ ఇంట్లో ఉంటుంది. ఆమె ఉంటున్న నివాసంలోని మొదటి అంతస్తు ఖాళీగా ఉంది. ఈనెల 19వ తేదీన ఓ మహిళ ఇల్లు అద్దెకు కావాలని వృద్ధురాలితో అడిగింది. ఆమె ఒంటరిగా ఉండటం గమనించింది. ఇల్లు చూసుకున్న తరువాత రేపు వస్తానని చెప్పి వెళ్లింది. మరుసటి రోజు తిరిగి వచ్చిన ఆ మహిళ, వృద్ధురాలి వద్దకు వెళ్లి మాటలు కలిపింది. ఆమెకు వేరుశనగ ముద్ద ఇచ్చి తినాలని చెప్పింది. తరువాత కొద్ది సేపటికి వృద్ధురాలు మత్తులోకి జారుకుంది. దీంతో ఆమె వద్ద ఉన్న సుమారు ఆరు సవర్ల బంగారు ఆభరణాలు అపహరించి ఉడాయించింది. ఆరోజు సాయంత్రం వృద్ధురాలి ఇంట్లో లైట్లు వెలగకపోవడాన్ని ఇరుగుపొరుగు వారు గుర్తించి వెళ్లి చూడగా మత్తుగా పడుకొని ఉంది. ఈమేరకు సమాచారం ఇవ్వగా ఆమె కుమారుడు వచ్చి ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజుల తరువాత స్పృహలోకి వచ్చిన వృద్ధురాలు జరిగిన విషయం చెప్పడంతో బుధవారం రాత్రి తాలూకా పోలీసులకు ఆమె కుమారుడు ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీపుటేజీలను సేకరిస్తున్నారు.

పెళ్లయిన 40 రోజులకే..

- ఉరివేసుకొని వధువు ఆత్మహత్య
- భర్త, అత్తమామల వేధింపులే కారణమని మృతురాలి తండ్రి ఫిర్యాదు
- శానంపూడి ఎస్సీకాలనీలో సంఘటన



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, డిసెంబరు 26 : భర్త, అత్తమామల వేధింపులు తాళలేక నవ వధువు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జరుగుమల్లి గ్రామానికి చెందిన పాలపర్తి అమూల్య(19)కు మండలంలోని శానంపూడికి చెందిన తగరం గోపీకృష్ణతో గత నెల నవంబరు 17వ తేదీన వివాహమైంది. అప్పటి నుంచి భర్త గోపీకృష్ణ, అత్త ఆదిలక్ష్మి, మామ కృపానందం అమూల్యను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు. వివాహం అయిన తరువాత తొలి పండుగైన క్రిస్మస్‌కు పుట్టింటికి వెళ్తానన్నా నససేమీరా అన్నారు. భర్త, అత్తమామల వేధింపులు తట్టుకోలేక అమూల్య బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకొన్న సీఐ హజరత్తయ్య, జరుగుమల్లి ఎస్సై బత్తుల మహేంద్ర, తహసీల్దార్ రవి గురువారం ఉదయం శానంపూడికి వెళ్లి అమూల్య మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తండ్రి పాలపర్తి చిరంజీవి ఫిర్యాదు మేరకు సీఐ హజరత్తయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అమూల్య (ఫైల్)

దేశ అభివృద్ధిలో సీపీఐ పోరాటాలదే కీలక పాత్ర

- పేదల కోసం ప్రతి నిత్యం పోరాటం
- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య
- ఒంగోలులో ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు



ప్రసంగిస్తున్న ఈశ్వరయ్య, వేదికపై వెంకటేశ్వర్లు(అన్న), వెంకయ్య, నారాయణ

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో భూ పోరాటాల ద్వారా లక్షలాది మంది పేదలకు భూమిని పంపిణీ చేసి, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఘనత భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)దేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య చెప్పారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలు గురువారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సీనియర్ నేత నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) పార్టీ జెండాను ఆవిష్కరించారు. భారీ కేక్‌ను శ్రేణుల మధ్య కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా హాజరైన ఈశ్వరయ్య మాట్లాడుతూ ఏడాదిపాటు ఈ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వందేళ్లుగా యువకులు, విద్యార్థులు, కళాకారులు, రచయితలు, మేధావులను ఏకం చేసి పోరాటాలు చేసిన ఘనత సీపీఐదేనని చెప్పారు. పార్టీ అధికారంలోకి రాకపోయినా దేశాభివృద్ధిలో కీలక పాత్రపోషించిందని తెలిపారు. భూస్వామ్య, జమీందారీ, జాగీరుదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్ మాట్లాడుతూ సోషలిజం, సమసమాజం కోసం పోరాటాలకు పునరంకితం అవుదామన్నారు. రాష్ట్ర నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) మాట్లాడుతూ దున్నేవారికే భూమి దక్కాలని, దేశంలో తొలిసారి నినాదం చేసిన పార్టీ సీపీఐ అన్నారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలను జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఎర్రజెండాలు చేతపట్టి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, ఎం.వెంకయ్య, నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, సీనియర్ అడ్వకేట్ ముదవర్తి రాఘవరావు, కారుమూడి నాగేశ్వరరావు, కే అంజయ్య, ఎంఎల్ సలార్, సీహెచ్ వెంకటేశ్వర్లు, సుభాన్ నాయుడు, ఎస్‌డీ సర్దార్ పాల్గొన్నారు.



నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

కేజీబీవీ టెండర్లు పారదర్శకంగా నిర్వహించాలి

- తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కేజీబీవీ స్కూల్స్, హాస్టల్స్‌కు అందించే కూరగాయలు, పండ్లు, కోడి మాంసం, గుడ్లు, పాలు, నిత్యావసర సరుకులు సరఫరా చేసేందుకు పిలిచిన టెండర్లు పారదర్శకంగా ఉండాలని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. సమగ్రశిక్ష ఏపీ ఏకపక్ష ధోరణితో తనకు అనుకూలమైన వారికి టెండరు దక్కేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అన్ని జిల్లాలలో కేజీబీవీ హాస్టల్స్‌కు అందించే నిత్యావసరాల సరఫరా కాంట్రాక్టు సీల్డ్ టెండర్ల ద్వారా ఆహ్వానించగా,ఇక్కడమాత్రం ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో టెండర్లు ఆహ్వానిస్తున్నారని ఆరోపించారు. షరతులు విధించి, ఎక్కువ మంది టెండర్లలో పాల్గొనకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరారు.

అద్దంకి వద్ద ఇంటర్ చేంజ్ పాయింట్

బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవేలో ఏర్పాటు

అద్దంకి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేలో అద్దంకి వద్ద నామ్ రోడ్డు కలిసే ప్రాంతంలో ఇంటర్ చేంజ్‌కు అవకాశం కల్పించారు. తొలుత ప్రకటించిన డీపీఆర్‌లో గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభమయ్యే ముప్పవరం తరువాత పొదిలి సమీపంలోని ఉప్పలపాడు వద్ద మాత్రమే ఇంటర్ చేంజ్ పాయింట్ ఉన్నట్లు ప్రకటించారు. అనంతరం అద్దంకి వద్ద కూడా ఇంటర్ చేంజ్ పాయింట్ ఉన్నట్లు ప్రకటించి భూ సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఇంకా సంబంధిత రైతులకు పరిహారం చెల్లింపు జరగకపోవడంతో స్థానికులలో అనుమానాలు వచ్చాయి. ఇంటర్ చేంజ్ పాయింట్ లేదు అనే అనుమానాలను ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో అద్దంకి వద్ద ఇంటర్ చేంజ్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని అద్దంకి పట్టణానికి చెందిన పలువురు ఇటీవల అద్దంకిలో జరిగిన రెవెన్యూ సదస్సులో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అర్జీ ఇచ్చారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు రూపొందించిన మ్యాప్‌లో అద్దంకి వద్ద ఇంటర్ చేంజ్ పాయింట్‌కు అవకాశం కల్పించడంతో అనుమానాలకు తెరపడినట్లు అయింది. దీంతో బెంగళూరు - విజయవాడ హైవేలో కొడిగొండ - ముప్పవరం మధ్య నూతనంగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేలో గతంలో ప్రకటించిన విధంగా 13 ఇంటర్‌చేంజ్ పాయింట్‌లు కాకుండా 14 ఉండనున్నాయి. దీంతో అద్దంకి ప్రాంత ప్రజలు బెంగళూరు, విజయవాడ వెళ్లేందుకు మార్గం మరింత సులువు కానుంది.

అద్దంకి సమీపంలో నల్లవాగు వద్ద బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఇంటర్ చేంజ్ పాయింట్ ఏర్పాటు చేయనున్న నామ్ రోడ్డు ప్రాంతం



31నే పింఛన్ల పంపిణీ

ఒంగోలు(నగరం), డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పింఛనుదారులకు కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది. నూతన సంవత్సరానికి తీపి కబురుగా ఒకరోజు ముందే పింఛనుదారులకు పింఛను నగదు అందచేయనున్నది. సాధారణంగా ప్రభుత్వం ప్రతి నెలా ఒకటిన లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందచేస్తుంది. నూతన సంవత్సరం జనవరి ఒకటో తేదీ ఆదివారం కాకపోయినా ఈ నెల 31వ తేదీనే పింఛన్లు అందచేసేందుకు సిద్ధమయ్యింది. నూతన సంవత్సరాన్ని పింఛనుదారులు ఆనందంగా గడుపుకునేందుకు ప్రభుత్వంచర్యలు తీసుకుంది. ఇందు కోసం జిల్లాలోని 2.85లక్షల మంది పింఛనుదారులకు ఈనెల 31వ తేదీన పింఛను సొమ్ము అందనుంది.

ఆగని వర్షం.. అన్నదాత ఆందోళన

పొగాకు చేలల్లో నిలిచిన వర్షపునీరు ● శనగలో పెరిగిన కలుపు ● పూత, పిందెలేని కంది

కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో రైతుల ఆందోళన

కొండపి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆగకుండా వర్షం కురిసింది. దీంతో పొగాకు, శనగ, కంది, మిరప సాగు చేసిన రైతులు పంటలు దెబ్బతిని పోతాయని ఆందోళన చెందుతున్నారు. గత నెల 27న తుఫాన్ కారణంగా మొదలైన వర్షాలు ఇప్పటి వరకు పడుతూనే ఉన్నాయి. తాజాగా బుధ, గురువారాలు రెండు రోజులు కురిసిన వర్షాలు పొగాకు చెట్టు మొదట్లోకి చేరి మొక్కలు ఉరకలేసే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ముదురు తోటలు రంగు రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎర్రనేలల్లో పొగాకు ఇప్పటికే మూడు, నాలుగు దఫాలు రెల్చారు. పూర్తిగా నల్లగా మాడురకం పొగాకు దిగుబడి వస్తుండటంతో రైతులు పొగాకు చేలను రెటావేటర్‌తో భూమిలో కలియదున్నుతున్నారు. తిరిగి పొగాకు వేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. నల్లరేగడి నేలల్లో పొగాకు కూడా ఒకటి రెండుసార్లు రెల్చగా మాడు రకం పొగాకు క్యూరింగ్ అనంతరం దిగుబడి వస్తోంది. దీంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టాక పొగాకు నాణ్యమైన రంగు రాకపోవడం, కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పొన్నలూరులో శనగ చేలోకి చేరిన వర్షపునీరు

కంది..పోయింది

కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో 700 ఎకరాలకుపైగా కంది సాగు చేశారు. వర్షాల కారణంగా కంది పది అడుగులకు పైగా ఇప్పటికే పెరిగిపోయింది. చెట్టు కాండం, ఆకు పెరిగినా ఇప్పటికీ పూత, పిందె రాలేదని రైతులు చెబుతున్నారు. మర్రిపూడి మండలంలో దాదాపు 400 ఎకరాలకు పైగా కంది సాగు చేశారు. ప్రస్తుతం పిందె, కాయలు దశలో ఉంది. వర్షాలకు పిందెలు, కాయలు పురుగులబారిన పడతాయని వాపోతున్నారు.



కొండపిలో వర్షాలకు పూత, పిందె లేకుండా పది అడుగులకుపైగా పెరిగిన కంది



జరుగుమల్లిలో కురుస్తున్న వర్షాలకు సేద్యాలు లేక కలుపు మొక్కల్లో ఉన్న పొగాకు

శనగ వర్షార్పణం

కొండపి ప్రాంతంలో ఈ ఏడాది శనగ విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. కొండపి, జరుగుమల్లి మండలాల్లో ఇప్పటి వరకు దాదాపు 3000 ఎకరాల్లో శనగ సాగు కాగా పూర్తిగా వర్షాల్లోనే పైరు ఉండిపోయింది. శనగలో కలుపు, పురుగు ఉధృతి పెరిగిపోయింది. తాజా వర్షాలతో శనగ కూడా వర్షార్పణం అవుతుందని రైతులు వాపోతున్నారు.

ముసురుతో రైతుల ఆందోళన

నాగులుప్పలపాడు: అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మినుము, శనగ, మిరప, పొగాకు తదితర మెట్ట పైర్లను సాగు చేశారు. ఇప్పుడిప్పుడే జీవం పోసుకొంటున్న పైర్లు అకాల వర్షాల ధాటికి దెబ్బతినే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రోజు ఇలాగే ముసురు కొనసాగితే సుమారుగా 170 హెక్టార్లలో సాగుచేసిన మినుము పంట పూత, పిందె రాలిపోయి పూర్తిగా దిగుబడి కోల్పోయే ప్రమాదముందని, మిగిలిన పంటలు సైతం దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మద్దిపాడు మండలంలో శనగ, పొగాకు పంటలు నీరు చేరి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటిని బయటికి తోడేందుకు ఇంజన్లు ఉపయోగిస్తున్నారు. లోతట్టు పొలాల్లో వర్షపు నీరు చేరడంతో పంటలు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు ముదురు చేలల్లో మాడాకు దిగుతుందని చెబుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావని శనగ రైతులు వాపోతున్నారు. గుండ్లాపల్లి, మల్లవరం, తెల్లబాడు, దొడ్డవరం, సీతారాంపురం, నందిపాడు, బసవన్నపాలెం గ్రామాల్లో పొగాకు 1127 హెక్టార్లలో సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘ నాయకుడు నారిపెద్ది వరహాలుచౌదరి కోరారు.

మాజీ సైనికుడు మృతి



దేవరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

ఒంగోలు(రూరల్), డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలో మాజీ సైనికుడు వై.దేవరాజు(77) గురువారం మృతి చెందారు. ఆయన గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈక్రమంలో ఆరోగ్యం కుదుటపడక ఆసుపత్రిలో మరణించారు. ఈ సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ సైనికుల గౌరవాధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేవరాజు హవల్దార్ హోదాలో 1971లో జరిగిన పాకిస్తాన్-భారత్ యుద్ధంలో పోరాటం చేసిన వీరుడు అని స్మరించుకున్నారు. యుద్ధం చేయడంతో మంచి నైపుణ్యం కలిగిన నాయకుడు అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికులు పాశం వెంకటరెడ్డి, చుండూరి శ్రీరామూర్తి, సుబ్బారావు, క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

సంతనూతలపాడు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద మహిళాప్రాంగణంలో నిరుద్యోగ మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 15-45 సంవత్సరాల వయస్సుగల నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ షేక్ బాషాను 9963005209 సెల్ నంబరులో సంప్రదించాలన్నారు.

టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

టంగుటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు సారథ్యంలో గురువారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. గంజాయి, మత్తుపదార్థాల కోసం డాగ్ స్క్వాడ్‌తో ఈ తనిఖీలు నిర్వహించారు. టోల్ ప్లాజా మీదుగా వెళ్లే వాహనాలను నిలిపివేసి డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రాంతంలో గంజాయి కేసులు నమోదు కావడంతో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు.

జోరువానలో.. ట్రాఫిక్ చిక్కుల్లో..

● ఇబ్బందులు పడిన వాహనదారులు



భారీగా నిలిచిన వాహనాలు

నగరంలోని దక్షిణ బైపాస్‌రోడ్ (వెంగముక్కలపాలెం) జంక్షన్‌లో గురువారం ఉదయం గంటన్నర సేపు ట్రాఫిక్ స్తంభించింది. ఉదయం 8-30 గంటల సమయంలో ఆవైపు వెళ్ళే కాలేజీ బస్సు రిపేరు కావడంతో రోడ్డుపై అర్ధాంతరంగా ఆగిపోయింది. దీంతో ఆ బస్సును పక్కకు తప్పించే అవకాశం కూడా లేకపోవడంతో సుమారు గంటన్నరసేపు భారీగా బస్సులు, లారీలు, కార్లు, ద్విచక్రవాహనాలు వందల సంఖ్యలో నిలిచిపోయాయి. దీనికితోడు జోరు వాన కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా, ఆ వైపు వెళ్ళే మార్గంలో ఇంజనీరింగ్ కాలేజీ ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వచ్చింది. మరోవైపు యరజర్ల, పొందూరు, సర్వేరెడ్డిపాలెం గ్రామాలకు వెళ్ళాల్సిన ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. దీంతో సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడంతో సమస్య పరిష్కారమైంది.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతాం

సంబంధిత సమాచారం ఇప్పటికే సేకరించాం ● మండల సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల వెల్లడి

ఒంగోలు(రూరల్), డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన అవసరాలు, అందుకు తగిన అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మల్లి కార్జునరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ గ్రామాలకు సంబంధించిన అన్ని రకాల సమాచారం సేకరించామని చెప్పారు. మండలంలో 7,472 కుటుంబాల నుంచి సమాచారం సేకరించామని, ఇందులో 14,280 సమస్యలు గుర్తించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈక్రమంలో కరవది, యరజర్ల, ఉలిచి, చింతాయిగారిపాలెం గ్రామాల్లో సమస్యలు అధికంగా ఉన్నాయని చెప్పారు. 1,016మందికి సొంత స్థలాలు ఉన్నాయని, ఇందులో కొత్తగా ఇళ్లు నిర్మించునేందుకు అనుమతి ఇస్తామన్నారు. 322మందికి వైద్యపరమైన సమస్యలు ఉన్నాయని, ఇక 511మంది నిరుద్యోగులు ఉన్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన రేషన్‌కార్డులు, పెన్షన్లు, నీటికుళాయిలు, నిరుద్యోగుల వివరాలు, ఇతర సమస్యలను గుర్తించామని చెప్పారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు సంక్రాంతి పండగ నాటికి పూర్తి చేయాలన్నారు. ఇక గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నట్లు ప్రజలు ఫోన్ ద్వారా తెలుపుతున్నారని వివరించారు.దశరాజుపల్లి గ్రామంలో గత 15 రోజులు నుంచి తాగునీటి సమస్య ఉందని, అధికారులు అధికారులు తక్షణమే నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. త్రోవగుంట వద్ద పైపులైన్ పగిలి పోవటంతో గ్రామాలకు నీటిసరఫరా నిలిచిపోయిందని, మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఏపీవో మాట్లాడుతూ నూతనంగా 11మంది ఉపాధి పథకం కింద క్షేత్ర సహాయకులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషుబాబు, ఈవోఆర్డీ ఎ.బాల చెన్నయ్య, మండల అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

వంగవీటి రంగాకు ఘన నివాళులు

వర్ధంతి కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహన రంగా వర్ధంతిని కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రధాన రహదారులలో బైక్ ర్యాలీ జరిపారు. అనంతరం రామ్‌నగర్ దగ్గర ఉన్న రంగా విగ్రహానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బండారు మదన్, ఆకుపాటి వెంకటేష్, నారపుశెట్టి రామమోహన్, తంజావూరి శ్రీనివాసమూర్తి, చింతపల్లి నారాయణ, మేకల నారాయణ, లింగిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో..

ఒంగోలు కార్పొరేషన్: జనసేన పార్టీ నాయకుడు కంది రవిశంకర్ నేతృత్వంలో కాపు నేత వంగవీటి మోహన్‌రంగకు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం స్థానిక రవిప్రియమాల్‌లో ఏర్పాటు చేసిన రంగా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ జనసేన నాయకులతో కలిసి రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు సుంకర సాయిబాబు, ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, కార్యదర్శులు చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, నగర ఉపాధ్యక్షులు పిల్లి రాజేష్, నాయకులు కాసాని వాసు, తిరుమలశెట్టి వెంకట్రావు, సుంకర కళ్యాణి పాల్గొన్నారు.





రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, జనసేన కార్యాలయంలో రవిశంకర్ నివాళి

ఒంగోలులో కుండపోత

● వీధులన్నీ జలమయం ● జనం అవస్థలు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వానకు నగరంలోని ప్రధాన వీధుల్లో వర్షపునీరు ఏరులై పారింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వానకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, నగర ప్రధాన రహదారుల్లో మోకాళ్ళ లోతున నీరు నిలబడి చెరువులను తలపించాయి. మరోవైపు పొంగిన మురుగుతో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇక భాగ్యనగర్‌లో పలు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాలలో వర్షపు నీరు పోయే మార్గం లేకపోవడంతో పరిస్థితి మరింత జఠిలమైంది. ఇదిలా ఉండగా దారావారితోట, దేవుడుచెరువు, శర్మాకళాశాల, బాపూజీమార్కెట్ కాంప్లెక్స్, ఆర్టీసీ డిపో ఆవరణం, ఏకలవ్య నగర్, మస్తాన్‌దర్గా సెంటర్‌లో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. ఇక శివారు కాలనీల్లో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. వంటవారికాలనీ, నెహ్రూకాలనీ, బిలాల్‌నగర్, నేతాజీకాలనీలలో పలు గృహాలు నీరు నిలిచి ఉండటంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రగతిభవన్, ఇరిగేషన్ ఆఫీస్, భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో నీరు నిలిచి వాహన రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.



కొప్పోలురోడ్డులో వర్షంలోనూ రాకపోకలు



చెరువును తలపిస్తున్న కర్నూలురోడ్డు



వర్షంలో ఉద్యోగుల ప్రయాణం

వీధి వ్యాపారానికి ఇబ్బంది..

మూడు రోజులుగా ముసురు పట్టడంతో వీధి వ్యాపారం విలవిలలాండిది. ఏరోజు కారోజు పని చేసుకునే పేదలు, వీధి వ్యాపారంపై ఆధారపడి జీవించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం కాలు బయట పెట్టలేని పరిస్థితి ఉండటంతో కొంతమంది ఇళ్ళకే పరిమితం అయ్యారు.

మద్దిపాడు పోలీస్‌స్టేషన్ తనిఖీ

మద్దిపాడు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌ను గురువారం డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పాత కేసులపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. సైబర్ క్రైం జరిగిన వెంటనే 1903 నెంబరుకు డయల్ చేసి వివరాలు తెలియజేయాలని, పోలీసులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు ఉంటాయన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి రేడియం స్టిక్కర్స్‌తో పాటు బోర్డు పెట్టాలని, గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం, వెల్లంపల్లి, సీతారాంపురం కోస్టల్ ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ శివరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి పోరుబాటకు తరలిరావాలి : వైసీపీ

మద్దిపాడు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీ, పోరుబాట ధర్నా కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు సంతనూతలపాడులోని ఎలక్రికల్ ఏఈ కార్యాలయం వద్ద జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మర్రిపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి రుచిత కోరారు. గురువారం రామాయపాలెంలో జరుగుతున్న ఫీవర్‌సర్వేను ఆమె పరిశీలించారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలను విధిగా వాడుకోవాలని సూచించారు. గ్రామంలో జ్వరపీడితులకు మందులు అందజేశారు. విషజ్వరాలతో ఆసుపత్రిలో చేరి ఇంటికి చేరుకున్న మాజీ సర్పంచ్ నాగేశ్వరరావుతోపాటు ఇతర రోగులను పరామర్శించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ క్రిష్ణ, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పంటలను పరిశీలించిన డీఏవో

టంగుటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, ఏడీఏ బీ.రమేష్‌బాబు గురువారం పరిశీలించారు. మినుము సాగు చేసిన రైతులంతా తమ పంటను ఈ-క్రాప్ చేయించుకోవాలని, పంట నష్టం లబ్ధిదారుల జాబితాలో ఉండాలంటే రైతు పేరు నమోదై ఉండాలన్నారు. ప్రస్తుతం వర్షాలకు దెబ్బతిన్న పంటలను ప్రాథమికంగా గుర్తించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపుతున్నట్లు డీఏవో వివరించారు. మండలంలోని మర్లపాడులో డిస్ట్రిక్ట్ వ్యవసాయాధికారి పంటలను పరిశీలించారు. దీనికంటే ముందుగా ఒంగోలు రూరల్ మండలం వెంగముక్కలపాలెంలో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు.



మినుము పంటను పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

అంతుబట్టని పొగాకు పరిస్థితి

పొగాకు పరిస్థితి ప్రస్తుతం ఏమీ అంతుబట్టడం లేదని, ఇంతటితో వర్షం ఆగిపోయి 72 గంటలు గడిస్తే కాని చెప్పలేమని టుబాకో బోర్డు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అన్నారు. ఆలకూరపాడు, ఉప్పలపాడు, తూమాడు, ఎం.నిడమలూరు, మర్లపాడు, మల్లవరప్పాడు, కారుమంచి గ్రామాల్లోని పొగాకు తోటలు పరిశీలించారు. తోటల్లో ఎక్కడా నీరు నిల్వ లేవని, వాన ఇంతటితో పోతే ముదురుతోటలకు డోకా లేదని, లేత తోటల పరిస్థితి 72 గంటలు గడిస్తే చెప్పవచ్చన్నారు. అధిక తేమ వల్ల బొబ్బర తెగులు ఆశిస్తుందని, మొక్కపాదులో గసికతో రంధ్రం వేసి అందులో బైటాక్స్ ద్రావణం పోయాలని వ్యవసాయ విస్తరణాధికారి వెంకటేశ్వర్లు అన్నారు.



పొగాకు తోటను పరిశీలిస్తున్న బోర్డు సూపరింటెండెంట్

భూసమస్యల పరిష్కారానికి కృషి

● తహసీల్దార్ నరసింహం

మర్రిపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ జ్వాలా నరసింహం అన్నారు. గురువారం మర్రిపూడిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మర్రిపూడి గ్రామ కంఠం సర్వే నెంబర్ 547లో 43.20 సెంట్ల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు. 30కిపైగా వివిధ సమస్యలపై రైతుల అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్లూరి నరసింహారావు, మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు హనుమారెడ్డి పాల్గొన్నారు.

దొడ్డవరప్పాడులో..

మద్దిపాడు: దొడ్డవరప్పాడులో గురువారం రెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ సృజనకుమార్ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ అజయ్ కుమార్, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో అంకమ్మ, సర్పంచ్ బెజవాడ శ్రీరామమూర్తి, మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి, ముల్లూరి మురళి, రవి పాల్గొన్నారు.

రుద్రవరంలో..

సంతనూతలపాడు: మండలంలో రుద్రవరం, లక్ష్మీపురం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. 13 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మీ తెలిపారు. వీఆర్వో ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

మర్రిపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న కారణంగా కందిపైరు సంరక్షణకు రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి వెంకటేష్ సూచించారు. కంది పూతదశలో ఉన్నందున వర్షాలకు పూతరాలిపోయే ప్రమాదం ఉందన్నారు. పొలంలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, కార్బన్‌డిజమ్, మాంకోజెబ్ 2.5 గ్రాములు ఒకలీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. కందిలో నీరు నిలబడితే ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి మొక్కమొదలులో పోయాలన్నారు. దీంతో తెగులు వ్యాప్తి చెందదని తెలిపారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

కొండపి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెరిదేపి గ్రామంలోని జడ ఎలీషా చర్చిలో గురువారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. 22 సంవత్సరాలుగా వృద్ధులకు దుస్తులు అందజేయడం ఆనవాయితీగా పెట్టుకున్నారని గ్రామంలోని చర్చి పాస్టర్ ఐజెక్ అభినందించారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారికి ఆధార్‌కార్డును అందజేస్తున్న డీఎల్‌డీవో మహాలక్ష్మి

నాగులుప్పలపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీవో వై.మహాలక్ష్మి కోరారు. మండలంలోని అమ్మనబ్రోలు, కనపర్తి గ్రామాల్లో జరుగుతున్న ఆధార్‌కార్డు శిబిరాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ శిబిరాల ద్వారా కొత్త ఆధార్‌కార్డులను అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, ప్రజలు ఆధార్‌కార్డుల్లోని తప్పులను సరిచేసుకొనే అవకాశం, వివరాల మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం చిన్నారులకు నూతన ఆధార్‌కార్డులను అందజేశారు.

హరిహరక్షేత్రంలో వైభవంగా మండలపూజ



పూలతో అలంకరించిన పదునెట్టాంపడి

చీమకుర్తి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో మండలపూజా కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. క్షేత్రంలోని అయ్యప్పస్వామి మూలవిరాట్‌కి విశేషపూజలు, మహాపంచామృతాభిషేకం జరిపిన తదుపరి సుందరంగా అలంకరించారు. సాయంత్రం శబరిమలలో మెట్లపూజ జరిపిన విధంగానే ఇక్కడ కూడా పద్దెనిమిది మెట్లను పూలతో అలంకరించి పదునెట్టాంపడికి పడిపూజ జరిపారు. పూలంగిసేవ, పడిభజన, కర్పూరహారతి తదుపరి సర్వదీక్షాస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

హైందవ శంఖారావానికి తరలిరావాలి

మద్దిపాడు, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5వ తేదీన ఆర్ఎస్ఎస్, పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న హైందవ శంఖారావం సభకు మండలంలోని హిందువులు, హిందూ సంఘాల నాయకులు భారీగా తరలిరావాలని హైందవ శక్తి మండల కన్వీనర్ నట్టే శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం మద్దిపాడులో ఆయన మాట్లాడుతూ హిందువులు ఏకమై సనాతన ధర్మాన్ని కాపాడటమే లక్ష్యంగా హైందవ శంఖారావం సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5వ తేదీ ఉదయం మండల కేంద్రం మద్దిపాడు నుంచి బస్సులు వెళతాయని, అందువల్ల హిందువులు 9441036834, 9912870840, 9701469445 ఆయా సెల్ నెంబర్లలో పేర్లు రిజిస్టర్ చేయించుకోవాలని ఆయన కోరారు.

న్యూ డెమోక్రసీ పార్టీల కలయికను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విప్లవోద్యమంలో ఏర్పడిన చీలికలను నివారించి, ఐక్యతను సాధించే కృషిలో భాగంగా రెండు న్యూ డెమోక్రసీ పార్టీల కలయిక కోసం ఈ నెల 28న హైదరాబాదులో నిర్వహించే విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కలయిక పీడిత ప్రజా ఉద్యమాలకు పెద్ద ఊపునిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్.సాగర్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో పెరుగుతున్న ఫాసిస్టు ధోరణి ఎదుర్కోవటానికి ఐక్యత ముఖ్యమన్నారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు సంఘం జిల్లా నాయకులు కొంగర నరసింహ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు చొప్పర జాలన్న, కోదూరి హనుమంతరావు, హరిబాబు, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



రహదారిపై గుంతలు పూడుస్తున్న యూత్

మార్కాపురం రహదారిలో గుంతలు పూడ్చిన యువకులు

తర్లుపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు నుంచి మార్కాపురంకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఈ గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో గుంతలు పూడ్చాలని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. డబుల్ రోడ్డు ప్రతిపాదనలు కూడా ఉన్నతాధికారులకు నివేదికను పంపించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ గుంతలు మరీ ఎక్కువ అయ్యాయి. దీంతో తర్లుపాడు యువకులు 10 మంది కలిసి నగదు వేసుకొని తర్లుపాడు నుంచి కమలా స్కూల్ వద్ద వరకు ఉన్న 6 కిలోమీటర్ల మేర చిప్స్ తోలి గుంతలను పూడ్చారు. దీంతో రోడ్డు వెంట వెళ్తున్న ప్రయాణికులు యువకుల కృషిని అభినందించారు. బాలరాజు, పొదిలి కృష్ణ, షేక్ మాలిక్, శ్రీధర్ సుమంత్, కొండబోయిన సునీల్, పి.మణి, ఎమ్.ప్రవీణ్, ఓ.వేణు, ఆర్.బాబులు రోడ్డు గుంతలను పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాలు అమలు చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాయుడు అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ మున్సిపల్ , ఇంజనీరింగ్ కార్మికుల వేతనం పెంచాలని, జీవో నెం.36 ప్రకారం వేతనాలు పెంచాలని, 16 రోజుల సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాలు అమలు చేయాలని కోరారు. ఈ ధర్నాలో కార్మికులు పాల్గొన్నారు.

పొదిలిలో

పొదిలి : మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీల జీవోలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం. రమేష్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు ధర్నా నిర్వహించారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అంటున్న కూటమి ప్రభుత్వమైనా కార్మికులపట్ల సానుభూతి చూపించాలన్నారు. ఈ ధర్నాలో ఏపీ మున్సిపల్ యూనియన్ సంఘ నాయకులు డి. సుబ్బయ్య, కేవీ నరసింహం, పి. నాగేంద్రం, ఏ రాజయ్యలు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు శాంతి

రెవెన్యూ సదస్సులో 12 అర్జీలు

పెద్ద దోర్నాల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో 12 అర్జీలు అందినట్లు తహసీల్దారు కిన్నెర శాంతి తెలిపారు. తమ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని దరఖాస్తులు అందజేశారని, పరిశీలించి త్వరలోనే మంజూరు చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖాధికారులు, ఎర్రగొండపాలెం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు దొడ్డా శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు బాజీ

క్షేత్రస్థాయిలో బీజేపీని బలపర్చాలి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షులు బాజీ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం మార్కాపురం అసెంబ్లీ నియోజవర్గ స్థాయి బూత్ కమిటీల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాజీ మాట్లాడుతూ బీజేపీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మాత్రమే దీనికి కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవిశెట్టి చంద్రశేఖర్, మద్దెల లక్ష్మీ, మిరియాల వాసవి ప్రియ, శాసనాల సరోజిని, ఆంజనేయులు, గ్రంధే సత్యనారాయణ, ఎం.చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా వర్ధంతి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా 36వ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు కాశీనాథ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి బొందిలి కాశీరామ్ సింగ్, కార్యదర్శి సిరిగిరి శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

ముంచిన ముసురు వాన

- పంటలకు తీవ్ర నష్టం
- లబోదిబోమంటున్న రైతన్నలు



తర్లుపాడులో వర్షానికి పూత, పిందె రాలిపోయిన కందిపంట



త్రిపురాంతకంలో తడిచిన వరి ఓదెలను పరిశీలిస్తున్న ఏవో నీరజ

తర్లుపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల నుంచి ముసురు వాన కురుస్తోంది. దీంతో పంటలపై తెగుళ్ల విజృంభిస్తున్నాయి. ఇప్పటికే సాగులో ఉన్న కంది, శనగ, వరిగ, పొగాకు, మినుము, వరి పంటలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భారీ నష్టం వాటిల్లింది. శనగ పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. ఈ వర్షాలకు పులుసు కారిపోయి పూత కూడా రాలిపోతున్నది. తెగులు కూడా విజృంభిస్తున్నాయి. దీంతో శనగ పంట దిగుబడి గణనీయంగా తగ్గనుంది. పొగాకు కూడా ప్రస్తుతం ఆకు రెలుస్తున్నారు. వర్షాలకు ఆకుపై ఉన్న మడ్డి కారిపోతుండటంతో క్యూరింగ్ దశలో బొగులు మాడు వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తర్లుపాడు, కారుమానుపల్లె, మీర్జపేటలో సాగుచేసిన వరి పంట 4రోజుల క్రితం కోసి ఓదెలు వేశారు. ప్రస్తుతం ఈ వర్షానికి ఓదెలు తడిచిపోయి గింజ మొలకెత్తుతుండటంతో ఆరుగాలం శ్రమించిన పంట చేతికి అందుతున్న దశలో ఈ వర్షం నట్టేట ముంచిందని రైతులు కన్నీరు పెడుతున్నారు. కంది పంట కూడా ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఈ వర్షాలకు పూత, పిందె రాలిపోయి కట్టె మాత్రమే మిగులుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది వరిగ పంటను విస్తారంగా సాగు చేశారు. వర్షాలకు వరిగ పంట నేలమీదకు వాలిపోయింది. అలాగే మిర్చి పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. గతంలో కురిసిన వర్షాలకే మిర్చి పంట కొంతమేర దెబ్బతిన్నది. ప్రస్తుత వర్షాలకు కోసిన కాయలు కూడా తాలు రావటంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు తెలుపు తున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

వర్షపు నీటిలో వరి ఓదెలు

త్రిపురాంతకం : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. ఎండూరివారిపాలెం, మేడపి గ్రామాల్లో కూలీలతో కోయించిన వరి ఓదెలు వర్షానికి తడిచిపోవడంతో నష్టం వాటిల్లింది. రైతుల వద్ద సరిపడా పట్టలు లేకపోవడంతో అన్నసముద్రం, ఉమ్మడివరం, ముడివేముల గ్రామాల్లో మొక్కజొన్న పంటల కల్లాల్లో తడిచిపోయింది. మిట్టపాలెం, రామసముద్రం, వెల్లంపల్లి, త్రిపురాంతకం గ్రామాల్లో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి కొంతమేర తడిచిపోయింది. కాగా కల్లాలను మండల వ్యవసాయాధికారి నీరజ, గ్రామ వ్యవసాయ సహాయకులు పరిశీలించి వివరాలు సమోదు చేసుకున్నారు.

మిర్చి రైతుకు అకాల నష్టం

ఆరబెట్టిన కాయలను కాపాడుకునే పనిలో అన్నదాతలు



ఎర్రగొండపాలెంలో మిర్చిపై కప్పిన పట్టలపై చేరిన వర్షపునీరు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుకు కష్టాలు, నష్టాలు తప్పడం లేదు. ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా మిర్చి పంట చేతికి వచ్చింది. కోసి కల్లాల్లో ఆరబెట్టారు రైతులు. అసలే పుచ్చు, ఆకు తెగులుతో దిగిబడి తగ్గి కష్టాల్లో ఉన్న రైతాంగానికి ఈ అకాల వర్షంతో తీవ్ర నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన కోట శ్రీనివాస రెడ్డి 3 ఎకరాలు మిరప సాగు చేసినట్లు ఎకరానికి సుమారు రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టామని తెలిపారు. ఆకు తెగులు, నల్ల తామర పురుగు సోకి ఈ ఏడాది ఖర్చు మరింత పెరిగిందని తెలిపారు. పంట కోసి నాలుగు రోజుల క్రితం ఆరబెట్టామని అన్నారు. ఇంతలో అల్పపీడనం ప్రభావంతో వర్షం పడుతున్నదని, కాయను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.1.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు వారు ఆవేదన వ్యక్తం చేస్తు తెలిపారు.

శనగ రైతుకు శరాఘాతం



కంభం ప్రాంతంలో పూతరాలిపోయిన శనగ

కంభం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో 3 మండలాల్లోని రైతులు వేసిన శనగ పంట దెబ్బతినే ప్రమాదం ఉందని గిద్దలూరు ఏడీఏ బాలాజీ నాయక్ తెలిపారు. డిసెంబరు మొదటి వారంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వలన శనగ పంటకు జీవం పోసినట్లయింది. దీనితో దిగుబడులు బాగా వస్తాయని రైతులు ఆశించారు. ప్రస్తుతం శనగ పంటకు పులుసు పట్టి పూత పూసే సమయంలో 3 రోజులుగా ముసురుపట్టి గురువారం ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. దీంతో శనగ ఆకులు మొద్దుబారిపోయి పూత పూయదన్నారు. ఈ అకాల వర్షాలతో నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

వర్షాలతో తెగుళ్ల ఉధృతి

- గిద్దలూరు ప్రాంతంలో అన్ని పంటలకు నష్టం

గిద్దలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిన్నమొన్నటి దాకా తుఫాన్ వలన పంటలు నాశనం కాగా ప్రస్తుతం రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షంతో రైతుల నడ్డి మళ్లీ విరిగింది. అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షానికి పప్పుశనగ రైతులు 90 శాతం మంది నష్టపోగా ప్రస్తుతం కురుస్తున్న వర్షం వలన మిగిలిన పంట కూడా చేతికి అందే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. అలాగే శనగ కూడా ఈ ముసురువర్షంతో నష్టపోయే పరిస్థితి కనిపిస్తున్నది. మొక్క అయితే ఏపుగా పెరుగుతుందేతప్ప శనగ కాసే పరిస్థితి ఈవర్షంతో ఉండదని, మొక్క మొద్దుబారిపోయే ప్రమాదం ఉందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతతున్నది. సబ్‌డివిజన్ పరిధిలో 5వేల హెక్టార్లలో శనగ నిన్నటి తుఫాన్ వర్షాలకు నష్టపోగా ప్రస్తుతం అన్ని మండలాల్లో కలిపి 800 హెక్టార్ల దాకా సాగులో ఉండగా గిద్దలూరు, కొమరోలు మండలాలలో ముసురు వర్షం దెబ్బకు ఎక్కువగా నష్టపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. కంది రైతులు ఇప్పటికే నష్టపోగా మిగిలిన రైతులకు ఈవర్షం నష్టం చేస్తుందని అంటున్నారు. మిగిలిన పూత కూడా రాలిపోతున్నదని, మిర్చి పంటకు ఈ వర్షం వలన పురుగు , తెగుళ్ల తాకిడి మరింత పెరిగి పురుగు మందుల భారం మరింత పెరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో సాగైన అన్ని పంటలు మొన్నటి తుఫాన్, నేటి ముసురు వర్షం తీవ్ర నష్టం చేకూరుస్తున్నది.

మిరపలో సస్యరక్షణ చేపట్టాలి



మిరప పైరును పరిశీలిస్తున్న అధికారులు

పెద్ద దోర్నాల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలంలోని చింతలలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో సాగు చేసిన పలు పంటలు పరిశీలించారు. వర్షాలకు మిరప పంట దెబ్బతినకుండా ఉండేందుకు చేలో నీరు నిల్వ లేకుండా చూడాలని, తెరిపి ఇవ్వగానే ఎకరాకు 20 కిలోల పొటాష్, 30 కిలోల యూరియా పైపాటుగా వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ పరిపూర్ణ, ఎన్‌జీవో సిబ్బంది కరుణాకర్, ప్రసాద్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



బోడపాడు గ్రామ రెవెన్యూ సదస్సులో అర్జీదారు సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంఎల్ఏ కందుల, సబ్ కలెక్టర్ త్రివినాగ్

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం రూరల్,డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి). భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మండలంలోని బోడపాడు గ్రామంలో తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌లు హాజరయ్యారు. ఈసదస్సులో భూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి వారి సమస్యలను తెలుసుకున్నారు. సభ వద్దే పరిష్కారమయ్యే సమస్యలను అక్కడే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8 వతేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో వచ్చిన ప్రతి వినతిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి రశీదు ఇస్తామని తెలిపారు. బోడపాడు గ్రామంలో అధికంగా మ్యూటేషన్‌కు సంబంధించి వినతులు అధికంగా వచ్చినట్లు తెలిపారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకోవాలి

- ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి

బోడపాడు గ్రామ రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిశీలిస్తే ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలు కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. గ్రామ ప్రజలు భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దుర్మార్గపు చర్యల వలన నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని అన్నారు. బోడపాడు గ్రామంలో ఆక్రమణకు గురైన కోటిన్నర విలువ చేసే ప్రభుత్వ భూమిని కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్‌లు ఎక్స్‌కవేటర్ ద్వారా క్లీన్ చేయించి స్వాధీనం చేసుకున్నారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం

ఆ గ్రామ పరిధిలోని పెద్ద యాచవరం వెళ్లే రోడ్డులో ఎస్సీకాలనీ ఎదురుగా సర్వే నెంబర్ 71-1 లో మొత్తం 10.71 సెంట్ల భూమి ఉంది. అందులో 5 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ ముక్కమళ్ల రమణారెడ్డి ఆక్రమించుకున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఆఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి భూమిలో ఉన్న ఆక్రమణలను తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 37 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నారాయణ, శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థాన ఈవో శ్రీనివాసరెడ్డి, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ సంజీవయ్య, టీడీపీ నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

త్రిపురాంతకం : గ్రామ సభలలో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎండూరివారిపాలెంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వచ్చిన అర్జీలను స్వీకరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీపై తహసీల్దారు వివరణను అడిగారు. కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించేందుకు లారీలు రావడంలేదని టీడీపీ నాయకులు ఆళ్ల నాసరరెడ్డి, దేవినేని చలమయ్య, కె.ఏడుకొండలు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం గ్రామ సమీపంలోని కల్లాల్లో ఉన్న ధాన్యం, మిర్చిని పరిశీలించారు. ఈకార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీపీ రిబ్కా, సర్పంచ్ జి.పేరమ్మ, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంఎల్ఏ కందుల, సబ్ కలెక్టర్ త్రివినాగ్

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

మార్కాపురం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడపాడు గ్రామ రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్ తొలుత ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులతో కొంత సమయం గడిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ 20 ఎక్కాలు వచ్చిన వారు చేతులు ఎత్తమనగా పిల్లలందరూ ఎత్తారు. 19 వ ఎక్కం చెప్పాలని కోరగా వెంటనే చకచకా చేప్పేశారు. దీంతో కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మీ లక్ష్యం ఏమిటని కలెక్టర్ వారిని ప్రశ్నించారు. ఎక్కువ శాతం మంది ఆర్మీ అని తెలుపగా మీ ఉపాధ్యాయుడిని ఆదర్శంగా తీసుకుంటున్నారా అని సంతోషం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడు శ్రీనివాసులు ఆర్మీలో రిటైర్డ్ అయి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆ పాఠశాలలో తన సొంత నిధులతో, దాతల సహకారంతో మౌలిక వసతులు, షెడ్ నిర్మాణం వంటి పనులు చేశారని కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీనివాసులును కలెక్టర్,ఎంఎల్ఎ, సబ్ కలెక్టర్‌లు అభినందించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు.

వివాదరహిత సమస్యలకు తక్షణ పరిష్కారం

తహసీల్దార్ కృష్ణారెడ్డి

పొదిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో వివాదరహితంగా ఉన్న భూసమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని తహసీల్దార్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుంచేపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. భూసమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని చెప్పారు. గ్రామంలో బర్రెలగ్రౌండ్ లేదని, అందుకుగాను స్థలం కేటాయించాలని రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన గ్రామంలో గ్రామకంఠం భూమి ఉందా అని వీఆర్వోను అడిగి తెలుసుకొన్నారు. వెంటనే స్థలాన్ని పరిశీలించి 50సెంట్ల భూమిని బర్రెల గ్రౌండ్‌కు కేటాయించారు. అలాగే మ్యూటేషన్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా 10కిపైగా వివిధ సమస్యలపై రైతులు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గురవయ్య, వీఆర్వో మాల్యాద్రి, సచివాలయ సిబ్బంది, ఈఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనీల్ పాల్గొన్నారు.



కుంచేపల్లి గ్రామంలో బర్రెలగ్రౌండ్ కోసం గ్రామ సంఘాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

సామూహిక గీతాపారాయణం

గిద్దలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రిమాత ఆలయంలో గీతాపారాయణం కార్యక్రమం ఘనంగా జరిగింది. సామూహికంగా జరిగిన గీతా పారాయణంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా గాయత్రిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాయత్రి పరివార్ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతానికి గురై రెండుగేదెలు మృతి



మృతిచెందిన గేదెలు

పొదిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌షాక్‌కు గురై రెండు గేదెలె మృత్యువాతపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నగరపంచాయతీ పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన కీర్తి ప్రసాద్, కంచర్ల నాగేశ్వరరావుకు చెందిన రెండు గేదెలు పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. రోజులాగే పశుగ్రాసం కోసం గేదెలను పొలానికి వదిలామని విద్యుత్ ప్రమాదంలో రెండుగేదెలు మృతి చెందాయన్నారు. గేదెలే జీవనాధారంగా జీవనం సాగిస్తున్నామని ఇలా జరగడం దురదృష్టమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వాటి విలువ సుమారు రూ. లక్షా 50వేలు ఉంటుందని యజమానులు చెప్పారు.

29న రెండు బైక్‌లకు వేలం

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో సిజ్ చేసిన రెండు బైకులను ఈ నెల 29వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎస్సై పి. చౌడయ్య గురువారం తెలిపారు. 2023 సంవత్సరంలో సీజ్ చేసిన ప్యాషన్ ప్రో రూ.5,600, షైన్ రూ.7వేలు చెప్పున వేలం వేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ బైక్‌ల వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

అకాల వర్షం.. అపార నష్టం



కురిచేడు: ఆవులమందలో నీటిలో నానుతున్న వరి ఓదెలు

- మిరపను చుట్టుముట్టిన కొమ్మ తెగులు
- కాయలు పగిలి మొలకెత్తుతున్న మినుము
- పూత రాలిన కంది
- తడిసిన వరి ఓదెలు
- రైతులకు కోలుకోలేని దెబ్బ

పీసీపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మొన్న ఫెంగల్ తుఫాన్, నిన్న వాయుగుండం, నేడు అల్పపీడనం ఇలా 15 రోజుల వ్యవధిలో బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస ఆవర్తనాల ప్రభావంతో మండలంలో అకాల వర్షం కురిసింది. ఈ వర్షంతో పంటలు దెబ్బతినడంతో పాటు పైర్లకు తెగుళ్లు చుట్టుముట్టాయి. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. కొద్ది రోజుల్లో చేతికి వస్తుందనుకున్న పంట కాస్తా కళ్ల ఎదుటే దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 12వేల ఎకరాల కంది, రబీ సీజన్‌లో 3400ఎకరాలకు పైగా మినుము, 500ఎకరాలకు పైగా మిర్చి, 500ఎకరాలలో వరి పంటలను రైతులు సాగుచేశారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం సాగు చేసిన పైర్లన్నీ తెగుళ్లు సోకకుండా పెరిగి మంచి కాపు పట్టాయి. వరుస అల్పపీడనాలతో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో కోతకు వచ్చిన మినుము పైరు తడిసి ముద్దయింది. కంది పూత రాలింది. మిరపకు తెగుళ్లు చుట్టుముట్టాయి. ఫలితంగా పంటలు దెబ్బతిన్నాయి. ఈ వర్షాలు రైతులకు కోలుకోలేని విధంగా నష్టం మిగిల్చాయి.

కాయలు పగిలి.. గింజ మొలకెత్తి

మండలంలో గుంటుపల్లి, తురకపల్లి, పెదయిర్లపాడు, లక్ష్మక్కపల్లి, మెట్లవారిపాలెం, శంకరాపురం, వరిమడుగు తదితర గ్రామాల్లోని రైతులు ఎక్కువమొత్తంలో మినుము సా గుచేశారు. అకాల వర్షాలకు తడిచిన మినుము చెట్లపైనే కాయలు ఉబ్బి గింజలు మొలకెత్తాయి. కొన్ని ప్రాంతాలలో కోత లు కోసినప్పటికీ పంటపైనే వర్షానికి తడిసి ఉండడంతో గింజలు ఉబ్బి రంగు మారాయి. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు సగం పెట్టుబ డి కూడా రాదని ఆవేదన చెందుతున్నారు.



పామూరు: బోడవాడలో దెబ్బతిన్న పొగాకు తోట

మిరపను చుట్టుముట్టిన తెగుళ్లు

అల్పపీడనాల ప్రభావంతో కురిసిన వర్షాలకు మిరప చేలలో తేమశాతం ఎక్కువైంది. దీంతో మిరపను కొమ్మతెగులు, నల్లి, ఆకుముడతలు చుట్టుముట్టాయి. రైతులు రకరకాల రసాయనిక మందులు పిచికారీ చేసినా తెగుళ్లు అదుపులోకి రావడంలేదు. కొమ్మతెగులు సోకిన చెట్ల కొమ్మలు బూజుపట్టి విరిగిపోతున్నాయి. చెట్లకు ఉన్న కాయలు కుళ్లిపోయి కోయకుండానే రాలిపోతున్నాయి. ఇప్పటికే ఎకరాకు సుమారు లక్ష రూపాయల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు.తెగుళ్లు అదుపులోకి రాకపోవడంతో పాటు కళ్లముందే కాయలు రాలిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కంది పూత రాలి..

మండలంలో 12వేల ఎకరాలలో రైతులు కంది పంటను సాగుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కందిచెట్లపై ఉన్న పూత రాలిపోయింది. దాంతోపాటు అధిక వర్షాలతో భూమిలో తేమశాతం ఎక్కువైంది. దీంతో మండలంలోని ముద్దపాడు, పెద్దన్నపల్లి, తలకొండపాడు, పీసీపల్లి, నేరేడుపల్లి తదితర ప్రాంతాల్లో కందిపైరు ఆకులు ఎర్రగా మారి రాలిపోతున్నాయి. చెట్లు ఎండిపోతున్నాయి. ఈ ఏడాది అపరాల దిగుబడి బాగా వస్తుందని ఆశించిన రైతుల ఆశలపై తుఫాన్ నీళ్లు చల్లింది. కంది సాగు కోసం రైతులు ఇప్పటికే ఒక్కో ఎకరాకు రూ.16 వేల నుంచి రూ.22 వేల వరకు ఖర్చుచేశారు.



కనిగిరి: పూత రాలిపోయిన కంది

రైతు కష్టం వర్షార్పణం

కురిచేడు, డిసెంబరు 26: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమ కష్టమంతా వర్షార్పణం అయిందని వాపోతున్నారు. కురిచేడు మండలంలో సాగర్ ఆయకట్టు కింద మాగాణి సాగు చేసిన రైతులు ఎక్కువగా బీపీటీ రకం వరి సాగు చేశారు. ప్రస్తుతం కోతలు కోస్తున్నారు. కోసిన వరి ఓదెలు పొలంలో ఉండగానే అకాల వర్షాలు వాటిని ముంచెత్తాయి.. మునిగిన వరి ఓదెల నుంచి గింజలు మొలకెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిర్చి పంట కోసి కల్లాలో ఉండగానే వర్షం కురవ డంతో పరదాలు కప్పే లోపే తడిచిపోయాయి. కాయలు ఆరబెట్టే అవకా శం లేకుండా మూడు రోజుల నుంచి కాయలు పరదాల చాటున ఉండటంతో మిరప కాయలకు బూజు పట్టి తెల్లగా వచ్చాయి. మండలంలోని ఆవులమందన కల్లూరు, పమర నాయుడుపాలెం, వెంగాయపాలెం గ్రామా లలో వరి ఓదెలు తడవ డంతో పాటు మిర్చి రంగు మారి రైతులు తీవ్రంగా నష్టపో యారు. పొలాల నుంచి ఇంటికి చేరేది ఏమీ లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో రోజు కూడా వర్షం ఉందని వాతావరణ శాఖ సూచనలతో రైతులు ఆందోళన చెం దుతున్నారు.

రైతులకు తీవ్రనష్టం



ముండ్లమూరు: చింతలపూడిలో తడిసిన వరి ఓదెలు

పామూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురిసిన ముసురు వానతో మినుము, పొగా కు శనగ రైతులకు కోలుకోని దెబ్బ తగిలింది. పామూరు, మండలంలో 888 హెక్టార్లలో మినుము, సీఎస్‌పురం మండలంలో 700 ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారు. మినుము పైరు బూజు పట్టి మొలక రావడంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలతో పొగాకు నాణ్యత తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు. మండలంలో 599 హెక్టార్లల్లో సాగులో ఉన్న కంది పైరు వర్షాల ప్రభావంతో పూత రాలిపోయిం దని దిగాలు చెందుతున్నారు. ఈపాటికే శనగ పంట దెబ్బతినడంతో ప్రభుత్వం 80 శాతం రాయితీపై తిరిగి విత్తనాలు అందచేయడంతో రైతులు సాగు చేస్తున్నారు. రబీ సీజన్‌లో అకాల వర్షాలు రైతుల వెన్ను విరిశాయి.

వర్షంతో రైతుల ఆందోళన

దొనకొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో ని గ్రామాల్లో మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షం రైతులను ఆందోళనలను గురిచేస్తుంది. కోసి కల్లాల్లో ఉంచిన మిర్చి తడిసి రంగుమారే పరిస్థితి నెలకొంది. దీంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందు తున్నారు. చెట్టుమీద ఉన్న మిర్చి కాయకు ఇప్పటికే కొంతమేర జెమినీ వైరస్ సోకింది. ఈ ముసురు వర్షం ఆగకపోతే నష్టం తప్పదని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షానికి కంది పూత, పిందె రాలిపోతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

దిగుబడులపై ప్రభావం

తాళ్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి ఓదెలు తడిసిపోవడంతో నష్టం వాటిల్లుతుంది. పొగాకు నాణ్యతపై ఈవర్షం ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో కంది పూత రాలిపోతుండటంతో దిగుబడులు తగ్గుతాయని రైతులు పేర్కొన్నారు.

దెబ్బతిన్న పంటలు

ముండ్లమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. వరి నూర్పిళ్ళు చేయటానికి రైతులు సిద్ధమవుతుండగా వర్షాలతో కుప్పలు నానిపోయాయి. వైట్ బర్లి పొగాకు, మొక్క జొన్న, కంది పంటలు కూడా దెబ్బతిన్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయానికి వానపాలు అయిందని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. పసుపుగల్లు, చింతలపూడి, ముండ్లమూరు, సింగనపాలెం, చంద్రగిరి, వేములబండ, కమ్మవారిపాలెం గ్రామాల్లో వరి ఎక్కువగా సాగు చేశారు. శంకరాపురం, పోలవరం, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, మారెళ్ళ, పూరిమెట్ల, తమ్మలూరు, పసుపుగల్లు గ్రామాల్లో కంది సాగు చేశారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉండగా ముసురుతో దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, వైట్ బర్లీని కూడా వర్షం దెబ్బతీసింది. ఈ వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి.

రైతులను నట్టేట ముంచిన వర్షం

కనిగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కనిగిరి నియోజకవర్గంలో రైతులు అత్యధికంగా మినుము సాగుచేశారు. ఈ వర్షాలతో మినప కాయలు ఉబ్బి కాయలు కుళ్ళిపోయే పరిస్థితి ఏర్పడింది. కనిగిరి మండలంలో 1108 హెక్టార్లు, పామూరులో 888 హెక్టార్లు, పీసీపల్లిలో 1320 హెక్టార్లు, సీఎస్ పురంలో 505 హెక్టార్లు, హెచ్‌ఎంపాడులో 1287 హెక్టార్లు, వెలిగండ్ల మండలంలో 387 హెక్టార్లులో మినుము సాగు చేశారు. అకాల వర్షంతో 666 హెక్టార్లలో పంట పూర్తిగా దెబ్బతింది. అత్యధికంగా పామూరు, సీఎస్‌పురం మండలాల్లో మినుము దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా నష్టాన్ని అంచనా వేశారు. కొన్ని ప్రాంతాల్లో మినుము కోసి ఓదెలు వేశారు. ఈవర్షాలకు ఓదెలు తడిచి కల్లాల్లోనే కాయ కుళ్ళిపోయి పంట దక్కే పరిస్థితి లేకుండా పోయింది. కంది పంటను నియోజకవర్గంలో 20వేల హెక్టార్లులో చేశారు. వర్షాలతో కంది పంట చేతికొచ్చే పరిస్థితి లేకుండా పోయింది. శనగది అదేపరిస్థితి.

అకాల వర్షంతో పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ఏడీఏ ఈవీ రమణ సిబ్బందితో కలసి కనిగిరి మండలంలో గురువారం పొలాలను పరిశీలించారు.

కళ్లముందే పంట దెబ్బతింది

- మోతుకూరి అంకయ్య, పెదవరిమడుగు , పీసీపల్లి మండలం



నేను మూడు ఎకరాల్లో మినుము సాగుచేశాను. ఎటువంటి తెగులు లేకుండా పైరు బాగా కాయలు కాసింది. మరికొద్ది రోజుల్లో కోయడానికి సిద్ధమవుతున్న తరుణంలో వర్షం కురిసింది. మూడునాలుగు రోజులపాటు ముసురు పట్టింది. దీంతో చేలోనే పంట తడిచి ముద్దయింది. చెట్లకు ఉన్న కాయలు ఉబ్బి గింజలు మొలకెత్తాయి.కళ్లముందే పంట దెబ్బతింది. అధికారులు పంటను పరిశీలించి పరిహారం ఇప్పించాలి.

మిరప రైతులను ఆదుకోవాలి

- మూలె బుజ్జిరెడ్డి, మూలెవారిపల్లి, పీసీపల్లి మండలం



నేను 8 ఎకరాలలో మిరపను సాగుచేశాను. చెట్లు బాగా పెరిగి మంచి కాపు పట్టాయి. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షంతో మిరపను తెగుళ్లు చుట్టుముట్టాయి. ఒకవైపు ఎర్రనల్లి, మరోవైపు కొమ్మతెగులు పంటను తీవ్రంగా దెబ్బతీశాయి. తెగుళ్ల తాకిడికి మిరపచెట్ల కొమ్మలు విరిగిపోవడంతో పాటు కోయకుండానే కాయలు రాలిపోయి కుళ్లిపోతున్నాయి. ఇప్పటికే ఎకరాకు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పామూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రానున్న పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు సూచించారు. స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజన, స్వయం కృషి సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, ఏలియా, టి.సాల్మన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల కేంద్రంలో సీపీఐ ఆవిర్భావ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు ఎం.వెంకట కొండయ్య జండాను ఆవిష్కరించారు. సీపీఐ ఏర్పడి వంద సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో జండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్, నిజాం పాలకులకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం, పేదల పక్షాన ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పెద్ద మస్తాన్, సహాయ కార్యదర్శులు జి.నరసింహులు, సవరం రమేష్, రాగి యేసు, ఎస్.పెద్దన్న, షేక్ నాయబ్‌రసూల్, ఇ.ఆదిలక్ష్మి, పోలమ్మ, కె.ఆకాష్, కె.రోహేలమ్మ, అంకమ్మ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవస్థానంలో అన్నదానం

పామూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, శ్రీదేవి, రాణి దంపతుల ఆర్థిక సహకారంతో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాబురావు తరుపున కదిరి పార్థసారధి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ గుత్తి రాజస్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కదిరి రాంబాబు, తిరుపతయ్య, ఓగూరు కొండలరావు, బండి కిరణ్, కంభాల రోశయ్య, వాయినేని మాల్యాద్రి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి



మృతిచెందిన దుర్గ

కురిచేడు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కురిచేడుకు చెందిన యువ లాయర్ ఉప్పలపాటి దుర్గ(35) మృతి చెందాడు. రెండు రోజుల క్రితం వినుకొండ నుంచి కురిచేడుకు ద్విచక్రవాహనంపై వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. చింతలచెరువు గ్రామ సమీపంలో ఓ పాల వ్యాను ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 అం బులెన్స్‌లో వినుకొండకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని కురిచేడుకు తీసుకొచ్చారు. దుర్గకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భూప్రకంపనలతో భయాందోళన చెందొద్దు!

తాళ్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూప్రకంపనలతో భయాందోళన చెందవద్దని జాతీయ జియోఫిజికల్ రిసెర్చ్ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ డి.శశిధర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండలపరిషత్ సమావేశం హాలులో ఒంగోలు ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న అధ్యక్షతన భూకంపాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శశిధర్ మాట్లాడుతూ అద్దంకి సమీపాన గల గుండ్లకమ్మ పరివాహక ప్రాంతం వల్ల భూకంపాలు వస్తుంటాయన్నారు. 1967 నుంచి తరుచూ భూకంపాలు వస్తున్నా రిక్టర్ స్కేల్‌పై 3.1 మించి ఉండటం లేదన్నారు. దీనివల్ల ఎలాంటి ప్రమాదాలు సంభవించవని చెప్పారు. రిక్టర్ స్కేల్‌పై 5.5 దాటితే ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయన్నారు. ఈప్రాంతంలో తక్కువ మోతాదులో భూకంపాలు వస్తుంటాయన్నారు. దీనివల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగవన్నారు. ఈ ప్రాంతంలో భూకంపాలు సంభవించినప్పుడు నేలలో పెద్ద శబ్దాలు మాత్రమే విన్పిస్తున్నట్లు తమ పరిశీలనలో నిర్ధారణైందన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శశిధర్, వేదికపై ఆర్డీవో లక్ష్మీప్రసన్న తదితరులు

ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో మూడు రోజుల క్రితం వరుసగా భూకంపాలు వచ్చాయన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ప్రజలు భయాందోళన చెందకుండా ఉండేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెంద వద్దన్నారు. కార్యక్రమంలో ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ బస్వంత్ రెడ్డి, జాతీయ జియోఫిజికల్ రిసెర్చ్ సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ శశిధర్, డాక్టర్ సురేష్, తహసీల్దార్ కె.సంజీవరావు, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్‌రాజు, ముండ్లమూరు తహసీల్దార్ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, మేడగం వెంకటేశ్వర రెడ్డి, ఆర్ఐ అనూష, తదితరులు పాల్గొన్నారు.

గత వైసీపీ పాలనలో అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంపుదల

- దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ధ్వజం

దర్శి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ళ పాలనలో అడ్డగోలుగా అనేకసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన విషయాన్ని మరచి ఇప్పుడు తగ్గించాలని నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వటం శోచనీయమని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ జి.స్టీవెన్ తదితరులు విమర్శించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ పాలకులు 13 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని పెనుభారం మోపిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ పాలకుల అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారన్నారు. వైసీపీ నాయకుల తప్పుడు ప్రచారాన్ని త్రిప్పికొట్టాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో కౌన్సిలర్లు వీసీ రెడ్డి, ఇత్తడి దినకర్, దర్శి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కె. వెలుగొండారెడ్డి, గొర్రె సుబ్బారెడ్డి, పుల్లలచెరువు చిన్నా, మారెళ్ల వెంకటేశ్వర్లు, సుభానీ, సాని సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగరపంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు

ఆందోళన చేపట్టడం సిగ్గుచేటు

దర్శి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలకులు పెంచిన విద్యుత్ చార్జీలను ఇప్పుడు తగ్గించాలని ఆ పార్టీ నాయకులు ఆందోళనకు పిలుపునివ్వటం సిగ్గుచేటని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అవినీతి, అక్రమాల కేసుల నుంచి ప్రజలను దృష్టి మరల్చేందుకు నిరసన కార్యక్రమాల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. సౌర విద్యుత్ ఒప్పందాల్లో ముడుపులు కేసుల్లో అమెరి కాలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీ అధినేత జగన్ పోరుబాట పేరట ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని, దొంగ నిరసన కార్యక్రమాలు చేపట్టే నాయకులకు తగిన గుణపాఠం చెబు తారని స్పష్టం చేశారు.

విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత వైసీపీదే!

కనిగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు పాపం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి అన్నారు. గురువారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అసమర్థ ఐదేళ్ళ పాలనతో ప్రజలపై 1.29 లక్షల కోట్ల రూపాయలు విద్యుత్ భారం ప్రజలపై పడిందన్నారు. ఈ నిజాలన్నింటిని దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. ఐదేళ్ళ పాలనలో 13 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, షేక్ వాజిదాబేగం, కరణం అరుణ, తులసి, దొరసాని, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పామూరులో భారీ వర్షం



పామూరులో కురుస్తున్న వర్షం

పామూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గురువారం రాత్రి పామూరులో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. రాత్రి 7 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీనిప్రభావంతో మినుము పంటకు తీవ్రనష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, డిసెంబరు, 26 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. మండలంలో బొట్లగూడూరు గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూసమస్యలపై అర్జీలు ఇస్తే పరిష్కరిస్తామన్నారు. ఈసందర్భంగా 45 అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, యారవ శ్రీనివాసులు, డీటీ బ్రహ్మయ్య, ఆర్ఐ బి.మల్లికార్జునరావు, ఎండోమెంట్ ఈవో నరసింహాబాబు, విలేజ్ సర్వేయర్ మానస, వీఆర్వో గరీబా, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమణారావు

తాళ్లూరులో 7 అర్జీలు



తాళ్లూరు: అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.సంజీవరావు తెలిపారు. మండలంలోని రామభద్రాపురంలో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా ఏడు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో పి.చంద్రశేఖరరావు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజలు వ్యాధుల భారిన పడకుండా వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. గురువారం ముండ్లమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు, ముందుల నిల్వల రిజిస్టర్‌తను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. వైద్యులు, సిబ్బంది గ్రామాలను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జాస్మిన్, సీహెచ్‌వో నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల బాదుడుపై నిరసన కార్యక్రమాలు

దర్శి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కరెంట్ చార్జీల బాదుడుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తామని జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు కరెంట్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై పెనుభారం మోపుతున్నారని విమర్శించారు. పెంచిన ట్రూఅప్ చార్జీలు తగ్గించాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులు పంటల బీమాలో సభ్యులుగా చేరాలి

దొనకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో నిర్ణీత ప్రీమియం చెల్లించి సభ్యులుగా చేరాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలం లోని రామాపురం గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 31 వరకు గడువు ఉందన్నారు. అననుకూల వాతావరణ పరిస్థితుల్లో రైతులు పంట నష్టపోతే బీమా వర్తిస్తుందని చెప్పారు. అధిక వర్షాలకు పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.


అంగన్‌వాడీ పిల్లలకు ఆధార్ నమోదు

పామూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఒకటో గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీ పిల్లలకు ఉచితంగా ఆధార్ ఎన్‌రోల్‌మెంటు నమోదు కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని పిల్లలను సచివాలయానికి తీసుకొచ్చి ఆధార్ నమోదు చేయించారు. మరో రెండు రోజులు ఆధార్ నమోదు ఉంటుందని సూపర్‌వైజర్ పద్మజ తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పేద విద్యార్థులకు చేయూత

దొనకొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు దర్శి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని సంస్థ ప్రతినిధి కపురం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వైజీ, చంద్రశేఖర్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబర్చి దొనకొండకు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చారని అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ నర్సింహారావు ప్రోత్సాం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దేవతి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలను పరిరక్షించాలి



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ మహేశ్వరరావు

పామూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పామూరు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలను పరిరక్షించాలని డీఎస్పీ ఎం.మహేశ్వరరావు అన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా గురువారం పామూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పామూరు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలతో పాటు నేరాలపై దృష్టి సారించి కేసులను ఛేదించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.భీమానాయక్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు పాల్గొన్నారు.

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(జీటీఎస్) నిర్మాణాలు.. నాలుగేళ్లుగా పునాదుల దశ దాటలేదు. ఈ కేంద్రాల కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేపట్టిన నిర్మాణాలు ఎందుకూ పనికిరాకుండా పోగా.. మిగిలిన నిధులు వృథాగా పోయాయి. జీటీఎస్ భవనాలు, షెడ్ల కోసం వేసిన పిల్లర్ల ఇనుము తుప్పుపట్టిపోయి విరిగిపోతున్నాయి. మున్సిపల్ పట్టణాల్లో సేకరించే చెత్తను జిందాల్‌కు తరలించేందుకు లారీలకు ఎత్తాల్సిన స్టేషన్లలో చెత్తకు బదులు ముళ్ల చెట్లు పేరుకుపోయాయి. 2020 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘ నిధులతో మొదలుపెట్టిన నిర్మాణాలు ప్రస్తుతం ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఈ కేంద్రాల విలువ తెలుసుకోలేని గత వైసీపీ ప్రభుత్వం అంతే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో మంజూరైన నిధులు వృథా పోగా, ఖర్చు చేసిన నిధులు చెత్తలో పోసిన చందంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్‌తో పాటు మిగిలిన మున్సిపాలిటీలకు కలిపి రూ.256.18 కోట్ల నిధులను ఈ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. వీటిలో ఇప్పటి వరకు రూ.86 కోట్లమేర మాత్రమే ఖర్చు చేశారు.

నిధులున్నా.. నిరుపయోగం



తెనాలి బీసీ కాలనీలో నిర్మించాల్సిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను కంపోస్ట్ యార్డులో కొంతవరకు నిర్మించి వదిలేసిన చిత్రం

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)ల నిర్మాణం పునాదుల్లోనే...

- గత వైసీపీ సర్కారు నిర్వాకం
- కేంద్రం ఇచ్చినా నాలుగేళ్లుగా నిర్లక్ష్యం
- రూ. 256 కోట్ల పనులు అసంపూర్తిగానే..
- బయో మైనింగ్ విధానంలో చెత్తకు పరిష్కారం దిశగా...



పూలే కాలనీలో షెడ్ వేయకుండా వదిలేయటంతో తుప్పు పట్టిపోతున్న పిల్లర్ల ఇనుము

తెనాలి, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి): చెత్త... రోజురోజుకూ పట్టణాలను పీడిస్తున్న సమస్య. రోజుకు లక్షల టన్నుల చెత్త పట్టణాల్లో పోగవుతుంటే, దానిని తరలించటం, డంపింగ్ యార్డుల్లో ప్రాసెస్ చేయటం వంటివి ఇబ్బందిగా మారిపోయాయి. పైగా చిన్న వాహనాలు పలుమార్లు చెత్తను డంపింగ్ యార్డులకు తరలించటానికి తిరగటం వల్ల ఖర్చు పెరిగిపోతుందన్న కారణంతో ఈ స్టేషన్‌ల నిర్మాణం చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. అనుకున్నట్టే అన్ని రాష్ట్రాలకు 15వ ఆర్థిక సంఘ నిదులు, ఇతర నిధులను మంజూరు చేసింది. అయితే వీటిని పట్టణానికి నాలుగు దిక్కులా ఏర్పాటుచేసి, చెత్తను సేకరించాల్సి ఉంటుంది. దీనివల్ల ఎన్నోరకాలుగా ఆదా అవుతుంది. ప్రస్తుత పరిస్థితిలో ప్రతి పట్టణానికి చెత్తను డంప్ చేసే కేంద్రం ఒక్కచోటే ఉంటోంది. పట్టణంలో వచ్చిన చెత్త మొత్తాన్ని అక్కడికే తరలించాలి. అంటే పట్టణంలో అన్ని మూలల నుంచి చెత్త వాహనాలు రోజు మొత్తంమీద 10 నుంచి 15 సార్లు తిరగాల్సి వస్తుంది. పెద్ద నగరాలయితే మరింత శ్రమ. చెత్త సేకరణ చేసే చోటు పలుచోట్ల ఉంటే, ప్రాంతాల వారీగా అక్కడికక్కడే చెత్తను దింపేయవచ్చు. అక్కడి నుంచే చెత్తతో సేంద్రియ ఎరువు, విద్యుత్తు తయారుచేసే కేంద్రాలకు తరలించవచ్చు. మన జిల్లాకు ప్రస్తుతం చిలకలూరిపేటలోని జిందాల్ చేపట్టిన ప్రాజెక్టుకు తరలిస్తున్నారు. ఈ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల ఏర్పాటు వల్ల చెత్తను తీసుకొచ్చే వాహనాలు తిరిగే దూరం తగ్గటం వల్ల ఇంధనం ఆదా అవుతుంది. సమయం కలిసివస్తుంది. దీనికితోడు పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుంది. చెత్త వాహనాలు జనం తిరిగే సమయంలో వెళితే దుర్గంధంతో వాయు కాలుష్యంకూడా ఏర్పడుతోంది. దీనివల్ల అదికూడా చాలావరకు తగ్గుతుందనేది కేంద్రం ఆలోచన. దీనిని గత వైసీపీ సర్కారు పూర్తిగా పక్కన పెట్టేసింది. అసలు ఈ కేంద్రాల నిర్మాణం పూర్తిచేసిన దాఖలాలే లేవు.

పునాదుల దశలోనే లక్ష్యానికి తుప్పు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్(జి.టి.ఎస్)స్టేషన్‌ల నిర్మాణం పునాదులకే పరిమితమయింది. ఎక్కడా పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగి, ఉపయోగంలోకి వచ్చిన పరిస్థితి లేదు. తెనాలిలో మూడు చోట్ల జీటీఎస్‌ల నిర్మాణం రూ. 2.16 కోట్లతో 2020లో చేపడితే, అవి అస్తవ్యస్తంగా మారాయి. సాధారణంగా డంపింగ్ కేంద్రం ఉన్నచోట కాకుండా, మిగిలిన ప్రాంతాల్లో ఈ కేంద్రాలను నిర్మించాల్సిఉంటే, పట్టణంలోని పూలే కాలనీ, బీసీ కాలనీ, పినపాడులో చేపట్టారు. అయితే ఇక్కడ ఒక్క పినపాడు మినహా, మిగిలిన రెండూ డంపింగ్ యార్డుకు దగ్గర్లోనే ఉండటం విశేషం. దీనిలో బీసీ కాలనీలో నిర్మించాల్సిన స్టేషన్‌ను ఏకంగా యార్డులోనే పెట్టేశారు. ఇక్కడ కంపోస్ట్ యార్డుకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో వీటిని నిర్మించాల్సిఉంటే, బీసీ కాలనీలో జనం ఒప్పుకోలేదని

(మిగతా 6వ పేజీలో)

సాగునీరు పారుదల కావాల్సిన కాల్వల నిధులపై కూటమి నేతలు కన్నేశారు. ఇప్పటికే ఇసుక.. మట్టి.. రేషన్.. మాఫియాలతో అంటకాగుతున్న కొందరు నేతల కన్ను సాగర్ కాల్వల మరమ్మతులపై పడింది. అధికారం అండతో కొందరు నేతలు రెచ్చిపోతున్నారు. కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయగా అధికారులు వాటికి టెండర్లు పిలిచారు. అయితే వాటిని రద్దు చేసి తమ వారికి కట్టబెట్టాలని కొందరు నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చారని సమాచారం. టెండర్లను రద్దు చేయాలని హుకుం జారీ చేశారని తెలిసింది. ఈ పరిస్థితుల్లో అధికారులు టెండర్లను రద్దు చేసినట్లు తెలుస్తోంది. వైసీపీ హయాంలో పనులు చేయకుండానే ఆ పార్టీ నేతలు కొందరు బినామీల పేరుతో నిధులు స్వాహా చేయగా అదే బాటలో కూటమి నేతలు పయనిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసి నెలలు గడుస్తున్నా పనులు చేపట్టలేని దుస్థితిలో జలవనరుల శాఖ ఉంది.



చిలకలూరిపేట మేజర్ కాలువలో పెరిగిన జమ్ము, కంప

కాల్వలపై.. కూటమి నేతల కన్ను



- మరమ్మతులకు నిధుల విడుదల
- టెండర్లు పిలిచిన జలవనరుల శాఖ
- రద్దు చేయాలంటూ నేతల ఒత్తిడి
- నిలిచిపోయిన పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో కాలువల మరమ్మతులకు గత ఐదేళ్లు నిధులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాల్వల మరమ్మతులకు రూ. 17.69 కోట్ల నిధులు విడుదల చేసి, అత్యవసర పనులు చేపట్టాలని ఆదేశించింది. అయితే పల్నాడు జిల్లాలో కొన్ని చోట్ల ఈ పనులను అధికార నేతలే అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా జలవనరుల శాఖ మరమ్మతులకు సంబంధించి, టెండర్లు కూడా పిలిచింది. వాటికి సంబంధించి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు కుదుర్చుకునే సమయంలో, అధికార పార్టీ నేతల ఒత్తిడితో సదరు అధికారులు టెండర్లను రద్దు చేసినట్టు ప్రచారం. తాము చెప్పే వరకు టెండర్లు ఖరారు చేయడానికి వీలు లేదని అధికారులకు తేల్చి చెప్పడంతో, టెండర్ల దశలోనే మరమ్మతుల పనులు నిలిచిపోయాయని ప్రచారం. టెండర్లు రద్దు అంశాన్ని జలవనరులశాఖ ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి సదరు అధికారులు తీసుకువెళ్లినట్టు సమాచారం. కొందరు నేతలు మరమ్మతు పనులు ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. తమకు చెందిన వ్యక్తుల పేరుపై టెండర్లు దాఖలు చేయించి పనులు చేసుకోవాలన్న ప్రయత్నాల్లో భాగమే టెండర్లు రద్దు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సాగర్ కాలువ కింద మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాలువలు శిథిల స్థితికి చేరుకున్నాయి. రానున్న రోజుల్లో సాగునీటి సరఫరాకు ఇబ్బందులు వచ్చే పరిస్థితి ఏర్పడింది. కాలువల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు కాలువల నిండా అల్లుకుపోయాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా మారే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తక్షణావసరమైన పనులు చేపట్టాలని ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారులకు సూచించింది. ఈ మేరకు పనులను గుర్తించారు. పనులకు సంబంధించిన అంచనాలను రూపొందించారు.



గోవిందాపురం మైనర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 302 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ. 17.69 కోట్లు వ్యయం అంచనా వేశారు. లింగంగుంట్ల ఓఅండ్‌ఎం డివిజన్ పరిధిలో 76 పనులు, ఇందుకు వ్యయం అంచనా రూ. 4.21 కోట్లు. మాచర్ల ఓఅండ్‌ఎం డివిజన్ పరిధిలో 101 పనులు, వ్యయం అంచనా రూ. 4.69 కోట్లు. ఓఅండ్‌ఎం డివిజన్ సత్తెనపల్లి పరిధిలో 62 పనులు

(మిగతా 6వ పేజీలో)



అగ్రవర్ణాలకీ.. రుణం

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు వైసీపీ పాలనలో అలంకార ప్రాయంగా మారాయి. రూపాయి నిధులు కూడా ఆయా కార్పొరేషన్లకు అందలేదు. ఆయా వర్గాల సంక్షేమం గురించి ఆలోచించలేదు. అగ్రవర్ణ పేదలకు కేటాయించే రుణాలకు కూడా జగన్ ప్రభుత్వం మంగళం పాడింది. స్వయం ఉపాధి రంగాలలో ప్రభుత్వం అందించే రాయితీ రుణాల కోసం ఐదేళ్ల పాటు ఆశావహులకు ఎదురుచూపులే మిగిలాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆయా కార్పొరేషన్లకు జవసత్వాలు కల్పించే దిశగా కార్యాచరణ మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే బీసీ రుణాలకు సంబంధించి స్పష్టత ఇచ్చింది. త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలుకానుంది. ఈ క్రమంలో ఈబీసీ కింద అగ్రవర్ణ పేదలకూ 50 శాతం రాయితీ కింద బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలివ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లాల వారీగా కేటాయింపులు కూడా జరిపింది.

ఈబీసీ కింద మంజూరుకు సన్నాహాలు

- మూడు జిల్లాల పరిధిలో రూ.96 కోట్లు కేటాయింపు
- ఆరు రంగాలు ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక
- కసరత్తు మొదలు పెట్టిన బీసీ కార్పొరేషన్ అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అగ్రవర్ణ పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈబీసీ కింద రాయితీపై రుణాలిచ్చే ప్రక్రియ 2014–19 మధ్య కార్పొరేషన్ల ద్వారా జరిగింది. కానీ గత ప్రభుత్వంలో ఆ నిధులను సైతం యథేచ్ఛగా దారి మళ్లించి ఈబీసీ పేదలను దగా చేసింది. 2019—24 మధ్య ఈబీసీకింద స్వయం ఉపాధి యూనిట్లు పెట్టుకోవడానికి రాయితీ రుణాలు మంజూరు చేయాలనే అభ్యర్థనలు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 15,000 వరకు వచ్చినట్లు సమాచారం. వీటిలో ఏ ఒక్క దరఖాస్తును పరిష్కరించకపోగా ఆ నిధులనూ సైతం ఇష్టారీతిన దారి మళ్లించిన ఘనత గత ప్రభుత్వానిది కావడం గమనార్హం

ఆరు రంగాలలో...

రాయితీపై రుణాలు అందించే యూనిట్లను మొత్తం ఆరు రంగాలుగా ప్రభుత్వం వర్గీకరించింది. ఫ్యాషన్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెయిరీలు, జనరిక్ మందుల షాపులు, హాస్పిటల్ సెక్టార్‌తో పాటు ఇతర స్వయం ఉపాధి యూనిట్ల కింద రుణాలు మంజూరు చేయనున్నారు. ఈబీసీ తో పాటు రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య క్షత్రియ, బ్రాహ్మణ విభాగాలలో అగ్రవర్ణ పేదల కింద లబ్ధిదారులను ఎంపిక జరిపి వారికి లబ్ధి చేకూర్చే విధంగా బీసీ కార్పొరేషన్ కసరత్తు మొదలు పెట్టింది. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఆయా రంగాలలో ఆసక్తి కనబరుస్తున్న వారి నైపుణ్యాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. అవసరమైతే వారికి ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి యూని ట్లను మంజూరు చేసి వారు నిలదొక్కుకునేలా చేయడానికి అన్నివిధాల సహకారం అందించనుంది

మూడు జిల్లాలకు కలిపి రూ.96 కోట్ల రుణాలు

ఈబీసీ కోటా కింద అగ్రవర్ణ పేదలకు రుణాలు మంజూరులో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే నిధులు కేటాయింపు జరుపుతూ బీసీ కార్పొరేషన్ అధికారులకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. దానిలో భాగంగా బాపట్ల జిల్లాలో మొత్తం 3,609 మందికి లబ్ధి చేకూర్చాలని నిర్ణయించింది. నిధుల కేటాయింపు వచ్చేసరికి మొత్తం రూ.23 కోట్లు కాగా ఇందులో సబ్సిడీ కింద రూ.15 కోట్లు పోగా బ్యాంకు రుణం కింద రూ.8 కోట్లు లబ్ధిదారులకు అందించనున్నారు. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాలకు కలిపి మొత్తం 9,838 లబ్ధిదారులను ఈబీసీ కింద ఎంపిక చేసి రాయితీ కింద రుణాలు అందించనున్నారు. మొత్తం రూ.63 కోట్లను ఇందుకు ప్రభుత్వం కేటాయించగా ఇందులో రూ.42 కోట్లు రాయితీ రూపంలోనూ, రూ.21 కోట్లు బ్యాంకురుణాల ద్వారా లబ్ధిదారులకు మేలు జరగనుంది. ఈబీసీ కింద రుణాల విషయంలో రూ.63 కోట్లను గుంటూరు, పల్నాడు జిల్లాలకు కలిపే ప్రస్తుతానికి బీసీ కార్పొరేషన్ చూపిస్తుంది. త్వరలోనే జనాభా ప్రాతిపదికన ఈ కేటాయింపులను రెండు జిల్లాలకు విభజించి ప్రక్రియ మొదలుపెట్టే దిశగా యంత్రాంగం అడుగులు వేయనుంది.

మహిళలకే అగ్ర తాంబూలం

స్వయం ఉపాధి యూనిట్లకోసం రుణాల మంజూరులో భాగంగా మహిళలకే పెద్ద పీట వేయనున్నారు. దానిలో భాగంగానే కేటాయింపుల్లో ఎక్కువ శాతం ఫ్యాషన్ డిజైనింగ్ విభాగానికే కేటాయించారు. ఈ రంగంలో మహిళలకు శిక్షణ ఇవ్వడంతో పాటు యూనిట్ ఏర్పాటుకు ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున నగదు అందించడంతో పాటు కుట్టుమిషన్ కూడా అందించనున్నారు. ఇక ఈవెంట్ మేనేజ్‌మెంట్ కింద రూ.50,000, టూరిజం మేనేజ్‌మెంట్ కింద రూ.25,000 అందించడంతో పాటు ఆయారంగాలలో శిక్షణ కూడా ప్రభుత్వమే ఇప్పించే విధంగా చర్యలు చేపడుతోంది.



జనరిక్ మందుల దుకాణాలకు సంబంధించి బీఫార్మసీ తదితర అర్హతలు ఉన్నవారికి శిక్షణ ఇప్పించి యూనిట్ మంజూరు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా నిధుల మంజూరుతో పాటు లబ్ధిదారుల సంఖ్య పై కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ చేపట్టి ఎంపి కయిన లబ్ధిదారులతో మాట్లాడడం, శిక్షణ వంటి ప్రక్రియలన్నీ శరవేగంగా పూర్తి చేసి మరో నెల రోజుల్లోనే రాయితీ రుణాల అంశాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐ మృతి

బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణ స్టేషన్‌లో పని చేసే ఏఎస్ఐ డి.కొండయ్య(59) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శృంగారపురంలో అద్దె ఇంట్లో నివసిస్తూ ఆయన రోజూ విధులకు హాజరవుతుండేవారు. ఈ క్రమంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా త్వరగా విధులు ముగించుకుని బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై బాపట్ల నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి ఏఎస్ఐ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే అపస్మారకస్థితిలో చేరిన కొండయ్య చికిత్స పొందుతూ అర్థరాత్రి మృతి చెందాడు. ఏఎస్ఐ మృతికి పోలీసు ఉన్నతాధికారులు సంతాపం తెలిపారు.

గిరిజనులకు నేడు ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్

బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే ఈ కార్యక్రమాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

31న యలమందలలో సీఎం పర్యటన


- సభాస్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గంలోని యలమందలలో 31న ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను సీఎం చంద్రబాబు నాయుడు పంపిణీ చేస్తారన్న సమాచారంతో సభాస్థలిని అధికారులు గురువారం పరిశీలించారు. చంద్రబాబు నాయుడు పర్యటన తొలుత పులిపాడులో ఉంటుందని ఆ గ్రామంలో ఏర్పాట్లు చేపట్టారు. సీఎం పర్యటన యలమందలకు మారినట్టు అందిన సమాచారం మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు గ్రామంలో చేపట్టాల్సి ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. హెలిప్యాడ్, సభావేదిక కోసం స్థలాలను వారు పరిశీలించారు. కార్యక్ర మంలో జేసీ సూరజ్, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వ రరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. పులిపాడు, యలమందల ఏ గ్రామంలో సీఎం టూర్ ఉంటుందో ఇంకా స్పష్టత రానట్టు అధికారులు చెబుతున్నారు. అయితే రెండు గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎంవో నుంచి సీఎం పర్యటనపై అధికారికంగా ప్రకటన వెలువడలేదు.



నరసరావుపేట నియోజకవర్గం యలమందలలో సీఎం చంద్రబాబు పర్యటనకు స్థల పరిశీలన చేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

డీఆర్‌ఎంగా ఆనంద్ మధుకర్



గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్ఎం)గా ఆనంద్‌మధుకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు డైరెక్టర్ రవీందర్‌పాండే గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీసు (ఐఆర్‌పీఎస్) 1977 సివిల్ సర్వీసు ఎగ్జామినేషన్ బ్యాచ్‌కు చెందిన మధుకర్ కేంద్ర ఆర్థిక శాఖలో కొంతకాలం జాయింట్ సెక్రెటరి హోదా పోస్టులో ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. సౌత్ ఈస్టు రైల్వేలో ఆయన ఎక్కువ కాలం వివిధ హోదాలలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై కేంద్ర పురావస్తు శాఖలో అదనపు డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2029 వరకు డిప్యుటేషన్ ఉన్నప్పటికీ రైల్వేబోర్డు ఆయన్ని వెనక్కు రప్పించి గుంటూరు డీఆర్‌ఎంగా పోస్టింగ్ చేసింది. కాగా ప్రస్తుత డీఆర్‌ఎం రామకృష్ణకు ఇంకా పోస్టింగ్ కల్పించలేదు.

నిర్లక్ష్యంగా ఉంటే కుదరదు

దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

బల్లికురవ, అద్దంకి సమీక్షల్లో జేసీ ప్రఖర్‌జైన్

అద్దంకి/బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వివిధ అంశాలకు సంబంధించిన ఆదేశాలపై అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని.. ఇలా అయితే కుదరదని జేసీ ప్రఖర్‌జైన్ బల్లికురవలో జరిగిన సమీక్షలో రెవెన్యూ యంత్రాంగాన్ని హెచ్చరించారు. ప్రజల నుంచి అందిన రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. బల్లికురవ ఎంపీడీవో, అద్దంకి తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ అంశాలపై గురువారం జేసీ సమీక్షించారు. అద్దంకి, కొరిశపాడు, జె.పంగులూరు, ఇంకొల్లు మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో జరిగిన సమీక్షలో జేసీ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, గ్రీవెన్స్‌ల్లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు శ్రీచరణ్, సుబ్బారెడ్డి, శింగరావు, ఇంకొల్లు డీటీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ మండల పరిషత్ కార్యాలయంలో బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు, యద్దనపూడి మండలాల రెవెన్యూ సిబ్బందితో జేసీ సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పెం డింగ్‌లో ఉన్న సమస్యలపై అధికారులకు సూచ నలు చేశారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే సభల్లో వచ్చిన అర్జీలపై వెంటనే పరిష్కారం చూపాలన్నారు. చెన్నుపల్లి ఇనాం భూముల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ హయాంలో హద్దు రాళ్లపై ముద్రించిన పేర్లను తొలగించే పనులపై జేసీ పలు సూచ నలు చేశారు. అధికారులు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తే ప్రజల నుంచి సమస్యలు రావన్నారు. లోపాలు లేకుండా రైతుల సమక్షంలో వారి వద్ద ఉన్న హక్కు పత్రాలను చూసి భూములకు కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, రీ సర్వే ల్యాండ్ జిల్లా ఏడీ కనకప్రసాద్ తహసీల్దార్లు రవినాయక్, రవిబాబు, ప్రశాంతి, రవికుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఆరా

ధాన్యం కొనుగోళ్లపై జేసీ జైన్ బల్లికురవ ఎంపీడీవో కుసుమకుమారి, ఏవో కుమారిలను ఆరా తీశారు. రైతులు కేంద్రాలకు తెచ్చి అమ్మేలా కృషి చేస్తున్నారా అని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.



బల్లికురవలో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



మాట్లాడుతున్న ఎంపీ ప్రసాదరావు

సొంతూరును మరువను

చిత్తూరు ఎంపీ ప్రసాదరావు

చినగంజాం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తనకు ఉజ్వల బవిష్యత్తును ప్రసాదించిన సొంతూరును ఎప్పుడూ మరువనని చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. మండలంలోని తన స్వగ్రామమైన చింతగుంపల్లి గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ స్ఫూర్తితో తన తల్లిదండ్రులు చూపిన బాటలో నడిచి భవితకు భరోసా అన్ననానుడికి ప్రతిరూపంగా నిలిచానన్నారు. చింతగుంపల్లి గ్రామ అభ్యున్నతికి చేయూత నందించేందుకు ఎప్పుడూ వెనకాడనన్నారు. స్వగ్రామంలోని ప్రజలందరికీ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సత్కార సభలో ప్రసాదరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. అంబేడ్కర్ కలలుగన్న సమ సమాజ స్థాపన వైపు పయనించాలంటే అందరూ ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. అపుడే రాష్ట్రంలోని దళిత కాలనీలన్నీ అభివృద్ధి వైపు నడుస్తాయన్నారు. అనంతరం ఎంపీ ప్రసాదరావుని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. గత స్మృతులను ఆయనతో గ్రామస్థులు పంచుకున్నారు. తమ గ్రామ ప్రజలు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాష లు, కుటుంబసభ్యులు బాణాసంచా, మేళాతాళాలు, పుష్పాలు, కర్పూర హారతులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యార్లగడ్డ సత్యనారాయణ, విశ్రాంత అధ్యాపకులు శ్రీరామమూర్తి, న్యాయవాది కరణం వాసుదేవరావు, ఎంపీడీవో ప్రభుదాస్, రిటైర్డ్ డీఎస్పీ కట్టా వినయ్‌కుమార్, గ్రామస్థులు జాన్సన్, రామకృష్ణ, రవిబాబు, శేఖర్‌బాబు, డానియేలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాగునీరు అందించడమే లక్ష్యం

మార్టూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతుల పంటలకు సాగునీరు సక్రమంగా అందించడమే తమ లక్ష్యంగా పనిచేస్తామని, మీ ఆదేశాలకు, సూచనలకు అనుగుణంగా రైతు సేవ కోసమే పనిచేస్తామని నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణితో పాటు పలువురు డీసీ చైర్మన్‌లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు తెలిపారు. గురువారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సాగర్ కమిటీ వైస్ చైర్మన్ చక్రపాణి, కోనంకి ఎన్ఎస్‌పి పరిధిలోని ద్రోణాదుల డీసీ చైర్మన్ కొసరాజు దిలీప్ కుమార్, ఇంకొల్లు డీసీ చైర్మన్ బండ్ల శ్రీనివాసరావు, పర్చూరు డీసీ చైర్మన్ కొల్లా మురళీకృష్ణ మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే ఏలూరిని కలిశారు. ఈ సందర్భంగా వారు ఏలూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోనంకి ఎన్నెస్పీ పరిధిలో సాగర్ కాలువలో రిపేరు పనులు, చిల్లచెట్లు తొలగింపు తదితర విషయాలపై ఏలూరి వారితో చర్చించారు. కార్యక్రమంలో బొల్లాపల్లి నీటి సంఘం చైర్మన్ కరణం మారుతి పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

మార్టూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటిలో ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చామర్తి నాగసరిత (45) గురువారం మృతిచెందినట్లు సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. మార్టూరులో ఈ నెల 17వ తేదీన కుటుంబ సమస్యలు కారణంగా నాగసరిత ఇంట్లో సీలింగ్ ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను గుంటూరులోని ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమెకు భర్త రమేష్, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు శ్యాం దుర్గా కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

మార్టూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో పల్లెపోగు కోటయ్య అనే వ్యక్తిపై పల్లెపోగు విజయ్ అనే వ్యక్తి స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి తమ కాలనీ క్రిస్మస్ జెండాతో ఊరేగింపుగా వెళుతుండగా కోటయ్య అనే వ్యక్తి ట్రాక్టర్‌తో తమను అడ్డగించారని విజయ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

తాజా వర్షాలతో దెబ్బతిన్న పంటలు

» వ్యవసాయ శాఖ అంచనా

» పలుచోట్ల అధికారుల పరిశీలన

ఒంగోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాజాగా కురుస్తున్న వర్షాలతో 75 గ్రామాలలో 6,481 హెక్టార్లలో పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఆ మేరకు జిల్లాలో వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) సీహెచ్. శ్రీనివాసరావు గురువారం సాయంత్రానికి ఉన్నతాధికారులకు నివేదించారు. ఆ ప్రకారం చూస్తే దొనకొండ, పామూరు కురిచేడు, ముండ్లమూరు, ఒంగోలు, కేకేమిట్ల, టంగుటూరు మండలాల్లో వరి, మినుము, అలసంద, జొన్న, పొగాకు పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తం ఏడు మండలాల్లో 75 గ్రామాలలో పంటలకు నష్టం వాటిల్లగా, అందులో అత్యధికంగా కేకేమిట్ల మండలంలోని 24 గ్రామాల్లో జరిగాయి. అలాగే మొత్తం దెబ్బతిన్న విస్తీర్ణం 6,481 హెక్టార్లలో కూడా ఆయా మండలంలోని 4,232 హెక్టార్లు ఉంది. మొత్తం జిల్లాలోని 75 గ్రామాల్లో 6,591 మంది రైతులు ఉన్నట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలో గుర్తించింది. కాగా వివిధ ప్రాంతాల్లో వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాలను పరిశీలన చేసి, ప్రస్తుత సమయంలో పంటల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సూచనలు చేశారు. డీఏవో శ్రీనివాసరావు టంగుటూరు మండలంలోని పంటలను పరిశీలించగా, ఇతర ప్రాంతాల్లో సంబంధిత సబ్ డివిజన్, మండల అధికారులు పరిశీలించారు.

భూప్రకంపనలతో భయాందోళన వద్దు

తాళ్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూప్రకంపనలతో భయాందోళన చెంద వద్దని జాతీయ జియోఫిజికల్ రిసెర్చ్ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ డి.శశిధర్ పేర్కొన్నారు. గురువారం మండలపరిషత్ సమావేశం హాలులో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న అధ్యక్షతన భూకంపాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శశిధర్ మాట్లాడుతూ అద్దంకి సమీపాన గల గుండ్లకమ్మ పరివాహక ప్రాంతం వల్ల భూకంపాలు వస్తుంటాయన్నారు. 1967 నుంచి తరుచూ భూకంపాలు వస్తున్నా రిక్టర్ స్కేల్‌పై 3.1 మించి ఉండటం లేదన్నారు. దీనివల్ల ఎలాంటి ప్రమాదాలు సంభవించవని చెప్పారు. రిక్టర్ స్కేల్‌పై 5.5 దాటితే ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయన్నారు. ఈప్రాంతంలో తక్కువ మోతాదులో భూకంపాలు వస్తుంటాయన్నారు. దీని వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగవన్నారు. ఈ ప్రాంతంలో భూకంపాలు సంభవించినప్పుడు నేలలో పెద్ద శబ్దాలు మాత్రమే విన్పిస్తున్నట్లు తమ పరిశీలనలో నిర్ధారణైందన్నారు.

ఆర్డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో మూడు రోజుల క్రితం వరుసగా భుకంపాలు వచ్చాయన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ప్రజలు భయాందోళన చెందకుండా ఉండేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెంద వద్దన్నారు. కార్యక్రమంలో ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ బసవంత్‌రెడ్డి, జాతీయ జియోఫిజికల్ రిసెర్చ్ సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ శశిధర్, డాక్టర్ సురేష్, తహసీల్దార్ కె.సంజీవరావు, డీటీ ఇమ్మానియేల్‌రాజు, తహసీల్దార్ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, కొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ అనూష పాల్గొన్నారు.

ఏఎంసీ పదవిపై ఆశావహుల దృష్టి

» బీసీ జనరల్‌కు కేటాయింపు

» రేసులో నుంచి తప్పుకున్న ఇతర వర్గాలు



చీరాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవులు పంపిణీ ఒకటికి రెండు పర్యాయాలు జరిగాయి. నియోజవర్గ పరిధిలోని నామినేటెడ్ పదవులకు సంబంధించి ఆశావహులు ఎదురు చూస్తున్నారు. అందులో చీరాల ఏఎంసీ చైర్మన్ పదవి ఒకటి. ఆ పదవి కోసం పలువురు ఆశావహులు ఎదురు చూస్తున్నారు. అయితే ఆ పదవిని బీసీ జనరల్‌కు కేటాయించారు. దీంతో మిగిలిన సామాజిక వర్గాల నుంచి ఆ పదవి కోసం ఎదురు చూస్తున్నవారు అనివార్యంగా రేసులో నుంచి తప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇక బీసీల్లో ఆ పదవి కోసం పోటీ పడేవారి సంఖ్య గణనీయంగానే ఉంది. ఏఎంసీ పరిధిలో పలు రకాల విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రధానంగా వ్యసాయాధారిత ఉత్పత్తులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణతో అధికారులు, సిబ్బందితో పనులు చేయించాల్సి ఉంటుంది. రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలి. రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి గోదాముల నిర్వహణ, బ్యాంకు రుణాలు, చెస్ వసూళ్లు, లింకు రోడ్లు, వ్యవసాయ సంబంధిత వ్యాపారులు తదితర అంశాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనతో సంబంధీకులకు పారదర్శకమైన సేవలు అందించేవిధంగా చర్యలు చేపట్టాలి. అలానే ఏఎంసీ ఆదాయ వనరులను గండికొట్టే పరిస్థితులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణతో ఉండాలి. అందుకు చైర్మన్, వైస్ చైర్మన్, ఇతర కమిటీ సభ్యులు బాధ్యతాయుతం గా వ్యవహరించాల్సి ఉంటుంది. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఏఎంసీ పాలకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రత్యేక కసరత్తు చేయాల్సిన అవసరం ఉందని కూటమి శ్రేణులు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాలకవర్గంలో కూటమికి సంబంధించి టీడీపీ, జనసేన, బీజేపీలకు సంబంధించిన ఆశావహులను పరిగణలోకి తీసుకుని కూర్పు చేయాల్సిన అవసరం ఉంది. చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు కేటాయించడంతో వ్యవసాయ రంగానికి సంబంధించినవారు ప్రథ మ వరుసలో నిలిచే అవకాశం ఉందని చెప్తున్నారు. ఇతర రంగాలకు చెందిన ఒకరిద్దరు కూడా ఏఎంసీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే కొండయ్య సూచించే వ్యక్తులే పాలకవర్గంగా ఉంటారని, అందుకు అందరం సమ్మతిస్తామని కూటమి శ్రేణులు చెప్తున్నాయి.

ఆ చిన్నారులు విధి వంచితులు

పరామర్శించిన డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ముండ్లమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడు పంచాయతీ పరిధిలోని బంగారమ్మగుట్టలో కండరాల వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఎస్తేర్‌రాణి, రాఘవేంద్రరావు దంపతుల కుమారులు హర్షవర్ధన్, విజయభవాన్, విరాట్ గురించి గురువారం ఆంధ్రజ్యోతిలో 'ఆ చిన్నారులు విధి వంచితులు' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు బంగారమ్మ గుట్టలో చిన్నారులను పరామర్శించారు. అనంతరం తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇది కండరాలకు సంబంధించిన వ్యాధి అని, తగ్గదని తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములకు వ్యాధి సోకటం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు.

రంగాకు ఘన నివాళి

» కాపు జాతి ఉన్నంత వరకు రంగా పేరు పదిలం » కాంస్య విగ్రహ ప్రారంభంలో ఎమ్మెల్యే ఏలూరి



రంగా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, వంగవీటి రాధా



చీరాలలో నివాళులు అర్పిస్తున్న అభిమానులు

చినగంజాం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాపు జాతి ఉన్నంత వరకు వంగవీటి మోహనరంగా పేరు చిరస్థాయిగా ఉంటుందని వంగవీటి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా 10 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంగవీటి రాధాకృష్ణ, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో రూ.25 లక్షలతో నిర్మించిన మోహన్‌రంగా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, బస్ షెల్టర్‌లను ప్రారంభించారు. అనంతరం రంగా వర్థంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ కమిషనర్ డాక్టర్ టీఎస్ఆర్.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో మోహనరంగా తనయుడు రాధాకృష్ణ మాట్లాడుతూ తన తండ్రికి మరణం లేదన్నారు. మరణించి మూడు దశాబ్దాలు అయిప్పటికీ ప్రజల మనస్సుల్లో సుస్థిరంగా ఉన్నారని అన్నారు. రంగా విగ్రహం పెట్టారంటే అందరికీ బాధ్యత పెరిగిందని అందరూ కలిసి రంగా ఆశయ సాధన దిశగా పని చేయాలన్నారు. మీ అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. రంగా విగ్రహావిష్కరణకు కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రంగా అంటేనే పోరాటానికి దిక్సూచి అని, పేదల పాలిట పెన్నిధి అని అన్నారు. రంగా ఒక కులానికి సంబంధించిన వ్యక్తి కాదని అన్ని వర్గాల ప్రజల మదిలో నిలిచిరన్నారు. తనయుడిగా రాధాకృష్ణ తండ్రి ఆశయాల కోసం పని చేస్తున్నారన్నారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా సమాజం పట్ల అంకిత భావంతో పెదిగారని సమస్య ఎక్కడ ఉంటే ఆయన అక్కడ నిలిచి ప్రజలకు అండగా ఉన్నారని అన్నారు. రాధా చాలా సౌమ్యుడని, ఏది ఆశించకుండా ఆయన తండ్రి పేరు ప్రఖ్యాతలను పెంపొందించేలా రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారన్నారు. రాధాకు అద్భుతమైన భవిష్యత్ ఉందని పదిమందికి ఉపయోగపడాలంటే రాజకీయ నేపథ్యంలోనే ఉండాలన్నారు. సోపిరాల గ్రామంలో రంగా విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే ఏలూరిని, రాధాని సోపిరాల గ్రామ పెద్దలు సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కాపు నాయకులను ఎమ్మెల్యే ఏలూరి సన్మానించి, మెమెంటోలు అందజేశారు. డీవీ సుబ్బారావు పాడిన సత్యహరిచంద్ర పద్యాలు అందరినీ అలరింపజేశాయి. ఆయన్ని ఏలూరి సన్మానించారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా కేబీటీ కన్వీనర్ రాసరి రాము, కాపునాడు జాతీయ అధ్యక్షుడు గల్లా సుబ్రహ్మణ్యం, గాదె వెంక టేశ్వరరావు, ఆకుల తిరుమల రావు, ఉగ్గిరాల సీతారామయ్య, పొగడరండ రవికుమార్, మంత్రి శ్రీనివాసరావు, గోపాల కృష్ణ, తిరుమలశెట్టి శ్రీహరి, గొర్రెపాటి శ్రీనివాసరావు, జనసేన నేత ఆమంచి స్వాములు, రజని, టీడీపీ మండల అధ్యక్షుడు పొడ వీరయ్య, సోపిరాల గ్రామ పెద్దలు ఆమంచి వెంకటసుబ్బారావు, టీ.జయరావు, కే.రామసుబ్బారావులు పాల్గొన్నారు

పర్చూరు : కాపు నేత వంగవీటి మోహన్ రంగా వర్థంతి సందర్భంగా కాపు నేతలు ఘన నివాళి అర్పించారు. బొమ్మల సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలతో వేసి అభిమానం చాటుకున్నారు. పలువురు నేతలు మాట్లాడుతూ కాపుల అభ్యున్నతి కోసం రంగా ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారంపూడి సందీప్‌తేజ, కఠారి సురేంద్రబాబు, కోటా శ్రీనివాసరావు, రంగిశెట్టి ఆంజనేయలు, దీర్ఘాల రమేష్ నాయుడు, తులసి చంటి, కంచేటి శ్రీహరి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా లింగిశెట్టి రామాంజనేయులు సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఇంకొల్లు : ఇంకొల్లులో వంగవీటి మోహన రంగా వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి పొన్నగంటి జానకిరామారావు ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట (చీరాల) : రామ మందిరం సమీపంలోని జనసేన పార్టీ జెండా దిమ్మె వద్ద గురువారం వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ రంగా ఒక కులానికో, వర్గానికో కాకుండా అందరి కోసం, ప్రధానంగా పేదల పక్షపాతిగా పనిచేశారని కొనియాడారు. ఆనాటి పరిస్థితులు, ఘటనలను మననం చేశారు. అనంతరం చీరాల ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసరి రాము, తన్నీరు ప్రసాద్, మార్కండేయులు, శ్రీనివాసరావు, కిషోర్, శివరామప్రసాద్, నాగేశ్వరరావు, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

శీనారెడ్డిపై విచారణ వేగవంతం

» ఫైళ్ల పరిశీలనతోపాటు ప్రస్తుత పీడీ నుంచి పలు వివరాలు సేకరించిన విచారణ కమిటీ

» ఆందోళన చెందుతున్న పలువురు ఉద్యోగులు

» సెలవు బాటలో కొందరు

» కమిటీ ముందు విచారణకు సిద్ధమవుతున్న పూర్వ పీడీ

ఒంగోలు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీ విచారణలో వేగం పెంచింది. కమిటీకి నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు బృందం పలు అంశాలను లోతుగా పరిశీలన చేస్తున్నారు. దాదాపు నాలుగైదు రోజులు పలు విభాగాలకు చెందిన ఫైళ్ల పరిశీలన చేసిన కమిటీ రెండురోజుల క్రితం ప్రధాన ఫిర్యాదుదారు అయిన డీసీసీబీ మాజీ చైర్మన్ ఈదర మోహన్‌ను పిలిచి పలు అంశాలపై స్పష్టత తీసుకొంది. అదే సమయంలో కలెక్టర్ తాజాగా అందిన మరి కొన్ని ఫిర్యాదులు పరిశీలనేకి తీసుకున్నారు. తొలుత తమకు ఇచ్చిన విచారణ అంశాలపై ఫైళ్లను కోరిన వారు తాజాగా కలెక్టర్ నుంచి వచ్చిన అంశాలకు సంబంధించిన ఫైళ్లపై దృష్టిసారించారు. గురువారం సాయంత్రం డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణలు ప్రస్తుత డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌ను కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ఇప్పటివరకు చేసిన విచారణలో తాము గుర్తించిన అంశాలు, వాటిపై తమకు ఉన్న సందేహాలు కొందరు ఉద్యోగుల భాగస్వామ్యం తదితర అంశాలపై పీడీతో మాట్లాడిన వారు మరికొన్ని ఫైళ్లను కూడా చూడాల్సిన అవసరం ఉందని చెప్పినట్లు సమాచారం.

ట్యాంపరింగ్‌కూ అవకాశం

మరోవైపు విచారణ ఎదుర్కొంటున్న శీనారెడ్డి వారంక్రితం కార్యాలయానికి వెళ్లి తనకు సన్నిహితులుగా ఉండే ఉద్యోగుల నుంచి కొన్ని ఫైళ్ల నకళ్లను తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రికార్డులు ట్యాంపరింగ్‌కు కూడా అవకాశం ఉంటుందని, నకళ్లు ఇచ్చిన ఉద్యోగులు వాటిని కూడా మార్పులు, చేర్పులు చేసే అవకాశాలను విచారణ కమిటీ అధికారులు పీడీ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. అయితే తొలుత అందిన ఫిర్యాదులకు సంబంధించిన ఫైళ్ల విషయంలో ఆయా విభాగాల వారికి రాతపూర్వకంగా పలు సూచనలు, హెచ్చరికలు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఈ సందర్భంగా పీడీ వారికి వివరించగా తాజాగా అందిన ఫిర్యాదులకు సంబంధించిన ఫైళ్ల విషయంలోను అలాంటి చర్యలు తీసుకోవాలని వారు కోరినట్లు తెలిసింది. కాగా వచ్చే నెల 2న తమ కమిటీ ముందు హాజరై తగు వివరణ ఇవ్వాలని కమిటీనోటీసు ఇచ్చిన నేపథ్యంలో అందుకు విచారణను ఎదుర్కొంటున్న శీనారెడ్డి సన్నద్ధం అవుతున్నారు. అందుకు అవసరమైన కొన్ని ఫైళ్ల నకళ్లను గురువారం డ్వామా కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లారు.

సెలవు బాటలో పలువురు

గతంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి తన సన్నిహితులైన ఉద్యోగుల నుంచి కొన్ని తీసుకెళ్లిన శీనారెడ్డి ఆ వ్యవహారంపై ప్రస్తుత పీడీ జోసఫ్‌కుమార్, విచారణ కమిటీ అధికారులు ఉద్యోగులపై సీరియస్ కావడంతోపాటు షోకాజ్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఈసారి ప్రస్తుత పీడీని కలిసి మాట్లాడి నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా గతంలో శీనారెడ్డితో అంటకాగి అప్పుడు జరిగిన అక్రమాలలో భాగస్వాములైన ఉద్యోగులు ప్రస్తుతం విచారణ జరుగుతున్న తీరుతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమపైకి రాకుండా వివిధ మార్గాలలో ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఈక్రమంలో కొందరు ఉద్యోగులు సెలవు బాటలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులు సెలవులో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సెలవుపెట్టినా అవసరమైన సమయంలో సంబంధిత ఫైళ్లను చూసేందుకు రావాలనే సంకేతాలను అధికారుల కమిటీ, పీడీలు ఇవ్వడంతో మరింత ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

వైసీపీ పాలనలో విద్యుత్ చార్జీల పెంపు

దర్శి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ళ పాలనలో అడ్డగోలుగా అనేకసార్లు విద్యత్ చార్జీలు పెంచిన విషయాన్ని మరచి ఇప్పుడు తగ్గించాలని నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వటం శోచనీయమని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ జి.స్టీవెన్ తదితరులు విమర్శించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ పాలకులు 13 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని పెనుభారం మోపిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ పాలకుల అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారన్నారు. వైసీపీ నాయకుల తప్పుడు ప్రచారాన్ని త్రిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

నిధులున్నా.. నిరుపయోగం

(5వ పేజీ తరువాయి)

యార్డులో నిర్మించారు. అయితే బీసీ కాలనీ కూడా యార్డుకు పక్కనే ఉంటుంది. అటు పూలే కానీల కూడా యార్డుకు దగ్గర్లో ఉంటుంది. విజయవాడ రోడ్డు, సుల్తానాబాద్ వంటి దూర ప్రాంత శివారుల్లో ఎక్కడా ఒక్క స్టేషన్ ఏర్పాటుకు మున్సిపాలిటీ ఆలోచనే చెయ్యలేదు. కేంద్రం నిధులిస్తోంది... నిర్మాణం కట్టమన్నారు కనుక ఎక్కడో ఒక చోట నిర్మించేస్తే పనయిపోతుందన్నట్టు పూర్తి నిర్లక్ష్యాన్ని తెనాలి మున్సిపల్ అధికారులు ప్రదర్శించారు. ఎక్కడి చెత్త అక్కడే అన్నట్టు చివరకు రూ. 2.16 కోట్లతో చత్త సమస్యకు చరమీతం పాడే అవకాశం ఉన్నా, అధికారుల ముందుచూపులేమి ఇక్కడి లక్ష్యాన్ని నీరు కార్చింది. పోనీ ఉపయోగమో! నిరుపయోగమో! వారు తలపెట్టినచోటయినా నిర్మాంచారా అంటే అదీలేదు. కంపోస్ట్ యార్డులో ఒక గదికోసం శ్లాబ్ వేసి వదిలేశారు. మిగిలిన రెండు చోట్ల అయితే పునాదుల దశలోనే ఆగిపోయి నాలుగేళ్లుగా ఎదురు చూసుతన్నాయి. అటు గుంటూరు నగరంలోనూ పలుచోట్ల నిర్మించేందుకు 223 కోట్లు, మిగిలిన నరసరావుపేట, మంగళగిరి, తాడేపల్లి, బాపట్ల, పొన్నూరు, చీరాల, అద్దంకి, మాచర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, సత్తెనపల్లి వంటి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ వీటి నిర్మాణం కోసం మొత్తంమీద మరో రూ. 30.6 కోట్లు కేటాయించారు. అయితే ఒకటి, రెండు చోట్ల మినహా మిగిలిన చోట్ల ఎక్కడా పనులు చివరి దవకు చేరలేదు. వైసీపీ సర్కారు కాలంలో అసలు వీటిని పట్టించుకున్న నాధుడే లేడంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికే అన్ని మున్సిపాలిటీల్లో కంపోస్ట్ యార్డులన్నీ చెత్తతో నిండిపోయాయి. కొన్నిచోట్లయితే చెత్త గుట్టలు కొండలను తలపిస్తున్నాయి.

బయో మైనింగ్ విధానంలో పరిష్కారం దిశగా

గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఇప్పుడు పట్టణాలకు శాపమయింది. పేరుకుపోయిన చెత్త గుట్టలను తొలగించటానికి, చెత్త సమస్యను అధిగమించటం కూటమి ప్రభుత్వానికి భారమే అవుతోంది. అప్పట్లో చెత్త నిదులను సద్వినియోగ పరచుకుంటే, ఇప్పుడు అంత ఖర్చు చెయ్యాల్సిన అవసరం ఉండేది కాదు. 2025 అక్టోబర్‌కు చెత్త గుట్టలే ఉండకూడదని నిర్ణయించుకుంది. దీనికోసం బయో మైనింగ్ విధానం ప్రవేపెట్టింది. దీనిద్వారా చెత్త గుట్టలను గ్రేడింగ్ చేసి, మట్టిని జల్లించి కంపోస్ట్ చేయదలిస్తే, ప్రమాదకర వ్యర్థాలను మాత్రం ఆదునిక విధానంలో నిర్వీర్యం చేస్తారు. దీనికోసం రాష్ట్రం మొత్తంమీద భారీ వ్యయమే అవుతోంది. ఒక్క తెనాలి మున్సిపాలిటీలోని చెత్తను బయో మైనింగ్ విధానంలో తొలగించటానికి రూ. 3.17కోట్లు ఖర్చవుతుంది. దీని ప్రకారంచూస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపాలిటీలన్నిటిలో రూ. 100 కోట్ల పైనే ఖర్చవుతుంది. గతంలో వచ్చిన నిధులను వినియోగించుకుంటే ఇప్పుడు ఇంత భారం పడేదికాదు. మొత్తంమీద గత ప్రభుత్వ నిర్వాకంతో పట్టణాల్లో పేరుకున్న చెత్తను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ఒక యజ్ఞాన్నే చేపట్టినట్టయింది.

కాల్వలపై.. కూటమి నేతల కన్ను

(5వ పేజీ తరువాయి)

వ్యయం అంచనా రూ. 3.34 కోట్లు. లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో 31 పనులు, వ్యయం అంచనా రూ. 3.65 కోట్లు. ఓఅండ్ఎం సిఫ్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 34 పనులు, వ్యయం అంచనా రూ. 1.78 కోట్లు. ఈ పనులు చేపట్టేందుకు జలవనరుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పనుల నిర్వహణకు టెండర్లను జలవనరుల శాఖ అధికారులు నిర్వహిచారు.

మూడు డివిజన్‌లలో టెండర్లు రద్దు

సత్తెనపల్లి, నరసరావుపేట లింగంగుంట్ల ఓఅండ్ఎం, వినుకొండ సిఫ్ట్ డివిజన్‌ల పరిధిలోని కాలువల మరమ్మతు పనులకు సంబంధించిన టెండర్లు రద్దు చేశారు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్‌లో రూ. 4.69 కోట్ల వ్యయంతో 101 పనులు, లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో రూ. 3.65 కోట్ల వ్యయంతో 31 పనులకు సంబంధించిన టెండర్లు నిర్వహించారు. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్‌లు కూడా పూర్తి చేశారు. పనులు నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి డివిజన్‌లో రూ. 3.34 కోట్ల వ్యయంతో 62 పనులు.. వినుకొండ పరిధిలో రూ. 1.78 కోట్ల వ్యయంతో 34 పనులు, లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో రూ. 4.21 కోట్ల వ్యయంతో 76 పనులు చేపట్టేందుకు అయా డివిజన్‌ల వారీగా టెండర్లు నిర్వహించారు. టెండర్ల ప్రక్రియ కాంట్రాక్టర్ల అగ్రిమెంట్ సమయంతో నిలిచిపోయింది. ఈ మూడు డివిజన్‌లలో రూ. 9.33 కోట్ల విలువైన 141 పనులు నిలిచిపోయాయి. సత్తెనపల్లి డివిజన్‌లో 62 పనులకు గాను 52 పనులకు టెండర్లు నిర్వహించగా ఐదు పనులకు సంబంధించి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్‌లు పూర్తయ్యాయి. ఈ ఐదు పనులు చేపడుతున్నారు. ఈ డివిజన్‌లో ఇంకా 57 పనులు టెండర్లు నిర్వహించాల్సి ఉంది.

టెండర్లు నిర్వహిస్తాం

కాలువల మరమ్మతు పనులు టెండర్లు రద్దు చేయడంపై సత్తెనపల్లి డివిజన్ ఈఈ మురళీధర్, వినుకొండ ఈఈ ప్రేమ్‌కుమార్, ఓఅండ్ఎం లింగంగుంట్ల ఈఈ డీవీ సుబ్బారావును వివరణ కోరగా టెండర్లు రద్దు చేశామన్నారు. పనులు చేపట్టేందుకు మళ్లీ టెండర్లు నిర్వహించనున్నట్టు చెప్పారు.

తమ్ములూరులో వైద్య శిబిరం

60 మందికి పరీక్షలు

ముండ్లమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని తమ్ములూరులో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 'మంచం పట్టిన తుమ్ములూరు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి 60 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి రక్త పరీక్షలు నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ గ్రామాన్ని సందర్శించారు. గత పది నుంచి 15 రోజులుగా వర్షాలు, మంచు వాతావరణంతో వైరల్ జ్వరాలు వస్తున్నాయని తెలిపారు. ప్రధానంగా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో దర్శి మలేరియా సబ్ యూనిట్ అధికారి బసవారెడ్డి, మారెళ్ళ ప్రాథమిక వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, హెచ్‌వో వెంకటరావు, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్త శిరీష, ఆషా తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలోని మురుగు కాలువల్లో ఎబేట్ పిచికారి చేయించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యకమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్ కుమార్

అన్ని హంగులతో అక్కడే ఎన్టీఆర్ విగ్రహం

- 31వ తేదీ కౌన్సిల్‌లో ఆమోదానికి అడుగులు
- ఎమ్మెల్యే కొండయ్య సొంత నిధులు, దాతల విరాళాలతో ఏర్పాటుకు ప్రయత్నాలు

చీరాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రస్తుతం ఎన్టీఆర్ విగ్రహం ఉన్న ప్రదేశంలోనే మరింత విస్తీర్ణంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు టీడీపీ సంకల్పించింది. అందులో భాగంగా బుధవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పలువురు నాయకులు, కార్యకర్తలతో కలసి ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. అదే స్థలంలో మరింత విస్తీర్ణంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని మరిన్ని హంగులతో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. కొందరు పాత కార్లు స్టాండ్ ప్రదేశాన్ని సూచిస్తున్నారు. అయితే బస్టాండ్ సెంటర్ అయితేనే బాగుంటుందని టీడీపీ శ్రేణులలో అత్యధికులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య తన సొంత నిధులతో పాటు దాతల నుంచి విరాళాలు సేకరించి ఎన్టీఆర్ విగ్రహాన్ని సుందరంగా ఏర్పాటు చేసేందుకు ఈ నెల 31వ తేదీన జరగనున్న కౌన్సిల్ సమావేశంలో అందుకు సంబంధించి ఆమోదం పొందేందుకు టీడీపీ కౌన్సిలర్లు అడుగులు వేస్తున్నారు. చీరాల రాజకీయం ఎప్పుడు రసకందాయమే. పురపాలక సంఘ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన సమయంలో వైసీపీకి అత్యధిక కౌన్సిలర్లు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పలువురు కౌన్సిలర్లు టీడీపీతో జతకట్టారు. మున్సిపల్ పరిధిలో మొత్తం 33 మంది కౌన్సిలర్లు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. సభా సంప్రదాయం ప్రకారం కోఆప్షన్ సభ్యులకు సలహాలు, సూచనలు చేసే హక్కు ఉంటుంది. అజెండాలోని అంశాలకు సంబంధించి ఓటింగ్ అవసరమైతే చైర్మన్, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లతో ఎక్స్ అఫిషియో మెంబర్లుగా ఎమ్మెల్యే, ఎంపీలకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. ఈ



బస్టాండ్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహ ఉన్న ప్రదేశం

నేపథ్యంలో ప్రస్తుతం కౌన్సిల్లో టీడీపీకి 14 మంది, వైసీపీకి 14 మంది, కాంగ్రెస్ పార్టీకి 5 మంది ఉన్నారు. గత నెల 29వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో పట్టణంలో పలువురు నేతల విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చాయి. విగ్రహాల అంశంపై చర్చలు, వాద, ప్రతివాదనలు జరిగాయి. అందులో భాగంగా మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఇచ్చిన అర్జీని అజెండాలో పొందుపరచకపోవటంపై కూడా ప్రస్తావన వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన విగ్రహాలకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించాలని భావించారు. అయితే 15వ తేదీ సమావేశం జరగలేదు. ఈ నెల 31వ తేదీ జరగనున్న కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన అజెండాలో విగ్రహాల ఏర్పాటు అంశాన్ని పొందుపరిచారు. ఈ క్రమంలో బుధవారం ఎమ్మెల్యే కొండయ్య పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఎక్కడైతే బాగుంటుందనే కోణంలో పలు ప్రాంతాలను పరిశీలించారు.

అభ్యంతరం తెలిపినవారి అంగీకారంతోనే..

బస్టాండ్ సెంటర్లో ప్రస్తుతం ఎన్టీఆర్ విగ్రహం మాత్రమే ఉంది. అ విగ్రహం వద్దకు వెళ్లేందుకు మెట్లు కూడా లేవు. ఎన్టీర్ జయంతి, వర్ధంతి ఇతర ముఖ్యమైన రోజులలో తాత్కాలిక మెట్ల ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మెట్లు నిర్మిస్తే తమకు ఇబ్బందని పలువురు చిరువ్యాపారులు కోర్టును ఆశ్రయించారు. ఆ క్రమంలో అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి మెట్లు ఏర్పాటు జరగలేదు. ఎవరైతే అభ్యంతరం తెలిపారో వారి అంగీకారంతోనే, వారి ఉపాధికి ఇబ్బంది లేకుండా, అవసరమైతే వారికి పక్కా దుకాణాలు ఏర్పాటుచేసి అక్కడే ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహాన్ని అన్ని హంగులతో సర్వాంగసుందరంగా రూపొందించే విధంగా ఎమ్మెల్యే కొండయ్య పావులు కదిపినట్లు సమాచారం. అందుకు ఆ దుకాణదారులు కూడా అంగీకారం తెలిపినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే కొండయ్యకు ఓ మైలురాయిగా..

బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి మెట్లు ఏర్పాటు చేసేందుకు ఎందరు ప్రయత్నించినా ఫలించలేదు. ఆ విషయమై టీడీపీ శ్రేణులు, పార్టీలకు అతీతంగా ఎన్టీఆర్ అభిమానుల్లో అసంతృప్తి ఉంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య అక్కడ అభ్యంతరం చెప్పేవారిని ఒప్పించి సుమారు సెంటు స్థలంలో ఎన్టీర్ విగ్రహ ఏర్పాటుకు మార్గం సుగమం చేసినట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అదే జరిగితే నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణుల దీర్ఘకాలిక కోరికను కొండయ్య నెరవేర్చినట్లవుతుందనడంలో సందేహం లేదు. ఇది ఆయనకు మైలురాయిగా నిలుస్తుందని టీడీపీ శ్రేణులు, నందమూరి వంశాభిమానులు అంటున్నారు.



శ్రీలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

టీడీపీ నేత శ్రీలక్ష్మికి ఎమ్మెల్యే ఏలూరి నివాళి

పర్చూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పర్చూరు పట్టణపార్టీ అధ్యక్షులు అగ్నిగుండాల వెంకట కృష్ణారావు సతీమణి తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు శ్రీలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శ్రీలక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకట కృష్ణారావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. శ్రీలక్ష్మి మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, నాయకులు కొల్లా శివరాం ప్రసాద్, కఠారి సురేంద్రబాబు, దూళిపల్లి వెంకటస్వామి, పఠాన్ సమీర్, లక్కిపోగు సుమన్, షేక్ గౌస్ బాషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు దిక్సూచిలా ఉండాలి

మార్టూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి ఆదర్శంగా, విదాయర్థులకు రోల్ మోడల్‌గా ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈవో వస్రాం నాయక్ అన్నారు. మండలంలోని చిమ్మిరిబండ జడ్పీ హైస్కూల్ లో సెకెండరీ గ్రేడ్ టీచరుగా పనిచేస్తున్న తాటి రత్నాకర్ ఈ నెల 31 వతేదీ ఉద్యోగ విరమణ చేయనున్నారు.ఈ మేరకు గురువారం మధ్యాహ్నం రాజుపాలెం కూడలి వద్ద ఉన్న సాయి బాలాజీ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయుడు ఎం.ఈశ్వరప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఈవో వస్రాం నాయక్, విశ్రాంత ఎంఈవో రామాంజనేయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కే హనుమంతరావు, మండలంలోని పలు జడ్పీ హైస్కూళ్లకు చెందిని ప్రధానోపాధ్యాయులు పోతురాజు, చలపతి, కరిముల్లాతో పాటు ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, గరిమిడి శ్రీను, గిరి, వెంకట్రావుతోపాటు రావుల బాపయ్య, పలువురు గ్రామ పెద్దలు, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు రత్నారావును శాలువాపూల మాలలతో సత్కరించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి



తిరుపతయ్య (ఫైల్)

అద్దంకిటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మవరంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న మేడా తిరుపతయ్య (57) గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పది రోజుల కిందట అద్దంకి పట్టణంలో బైక్‌పై వెళ్తూ కింద పడిన తిరుపతయ్యను గుంటూరు వైద్యశాలలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ తిరుపతయ్య గురువారం వేకువజామున మృతి చెందారు. మృతినికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తిరుపతయ్య మృతి చెందడం పట్ల మండలంలోని పలువురు ఉపాధ్యాయులు తమ సంతపాన్ని తెలియజేశారు.

కేజీబీవీ విద్యార్థినులకు భోజన కష్టాలు

- వంట పనివారు డుమ్మా
- ఉపాధ్యాయులే వండుతున్న వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- తల్లిదండ్రుల ఆగ్రహం



కస్తూర్బా బాలికల విద్యాలయం

బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వంట పనివారు ఒకే మారు విధులకు డుమ్మా కొట్టారు. దీంతో కస్తూర్బా విద్యార్థినులకు భోజనం కష్టాలు ఎదురయ్యాయి. వంట మనుషులు లేకపోవడంతో ఉపాధ్యాయులే అరకొరగా వంట చేసి బాలికలకు వడ్డిస్తున్నారు. 15 రోజుల నుంచి ఈ సమస్య తలెత్తినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బల్లికురవ మండల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరు నుంచి ఇంటర్ వరకు సుమారు 250 మంది పైచిలుకు బాలికలు చదువుతున్నారు. వీరికి వంట చేసేందుకు నలుగురు ఉన్నారు. వారిలో ఒకరు ఇటీవల మృతి చెందారు. ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఒకామె మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మిగిలిన ఇద్దరు విధులకు రావడం లేదు. దీంతో కేజీబీవీలో బాలికలకు వంట చేసి పెట్టే వారు కరువయ్యారు. దీంతో విద్యార్థినులు ఆకలితో అలలమటిస్తున్నారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రికి బాలికలకు అవసరమైన అల్పాహారం, భోజనం వండి వడ్డించాల్సి ఉంది. వంట పనివారు లేకపోవడంతో ఏదో అన్నం, కూర వరకు ఉపాధ్యాయులే వండి పెడుతున్నారు. 15 రోజులుగా విద్యాలయంలో వంట చేసే విషయంలో సమస్యలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంట మనుషులు రాకుంటే ప్రత్యామ్నాయం చూసి వంట చేయించాలే గానీ సిబ్బంది వండడం ఏమిటలని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. బడి మానేసిన (డ్రాపౌట్స్) బాలికలకు మెరుగైన విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన విద్యాలయంలో చదువులు గాడి తప్పుతున్నాయని, బోధన చేయాల్సిన సిబ్బంది వంట చేస్తుంటే చదువులు ఎలా సాగుతాయని తల్లిదండ్రులు అంటున్నారు. విద్యాలయాల నిర్వహణ, పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంవల్లే ఇలా జరుగుతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా అధికారులు కేజీబీవీని పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వంట మనుషులకు నోటీసులిచ్చాం

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వంట మనుషులు విధులకు రాకపోవడంతో జిల్లా అధికారులకు సమాచారం అందించాం. వారిని తొలగించేందుకు నోటీసులు కూడా ఇచ్చాం. పదిహేను రోజుల నుంచి విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయులే వంటి చేస్తున్నారు. వంట మనుషులు ఒకే మారు విధులకు డుమ్మా కొట్టడంతో ఇబ్బంది ఏర్పడింది. కొత్త వారిని నియమించేందుకు చర్యలు చేపడుతున్నాం.

\- ప్రిన్సిపాల్ సరళాకుమారి

బాలాలయం నిర్మాణానికి శంకుస్థాపన

చినగంజాం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానం ప్రాంగణంలో బాలాలయం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సీతారామాలయ పునర్ నిర్మాణంలో భాగంగా బాలాలయం నిర్మాణాన్ని చేపట్టినట్లు సీతారామాలయ కమిటీ సభ్యులు వలివేటి వెంకటరామానుజం, మోటుమర్రి రామసుబ్బారావులు తెలిపారు. సీతారామాలయం ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులు భజనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం నుండి 41 రోజుల పాటు 41 భజన బృందాలచే ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు భజన కార్యక్రమాలను జరుపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. తదనంతరం తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

రేపటి నుంచి గుంటుపల్లిలో రీ-సర్వే

బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గతంలో నిలిచిన రీసర్వే పనులను గుంటుపల్లి రెవెన్యూలో శనివారం నుంచి తిరిగి ప్రారంభిస్తామని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. గుంటుపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న గ్రామాలకు సంబంధించిన 4573 ఎకరాలకు సంబంధించిన భూములకు ప్రత్యేక టీంల ద్వారా సర్వే చేయించి రైతులకు పూర్తి స్థాయిలో సమస్యలు లేకుండా చేస్తామని రైతులు సర్వే రోజు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కోరారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలు, గాలుల ప్రభావంతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ ఏవో కుమారి పరిశీలించా రు. మండలంలోని చిన అంబడిపూడి గ్రా మంలో వర్షాలతో పడిపోయిన వరి పంటలు, నీటిలో ఉన్న వరి ఓదెలను ఏవో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ఎవరు వర్షాలు తగ్గేవర కు కోతలు కోయవద్దని అన్నారు. కోసి ఉంటే నీరు బయటకు వెళ్ల బెట్టాలన్నారు. ధాన్యాన్ని రైతులు కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు దద్దాల అంజయ్య, అనిల్, నీటి సం ఘ అధ్యక్షుడు దద్దాల విజయ్ పాల్గొన్నారు.



వరి ఓదేలను పరిశీలిస్తున్న ఏవో వెంకట కృష్ణ

ధాన్యాన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలాలి

అద్దంకిటౌన్ : వర్షాల పడుతున్నందున రైతులు ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం అ ద్దంకి అర్బన్ పరిధిలో పోలంపొలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన పోలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రాం తాలలో కోసిన వరి ఓదేలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తడిసిన వరి ఓదెలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షపాతం తక్కువగా నమోదు అయినందువలన పంట దెబ్బతినలేదని తెలిపారు. ధాన్యం కోనుగోలుకు ప్ర భుత్వం కేంద్రాలను ఏర్పాటు చేసిందని గ్రేడ్ ఏరకం క్వింటాల్‌కు రూ.2320 చెల్లిస్తున్నదని, తేమ శాతం 17లోపు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సాయిబాబు, కోటేశ్వరరావు, శేషారావు, చింతా వెంకటే శ్వర రెడ్డి పాల్గొన్నారు.

పొటోరైటప్ః26సీజేఎం1చినగంజాం ప్రాంతంలో వరిపైర్లను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి భాస్కరరావు

వరి, శనగ పరిశీలన

చినగంజాం : మండలంలోని మోటుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో, పెదగంజాం గ్రామ ప్రాంతంలో వేసిన వరిపైరును, కడవకుదురు, చింతగుంపల్లి, గొనసపూడి, సంతరావూరు గ్రామాల్లో సాగు చేస్తున్న శనగ పంటను వ్యవసాయాధికారి కే.భాస్కరరావు గురువారం పరిశీలించారు. పంట పొలాల్లో నిలిచిన వర్షపునీటిని బయటకు పంపించుటకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా రైతులకు ఆయన సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, వరి, శనగ రైతులు పాల్గొన్నారు.

తుప్పు తెగులు నివారణ చర్యలు చేపట్టాలి

యద్దనపూడి : శనగపైరులో తుప్పుతెగులు నివారణ చర్యలపై పర్చూరు ఏడీఏ ఎన్.రామ్మోహనరావు రావు రైతులకు పలు సూచనలు చేశారు. గురువారం యద్దనపూడి మండలంలోని వింజనంపాడు, చిమటావారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన రామ్మోహనరావు, వ్యవసాయ అధికారి మేరమ్మ శనగ పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏడీఏ మాట్లాడుతూ నత్రజని, భాస్వరం, పొటాషియం వినియోగంపై వాటి ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా ఎండు తెగులు నివారణా చర్యలను రైతులకు తెలియ చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



అంబడిపూడిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో కుమారి



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు భూ సమస్యను వివరిస్తున్న రైతు

భూ సమస్యలకు తక్షణ పరిష్కారం

పంగులూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు తగిన పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల సమస్యలు తెలుసుకుని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వం భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఆర్‌వోఆర్‌కు సంబంధించి 5, భూముల సర్వేకు సంబంధించి 3 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ బి.సురేష్, రామలింగస్వామి, పలువురు రైతులు పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం జనవరి 3వ తేదీన ఎంపీపీ శ్రీలక్ష్మి అధ్యక్షతన జరుగుతందని ఎంపీడీవో కె.కుసుమకుమారి తెలిపారు. ఈ సమావేశంలో గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



మద్యం తాగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మందుబాబులు ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు తప్పవు అని ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. గురువారం బల్లికురవ ఆర్టీసీ బస్టాండ్‌లో మద్యం తాగుతున్న వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్ల వెంబడి, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల భవనాల వద్ద మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సే వించి వాహనాలు నడిపితే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకలలో ఎవరైనా అల్లర్లకు దిగితే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

పెద్దవాహనాలు ట్రాఫిక్ మళ్లింపు

ఇంకొల్లు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు కడవకుదురు రోడ్డులో కల్వర్టరు దెబ్బతినడంతో పెద్ద వాహనాల ట్రాఫిక్ మళ్లించారు. చీరాల, ఒంగోలు బస్సులను గురువారం నుంచి స్తూపం సెంటర్ మీదగా బస్టాండు వైపు మళ్లించాలని పంచాయతీ కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు సూచించారు. కూలిన కల్వర్టరు స్థానంలో నూతన కల్వర్టరు నిర్మించాలని సంబంధిత అధికారులకు తెలియజేసామన్నారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా చుట్టూ బస్తాలను ఉంచామన్నారు.

అదృశ్యమైన వ్యక్తి తిరిగి ఇంటికి

చీరాలటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా చీరాల మండలం కావూరివారి పాలెం పంచాయతీ ఆంధ్రకేసరి నగర్‌లో వ్యక్తి అదృశ్యం కథ సుఖాంతమైంది. ఆర్థిక పరమైన సమస్యలతో మనస్థాపం చెందిన డీ ఆనంద్ ఆత్మహత్మకు పాల్పడేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపాడు. అయితే కుటుంబ పరస్థితులు, తదితర సమస్యలు ఆలోచించి ఆత్మహత్య సరికాదని తిరిగి ఈపూరుపాలెం పోలీసులకు సమాచారం చేర వేశాడు. స్వయంగా ఇంటికి తిరిగి వచ్చేశాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈసందర్భంగా ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోకుండా ఆనందలా ఆలోచించి ఆనందంగా ఉండాలన్నారు.

సీఎస్సీ సెంటర్‌లో పరికరాల ధ్వంసంపై కేసు

చీరాలటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీఎస్సీ (కామన్ సర్వీస్ సెంటర్)లో పరికరాలు ధ్వంసంపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో ఎరిపిల్లి రమణయ్య సీఎస్సీ సెంటర్ నడుపుతుండగా అందులో గోసాల దుర్గా ప్రసాద్ గుమస్తాగా పని చేస్తున్నారు. ఈక్రమంలో యజమాని లేని సమయంలో అదే ప్రాంతానికి చెందిన పిక్కి రాజు అక్రమంగా చొరబడి రూ.2వేలు నగదు కావాలని డిమాండ్ చేయగా, అందుకు గుమస్తా దుర్గా ప్రసాద్ నిరాకరించారు. ఈక్రమంలో ఆగ్రహించిన రాజు సుమారు రూ.80వేలు విలువైన కంప్యూటర్, వివిధ రకాల పరికరాలను ధ్వంసం చేశాడు. ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

రాధాకు 104 సిబ్బంది వినతి

చినగంజాం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రతి నెల 104 సిబ్బందికి వేతనం సక్రమంగా చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని 104 సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో వంగవీటి మోహన్‌రంగా కాంస్య విగ్రహం ఆవిష్కరణకు గురువారం సోపిరాల వచ్చిన వంగవీటి రాధాకు 104 సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జీవో నెంబరు 7ప్రకారం 104లో పనిచేస్తున్న డ్రైవర్లు, డీఈవోలకు వేతనాలు చెల్లించాలని, మూడేళ్లగా యాజమాన్యం అధీనంలో ఉంచుకున్న ఇంక్రీమెంట్లు ఏరియర్స్ రూపంలో ఇవ్వాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పనికి తగ్గ వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని లేకుంటే సమ్మె బాట పడతామని 104 ఉద్యోగులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104 డీఈవో పొదిలి రాఘవ, 104 పైలెట్ విజయ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

అద్దంకిటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ సమగ్రత, ఐకృత కోసం అలుపెరగని పోరాటాలు చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అని మాజీ ఎమెల్సీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్ అన్నారు. గురువారం అద్దంకి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల వేడుకను స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జెండాను విల్సన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, భాగ్యశ్రీధర్, కేఎల్‌డీ ప్రసాద్, తుమ్మల చంద్రశేఖర్, గర్నెపూడి ప్రసాద్, కాలేషా, ఖాదర్ బాషా, రిక్షావర్కర్స్ యూనియన్ నాయకులు చిలక యేసు, అరిగల గురవయ్య, ఆకుల పిచ్చయ్య, మలాది వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విల్సన్

- కర్షకుడికి కన్నీళ్లు తెప్పిస్తున్న వరుణుడు
- వేలాది ఎకరాల్లో దెబ్బతింటున్న పంటలు
- మెట్టపైర్లకు కలుపు బెడద.. పొగాకు రైతుల్లో గుబులు
- మళ్లీ వర్షం కురుస్తుండటంతో ఆవేదన

ముసురు ముంచేస్తోంది !



కలిగిరి : దెబ్బతిన్న పొగాకును పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

కందుకూరు/ఉదయగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో వరుస తుపాన్లు, అల్పపీడన ద్రోణుల ప్రభావంతో నెలకొన్న వాతావరణ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలకు మరింత ఆవేదన చెందుతున్నారు. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంటలు నీట మునగడంతో పాటు తెగుళ్లు, పురుగులు ఉధృతి అధికమైంది. ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపైరును కొందరు రైతులు కోతలు కోస్తుండగా, మరికొందరు కోసిన పైరును ఎండబెట్టిన వారు నష్టపోయారు. అలాగే మొలకదశలో ఉన్న శనగ, పూత, పిందె దశలో ఉన్న కంది, మినుము, పెసర, అలసంద పంటలతోపాటు పొగాకుకు తీవ్రం నష్టం వాటిల్లింది.

● పదిరోజులుగా వాతావరణం తెరపిచ్చి భూములు ఆరుదలకు వచ్చిన దశలో మంగళవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండటం, మరో రెండురోజులపాటు వర్షాలు ఉంటాయన్న వాతావరణశాఖ ప్రకటనతో కందుకూరు డివిజన్‌లోని కర్షకుల్లో గుబులు మొదలైంది. పొగతోటలకు ప్రత్యక్షంగా కాకున్నా పరోక్షంగా ఈ వర్షాలు తీవ్రనష్టం కలిగిస్తాయి. ముదురు పొగ తోటలు 20 రోజులుగా రెలుపులు ప్రారంభం కాగా, ప్రతి రెలుపునకు ఆకు జిగురు కారిపోయేలా వర్షం కురుస్తుండటంతో నాణ్యతలేని పొగాకు దిగుబడులు వస్తున్నాయి. లేత పొగనాట్లలో కలుపు విపరీతంగా పెరిగిపోయి ఏంచేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. పొగ తోటల్లో కలుపు తీయాలంటే ఎకరాకు రూ.15-20వేల వరకు ఖర్చయ్యే పరిస్థితి. ఇన్నిరోజులు తేమ వాతావరణం కొనసాగుతు న్నందున బొబ్బతెట్టు వంటి వైరస్‌తెగుళ్లు సోకే ప్రమాదం కూడా పొంచి ఉంది.

● ఇక మినుము సాగుచేసిన రైతుల పరిస్థితి అయితే చెప్పనవసరం లేదు. కందుకూరు డివిజన్‌లో రమారమి 15వేల ఎకరాల్లో మినుము సాగు చేసినట్లు అంచనా కాగా 90 శాతం విస్తీర్ణంలో ఇక కోతలు కూడా కోయటం వృథా అన్న అభిప్రాయానికి రైతులు వచ్చేశారు. మినుము పూత, పిందె దశలో ఉండగా తుఫాన్లు ప్రభావంతో భారీ వర్షాలు కురవటంతో బూడిదతెగులు సోకి పైరు దెబ్బతింది. అలాగే వర్షాధారంగా సాగుచేసిన కూరగాయలు పంటలు, కంది పైరుకు కూడా ఈ వర్షాల వల్ల నష్టమేనని కలుపులు విపరీతం అవటమే గాక చీడపీడలు పైర్లు ఎదుగుదల లేకుండా చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క పప్పుశనగ సాగుకు



ఉదయగిరి ప్రాంతంలో దెబ్బతిన్న మినుము

- మిగతా 6వ పేజీలో

జిల్లాలో జికా వైరస్ లేదు

- అందిన రక్తనమూనాల నివేదిక
- 22 మందికీ నెగటివే...
- చెన్నైలో కోలుకుంటున్న బాలుడు

మర్రిపాడు/ నెల్లూరు (వైద్యం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జికా వైరస్ కలకలం రేపిన బాలుడి రక్తనమూనాలకు పూణేలో నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్ వచ్చినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ గోపీనాథ్ గురువారం తెలిపారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బాలుడు ఇటీవల నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా, ఆ బాలుడికి వైద్యులు నిర్వహించిన రక్తపరీక్షలో జికా వైరస్ లక్షణాలు కనిపించాయి. దీంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమై గ్రామంలో పర్యటించారు. మూడురోజుల పాటు వైద్యశిబిరం ఏర్పాటు చేసి, పారిశుధ్యం చర్యలు చేపట్టారు. బాలుడితో సన్నిహితంగా ఉన్న 22 మంది రక్త నమూనాలు సేకరించి పూణేలోని ల్యాబ్‌కు పంపారు. అక్కడ అందరికీ నెగటివ్ రిపోర్టులు వచ్చినట్లు డాక్టర్ గోపీనాథ్ ప్రకటించారు. దీంతో కొంతకాలంగా భయభ్రాంతులకు గురవుతున్న గ్రామస్థులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం చెన్నైలో చికిత్స పొందుతున్న బాలుడి పరిస్థితి మెరుగ్గా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

● ఎవరికీ లక్షణాలు లేవు..

జిల్లాలో ఎవరికీ జికా వైరస్ లక్షణాలు లేవని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో జికా వైరస్‌పై 11 రోజులుగా వస్తున్న కథనాలకు బ్రేక్ వేసినట్లయింది. చెన్నైలో చికిత్స పొందుతున్న మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు(5)కి కూడా జికా వైరస్ లేదని తమిళనాడుకి చెందిన పబ్లిక్ హెల్త్ ల్యాబ్ ఈ నెల 19న ఓ నివేదిక ఇచ్చిందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా బాలుడి నుంచి రక్త నమూనాలు సేకరించి పూణే ల్యాబ్‌కు పంపారని, అక్కడ ల్యాబ్‌లో కూడా జికా వైరస్ లేదని స్పష్టమయిందని ఆమె పేర్కొన్నారు.



నెల్లూరు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

ఘనంగా సీపీఐ వందేళ్ల ఉత్సవాలు

- నెల్లూరు, కందుకూరులో ప్రదర్శన
- నగర పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల ఉత్సవాలు గురువారం నెల్లూరు నగరంలో ఘనంగా జరిగాయి. గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ, ట్రంకు రోడ్‌ల మీదుగా సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం వరకు పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీనియర్ నాయకుడు రామరాజు పార్టీ జెండా ను ఆవిష్కరించారు. అనంతరం నగర కార్యదర్శి అరిగెల సాయి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఉవ్వెత్తున విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, కర్షక ప్రజా నీకాన్ని కూడగట్టి తెల్ల దొరల్లో వణుకు పుట్టించిన ఎర్రజెండా వందేళ్లలో అడుగు పెట్టిందన్నారు. దేశ వ్యాప్తంగా వందేళ్ల ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నాయకులు జిలాని ఖాన్, షేక్ షానవాజ్, చిన్న అంకయ్య, వినోదిని, వనజమ్మ సోఫియా, సాయిలత తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల చరిత్ర కమ్యూనిస్టులది...

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): దేశంలో కమ్యూనిస్టులకు పోరాటాల చరిత్ర ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్య పేర్కొన్నారు. పార్టీ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా గురువారం చౌడారెడ్డి స్థూపం వద్ద నుంచి కందుకూరులోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నేతల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విక్కిరాలపేటరోడ్డులో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనను అంతమొందించటంలో నాలుగు వేలమంది కమ్యూనిస్టులు బలిదానం చేశారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యానంతరం పేదలకోసం పోరాటాలు చేసి విజయం సాధించిందన్నారు. సీనియర్ నాయకుడు పీ బాలకోటయ్య అధ్యక్షతన జరిగిన సభలో నాయకుడు పోకూరి మాలకొండయ్య, బూసి సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, లక్ష్మీనారాయణ, హుస్సేన్, మురళి, కాకుమాని రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు



నెల్లూరు నగరంలోని మినీ బైపాస్‌లో భోజనం బండి

బండిపై తిండి.. వెరీ ట్రెండీ !

- పెరిగిన స్ట్రీట్ ఫుడ్ వాహనాలు
- నడిచే హోటళ్లలో రుచిగా, శుచిగా ఆహారం
- సామాన్యులకు అందుబాటులో ధరలు
- విస్తరిస్తున్న మొబైల్ ఫుడ్ కోర్టు వ్యాపారం

నెల్లూరు నగరంతోపాటు ఇతర పట్టణాల్లోనూ రోజురోజుకు మొబైల్ ఫుడ్ కోర్టులు (నడిచే హోటళ్లు) విస్తరిస్తున్నాయి. వీటిల్లో లభించే ఆహార పదార్థాలు శుచిగా, రుచిగా ఉండడంతో ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. అంతేకాక ఈ ఫుడ్ కోర్టులు పలువురు నిరుద్యోగులకు ఉపాధి చూపుతున్నాయి. పెద్ద పెద్ద హోటళ్లకు వెళితే ఎంతో ఖర్చు చేయాల్సి వస్తున్నది. సంచార వాహనాల్లో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో చౌకగా, శుభ్రంగా ఉండటంతో వీటికి ఆదరణ పెరుగుతుంది.

- వివరాలు 6వ పేజీలో

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం



నెల్లూరు (వైద్యం) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై పలువురు నేతలు సంతాపం తెలిపారు. గురువారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో మన్మోహన్ సింగ్ తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సంతాపం తెలియచేశారు. అలాగే నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా తీవ్ర సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల పాటు ప్రధానిగా మన్మోహన్ సింగ్ పనిచేసి దేశ పురోభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖామంత్రిగా పలు సంస్కరణలను తీసుకువచ్చారని తెలిపారు. అలాంటి వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందటం ఎంతో బాధాకరమన్నారు.



సాగు సంపూర్ణం

వ్యవసాయానికి పేరుగాంచిన జిల్లాలో సరిగ్గా ఏడు నెలల క్రితం రైతుల ఆర్తనాదాలు వినిపించాయి. ధాన్యం ధరలు ఎక్కువగా ఉన్నా, నాటి పాలకుల అసమర్థ పాలనతో ఎకరా కూడా సాగుచేయలేని దుస్థితి దాపురించింది. ప్రాజెక్టుల్లో నీరు ఖాళీ కాగా, గతేడాది మొదటి పంట సగం ఆయకట్టులోనే సాగైంది. ఇక రెండో పంట ఊసే లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు చేరి, పూర్తి ఆయకట్టు సాగులోకి వచ్చింది. దీంతో జిల్లాలో ఎటుచూసినా పచ్చటి పైర్లతో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తోంది. అదే సమయం లో పూడికతో నిండిన కాలువలు కొత్త రూపు సంతరించుకున్నాయి. వైసీపీ ప్రభుత్వం పుణ్యమా.. అని సోమశిల అప్రాన్ పనులకు బ్రేకులు పడగ్గా.. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబునాయుడు జిల్లాకు రావడంతో ఆ పనులు మొదలయ్యాయి. మొత్తంగా ఈ ఏడాది మొదటి ఆరు నెలలు అష్టకష్టాలు పడ్డ అన్నదాతలు, ఆ తరువాత ఆ కష్టాల నుంచి బయటపడ్డారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



సోమశిల జలాశయం ముందు జరిగిన అప్రాన్ పనులు



దువ్వూరు కాలువలో పూడిక తీస్తున్న యంత్రాలు

- ప్రతి ఎకరాకు నీరు.. అన్నదాతల ఆనందం
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇరిగేషన్ ప్రాజెక్టులు, పనుల్లో కదలిక
- సీఎం చంద్రబాబు రాకతో అప్రాన్ పనుల ప్రారంభం
- పూడికతీతతో పంట కాలువకు కొత్తరూపు
- పెండింగ్ బిల్లుల చెల్లింపు, కాంట్రాక్టర్ల సంతోషం
- రైతు సంక్షేమం కోసమే సాగునీటి సంఘాల ఎన్నికలు

● జిల్లాకు వరప్రసాదిని సోమశిల ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు కింద 5.50 లక్షల ఎకరాల ఆయకట్టుతోపాటు కండలేరు జలాశయం ఆధారపడి ఉంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సోమశిల జలాశయాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. రెండేళ్ల క్రితం వచ్చిన భారీ వరదలకు సోమశిల అప్రాన్ దెబ్బతింది. దీంతో ప్రాజెక్టు మనుగడ ప్రమాదంలో పడింది. వెంటనే అత్యవసరంగా పనులు చేపట్టాలని అప్పుడే హైపవర్ కమిటీ హెచ్చరించినా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదు. పనులు ప్రారంభించాక కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలో ఆగిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం హోదాలో చంద్రబాబునాయుడు సోమశిల జలాశయాన్ని సందర్శించారు. వెంటనే అప్రాన్ పనులు చేపట్టాలని, సకాలంలో బిల్లులు చెల్లిస్తామని కాంట్రాక్టర్‌కు హామీ ఇవ్వడంతో పనులు మొదలయ్యాయి. అలానే గేట్లు, రోప్‌లు వంటి ఇతర మెయింటెన్స్ పనులకు మరో రూ.6 కోట్లను మంజూరు చేయడంతో ఇప్పుడు ఆ పనులు కూడా జరుగుతున్నాయి. అదే సమయంలో మెట్ట ప్రాంతాల కల అయిన సోమశిల హైలెవల్ కెనాల్ పనుల్లో కూడా పురోగతి కనిపించింది. భూసేకరణపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టడంతో త్వరలోనే కాలువ పనులు ప్రారంభం కానున్నాయి.

కాలువల్లో పూడికతీత

సాగునీటి యాజమాన్యంలో కాలువలు ప్రధానమైనవి. అలాంటి కాలువలను గత ప్రభుత్వంలో గాలికొదిలేశారు. గత మూడేళ్లుగా పూడిక తీయకుండానే తీసినట్లుగా బిల్లులు తినేశారు. దీంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందలేదు. నీటి యాజమాన్యంలో నిర్లక్ష్యం కారణంగా గతేడాది సుమారు 20 టీఎంసీల నీటిని దుర్వినియోగం చేశారు. ఈ విషయమై కూటమి అధికారంలోకి రాగానే దృష్టి పెట్టి సుమారు రూ.30 కోట్లను మంజూరు చేసింది. దీంతో ప్రస్తుత సీజన్ మొదలయ్యేలోపు కాలువల్లో పూడికతీత పనులు పూర్తయ్యాయి. ఈ కాలువలను ఇప్పుడు చూస్తుంటే కొత్తగా కనిపిస్తున్నారు. అదే సమయంలో రానున్న రెండో పంటకు ఇంకా ఏవైనా కాలువల్లో పూడిక తీయాల్సి ఉంటే ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మరో రూ.20 కోట్లకు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇవన్నీ రైతులకు కలిసొచ్చే అంశాలే.

● సాగునీటి సంఘాలకు ఎన్నికలు

మొదటి ఆరునెలల్లో తమను పట్టించుకునేదెవరన్న ఆందోళనలో ఉన్న రైతులకు ఆ తర్వాత మంచి రోజులు వచ్చాయి. ఎన్నో ఏళ్లుగా ఎన్నికలు లేకుండా ఉన్న సాగు నీటి సంఘాలకు కూటమి ప్రభుత్వం పట్టుదలతో ఎన్నికలు నిర్వహించింది. తద్వారా అనేక మంది రైతులకు పదవులు దక్కాయి. అంతేకాక రైతు సమస్యల

- మిగతా 6వ పేజీలో

రవాణా ఎట్టా!?



నెల్లూరులోని రవాణా శాఖ జిల్లా కార్యాలయం ముందు రోడ్డు అధ్వానంగా ఉంది. వాహనాల చక్రాలు మునిగిపోయేంత గుంతలు, వాటిలో వర్షపునీటితో ఆ వీధిలో బండి నడపాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నాయి. ఈ కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులతోపాటు నిత్యం వివిధ పనుల నిమిత్తం పెద్ద సంఖ్యలు ప్రజలు వస్తుంటారు. వారందరికీ ఇక్కడి రోడ్డు నరకం చూపిస్తోంది.



స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వైభవంగా శ్రీహరి కళ్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో మాగుంట లే అవుట్ లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మార్గశిర బహుళ ఏకాదశి సందర్భంగా ఈ వేడుక నిర్వహించారు. అర్చకులు , వేద పండితులు శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణోత్సవం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

అందని కౌలు రైతు కార్డు

- మూడు నెలలుగా తిప్పుకుంటున్న వీఆర్వో
- బాధిత రైతు ఆవేదన

వలేటివారిపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కౌలురైతు కార్డు కోసం దరఖాస్తు చేసి మూడు నెలలు అవుతున్నా వీఆర్వో మల్లేశ్వరి సర్వర్ లేదని ఒకసారి, నా లాగిన్ పనిచేయడం లేదని మరొకసారి, మీరు పెట్టిన దరాఖాస్తు కనిపించడం లేదని ఇలా తిప్పుకున్నారని పోలినేనిపాలెం రైతు మాదాల చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశాడు. కౌలురైతు కార్డుకు అన్ని అర్హతలున్నా వీఆర్వో ఇబ్బందులు పెడుతున్నట్లు బాధితరైతు వాపోయాడు. కార్డు లేకపోవడంతో బ్యాంకులో పంట రుణం పొందలేక సకాలంలో పంటలు సాగు చేయలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కౌలు కార్డులు పంపిణీ సైట్‌ను నిలిపివేసిందని, వీఆర్వో మాత్రం కౌలు కార్డుకు మళ్లీ దరఖాస్తు చేయాలని సలహా ఇస్తుందని చెప్పారు. సంభందిత అధికారులు స్పందించి విధుల పట్ల బాధ్యతారహిత్యంగా వ్యవహరించే వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని రైతు చిరంజీవి కోరారు.

ఎరువుల పంపిణీ



కొండముడుసుపాలెంలో రైతుసేవా కేంద్రం ద్వారా రైతులకు యూరియా అందజేస్తున్న వ్యవసాయాధికారులు

కందుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండముడుసు పాలెంలో రైతుసేవా కేంద్రం లోని యూరియాను వ్యవసా యాధికారులు ఎమ్మార్పీ ధరలకు గురువారం రైతులకు పంపిణీ చేయించారు. అనం తరం కొండ ముడుసుపాలెం, కంచరగుంటలో పొలం పిలుస్తోందిలో భాగంగా ఏఓ వి.రాము పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్ర మంలో మండల పశువైద్యాధికారి చెన్నకేశవులు, ఉద్యాన వ్యవసాయ సహాయకులు రమాదేవి, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

బండిపై తిండి
వెరీ ట్రెండీ

- పెరిగిన స్ట్రీట్ ఫుడ్ వాహనాలు
- నడిచే హోటళ్లలో రుచిగా, శుచిగా ఆహారం
- వెజ్, నాన్‌వెజ్, టిఫిన్లు అన్నీ...
- సామాన్యులకు అందుబాటులో ధరలు
- విస్తరిస్తున్న మొబైల్ ఫుడ్ కోర్టు వ్యాపారం
- ఆదరిస్తున్న పట్టణ, నగర వాసులు
- ఎంతోమందికి స్వయం ఉపాధి



ముత్తుకూరు రోడ్డులో బిర్యానీ అమ్మకాలు

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంతోపాటు ఇతర పట్టణాల్లోనూ రోజురోజుకు మొబైల్ ఫుడ్ కోర్టులు (నడిచే హోటళ్లు) విస్తరిస్తున్నాయి. వీటిల్లో లభించే ఆహార పదార్థాలు శుచిగా, రుచిగా ఉండడంతో ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. అంతేకాక ఈ ఫుడ్ కోర్టులు పలువురు నిరుద్యోగులకు ఉపాధి చూపుతున్నాయి. పెద్ద పెద్ద హోటళ్లకు వెళితే ఎంతో ఖర్చు చేయాల్సి వస్తున్నది. సంచార వాహనాల్లో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో చౌకగా,శుభ్రంగా ఉండటంతో వీటికి ఆదరణ పెరుగుతుంది.

మండలాల్లోనూ..

జిల్లాలోని పట్టణ, నగర ప్రాంతాల్లోనే కాకుండా కొన్ని మండల కేంద్రాల్లోనూ ఇలాంటి వాహనాలకు ప్రజాదరణ పెరుగుతోంది. ఈ వాహనాల్లో కొనుగోలు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉండటంతో కొనుగోలు చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రత్యేకించి నెల్లూరు నగరంలో ఇలాంటి వాహనాల ద్వారా జరిగే అమ్మకాలకు మంచి ఆదరణ లభిస్తుంది. ఎక్కడ చూసినా సంచార వాహనాల్లో తయారవుతున్న ఆహార పదార్థాలను జనం ఆసక్తిగా తింటున్నారు. వెజిటేరియన్ వంటకాలకే కాక నాన్ వెజిటేరియన్ వంటకాలకు కూడా డిమాండ్ ఉంది. పెద్ద పెద్ద హోటళ్లలో రూ. 150 నుంచి రూ. 250 విలువ చేసే మటన్, చికెన్ బిర్యానీలను సైతం ఈ ప్రత్యేక వాహనాల్లో కేవలం రూ. 80 నుంచి రూ. 100 కు మాత్రమే విక్రయిస్తున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారంతోపాటు భోజనాలను కూడా ఆయా వాహనాల ద్వారా అందిస్తున్నారు. నెల్లూరు నగరంలోని చిల్డ్రన్‌పార్క్ రోడ్డు నుంచి మినీబైపాస్, రాజరాజేశ్వరి ఆలయం వరకు ఈ సంచార వాహనాలు దర్శనమిస్తూ ఆహార ప్రియులను ఆకట్టుకుంటున్నాయి.

ఎంతోమందికి ఉపాధి

ఇలాంటి సంచార వాహనాల ద్వారా అందిస్తున్న ఆహార పదార్థాల ద్వారా ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి లభి స్తున్నది. ఒక్కో వాహనం ద్వారా రోజుకు రూ. 3వేల నుంచి రూ. 4వేల వరకు ఆదాయం గడిస్తున్నారు. కొన్ని వాహనాల వద్ద భార్యాభర్తలతో పాటు కుటుంబ సభ్యులు కష్టపడుతూ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. ఆయా వాహనాలలో అన్నీ రకాల ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయి. దీంతో ఆహార ప్రియులు వీటిని ఆశ్రయిస్తున్నారు.



చిల్డ్రన్స్ పార్కు వద్ద అంబలి విక్రయం

ఒకరిపై ఆధార పడకుండా...



ఒకరిపై ఆధార పడకుండా స్వయం ఉపాధి కింద ఈ ప్రత్యేక వాహనం ద్వారా ఆహార పదార్థాల అమ్మకాలు చేస్తున్నా. ఎంతో మంది ఇక్కడకు వస్తుంటారు. వారికి అభిరుచులకు తగ్గట్లు మంచి రుచితో ఆహార పదార్థాలు అందిస్తున్నా. ఐదేళ్లగా అమ్మకాలు సాగిస్తున్నా. ఈ వ్యాపారం ద్వారా ఉపాధి పొందుతున్నా.

- నిరోష్, ఫుడ్ కోర్టు నిర్వాహకులు

ఎంతో ఆదరణ



నగరంలోని హరనాథపురం ప్రధాన రహదారిలో ఉన్న తన సంచార వాహనంలో విక్రయిస్తున్న మటన్ బిర్యానీకి ఎందో ఆదరణ ఉంది. నావాహనం వద్ద ఎప్పుడూ వినియోగదారులు బారులు తీరి ఉంటున్నారు. ప్రతి రోజూ ఈ వాహనం వద్ద నలుగురు పని చేస్తూ ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఆహారాన్ని అందిస్తున్నారు. మాకెంతో సంతోషంగా ఉంది. కష్టానికి తగ్గ ఫలితం కూడా ఉంటున్నది.

- నసీం, వ్యాపారి

ఎక్కువగా రాగి జావ కొనుగోలు



చిల్డ్రన్ పార్క్‌రోడ్‌లో నా వాహనం ఉంటుంది. అక్కడ ఎక్కువ మంది రాగిజావ కొనుగోలు చేస్తున్నా రు. అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. నాలుగేళ్ల నుంచి ఈ వ్యాపారం చేస్తున్నా. ఎంతో బాగుంది. కేవలం రూ. 20కే రాగిజావం అందిస్తున్నా. రోజూ వాకింగ్‌కు వస్తున్న వారే కాక సాధారణ ప్రజలు కూడా కొనుగోలు చేస్తున్నారు.

- యుగంధర్, వ్యాపారస్థుడు

పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధం

- సోమిరెడ్డితో సీఎంను కలిసిన పారిశ్రామికవేత్తలు



సీఎం చంద్రబాబుతో సోమిరెడ్డి, పారిశ్రామికవేత్తలు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడును పలువురు పారిశ్రామికవేత్తలు అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏపీలోని విశాఖపట్నంతో పాటు నెల్లూరులోనూ పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు సంసిద్ధత వ్యక్తం చేశారు. కంపెనీ కార్యకలాపాలు, ఏర్పాటు చేసే పరిశ్రమలు, స్థానికంగా లభించే ఉపాధి తదితర వివరాలను సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో మెడిటాక్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మితేష్ పటేల్, ఎఫ్‌సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ ఎఫ్‌సీ పటేల్, మోలెక్యుర్ కాటలిస్ట్ కంపెనీ సీఈవో వెంకట బలగాని, డైరెక్టర్ భరత్ లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక బిల్లులు పరిష్కరించాలి

- డీఎంహెచ్‌వోతో హంస నాయకుల భేటీ

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఉద్యోగులకు సంబంధించిన వేతనాలు, ఇతర ఆర్థికపరమైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతను ఆంధ్ర ప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియే షన్ (హంస) నాయకులు కోరారు. సుజాత ఇటీవల డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో హంస నాయకులు గురువారం ఆమెను కార్యాలయంలో కలిసి సత్కరించారు. హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజెర్ల సుధాకర రావు, కమల్ కిరణ్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై డీఎంహెచ్‌వో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రియంవద, హంస అసోసియేట్ ప్రెసిడెంట్ నారాయణ రాజు, శేషగిరిరావు, మజ్రుల్లా, సుధాకర్‌రెడ్డి, సహనా, వెంకట మురళి పాల్గొన్నారు.

సాగు సంపూర్ణం

(5వ పేజీ తరువాయి)

పరిష్కారానికి వేదికలు ఏర్పాటయ్యాయి. జిల్లాలో 486 సాగునీటి సంఘాలు, 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 6 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలను ప్రభుత్వం పూర్తి చేసింది. ఇకపై రైతులు తమ సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరంలేదు. ఈ కమిటీలే ఎక్కడి కక్కడ అన్నీ వ్యవహారాలు చూసుకుంటాయి. కాలువల నిర్వహణకు టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్లు అరకొరగా పనులు చేయడం వంటివి లేకుండా ఇకపై ఈ కమిటీలు, రైతులు భాగస్వామ్యంతో పనులు చేపట్టనున్నాయి.

పెండింగ్ బిల్లులకు మోక్షం

ఇరిగేషన్‌శాఖలో పేరుకున్న పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో కాంట్రాక్టర్ల కుటుంబాలు అప్పుల నుంచి గట్టెక్కుతున్నాయి. ముఖ్యం గా 2014-19 మధ్యన నీరు-చెట్టు పథకం కింద పనులు చేసిన కాం ట్రాక్టర్ల బిల్లులను వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. ఆ బిల్లులను ప్రాధాన్యత క్రమంలో చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం తొలి విడతగా సుమారు రూ.250 కోట్లను మంజూరు చేసింది. జిల్లాలో సుమారు రూ.20 కోట్లకుపైగా నీరు-చెట్టు బిల్లులను చెల్లించారు. అలానే కీలకమైన పెన్నా రక్షణ గోడల నిర్మాణానికి సంబంధించిన బిల్లులను కూడా ఇటీవల చెల్లించింది.

కృష్ణా జలాల రాక

రెండేళ్ల తర్వాత జిల్లాలో పూర్తి విస్తీర్ణంలో సాగు జరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో సోమశిల, కండలేరు జలాశయాల కింద సుమారు 8 లక్షల ఎకరాల్లో వివిధ పైర్లు సాగవుతున్నాయి. అందులో మెజారిటీ విస్తీర్ణంలో వరిసాగు జరుగుతోంది. గతేడాది ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉన్నా సరిగ్గా నీటి యాజమాన్యం చేయలేక నీటిని దుబారా చేశారు. ఆ ప్రభావంతో గతేడాది ఇదే సీజన్‌లో మూడు లక్షల ఎకరాలకు మించి ఆయకట్టుకు నీరు అందించలేకపోయారు. ఈ ఏడాది మేలో రెండో పంట అసలు సాగు కాలేదు. ఓ వైపు మార్కెట్లో ధాన్యం ధర పుట్టి రూ.25 వేలు పలుకుతున్నా సాగు లేకపోవడం రైతులను తీవ్ర వేదనకు గురి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆగస్టు ఒకటి నుంచి కృష్ణా జలాలను సోమశిలకు తీసుకురావడం మొదలు పెట్టింది. రెండు నెలల పాటు శ్రీశైలం నుంచి జలాలు వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటు సోమశిల, అటు కండలేరు ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. ఫలితంగా ప్రస్తుత సీజన్‌లో ప్రతీ ఎకరాకూ నీరు అందించగలిగారు.



సంగం మండలం అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘం ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్ష, టీసీ సభ్యులు (ఫైల్)

ముసురు ముంచేస్తోంది !

(5వ పేజీ తరువాయి)

అదను పోవటంతో శనగ సాగుచేయదలచిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సాధారణంగా శనగ పైరును అక్టోబరు చివరివారం నుంచి నవంబరు 15లోగా సాగుచేస్తారు. అయితే అక్టోబరు ద్వితీయార్థం నుంచి నేటి వరకు భూములు ఆరకుండా వర్షాలు కురుస్తూనే ఉండటంతో శనగ సాగుకు వీలుకాలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జనవరి పదవ తేదీవరకు భూములు ఆరే పరిస్థితి లేదని తేలిపోయింది. ఆ సమయంలో శనగ సాగుచేసినా 50 శాతం దిగుబడులు కూడా వచ్చే అవకాశం లేకపోవటంతో ఎకరానికి రూ.30-35వేల వరకు కౌలుచెల్లించి భూములు తీసుకున్న రైతులు ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారు.

- వింజమూరు, ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌ల పరిధిలో వేల ఎకరాల్లో మినుము, శనగ, కంది పంటలు సాగు చేశారు. ఈ నెల తొలి వారంలో కురిసిన వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో పంటల సాగు జాప్యమైంది. ఆలస్యంగా సాగు చేసిన శనగ పంట మొలకదశలో వర్షాలు కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే కంది, మినుము పంటలకు వర్షాల కారణంగా తెగుళ్లు విజృంభించడంతో వాటి నివారణకు మందులు పిచికారీ చేసి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీంతోపాటు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కందుకూరు ప్రాంతంలో మినుము చేనులో వర్షపునీరు

- కలిగిరి : కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో సుమారు 3 వేల హెక్టార్లలో పొగాకు సాగు చేయగా అకాల వర్షాలతో 450 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఎకరా విస్తీర్ణంలో మళ్లీ మొక్కలు నాటాలంటే సుమారు రూ.10 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని సాగుదారుడు ఆవేదన చెందుతున్నాడు. దీనికి తోడు మిగిలిన పంటపై బొబ్బ తెట్టు ఆశించడం, పురుగు చేరడం, కలుపు అమాంతం పెరిగిపోవడంతో అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

'పొదుపు' నిధి..
అతివకు పెన్నిధి!

- డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు
- సద్వినియోగం చేసుకుంటున్న నారీమణులు
- స్వయం ఉపాధితో కుటుంబానికి ఆర్థిక భరోసా

సంగం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నేటి తరం మహిళలు పొదుపు మంత్రాన్ని పాటిస్తున్నారు. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉంటూ సక్రమంగా పొదుపులు చెల్లిస్తున్నారు. దీంతో బ్యాంక్ లింకేజీ రుణాలతోపాటు స్త్రీనిధి రుణాలు విరివిగా అందుతున్నాయి. సదరు రుణాలతో ఫ్యాన్సీ, పాల, చిల్లర, పూల దుకాణాలు, గేదెల పెంపకం వంటి చిరు వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా నిలదొక్కుకుటుఉన్నారు. రుణాలను తిరిగి బ్యాంకులకు చెల్లిస్తూ మరింత మొత్తంలో రుణాలు పొందేందుకు మార్గం సుగమమం చేసుకుంటున్నారు. సంగం మండలంలోని పలు గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు పొదుపు రుణాలు పొంది చిరు వ్యాపారులు ప్రారంభించారు. కుటుంబ అవసరాలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తూ అందరిచేత మన్ననలు పొందుతున్నారు.

పెంచలమ్మ, వెంగారెడ్డిపాళెం, పొదుపు సభ్యురాలు



బొమ్మల తయారీ

ఈమె పేరు పెంచలమ్మ, వెంగారెడ్డిపాళెం. పొదుపు సంఘం సభ్యురాలు. సంఘం ద్వార బ్యాంకు రుణం తీసుకుంది. ఆ రుణంతో వినాయక బొమ్మల తయారీలో పెట్టుబడిగా పెట్టుకుంది. దీంతో ప్రతి ఏటా ఆదాయం గడిస్తోంది. తద్వార వచ్చే ఆదాయంతో రుణం చెల్లిస్తూ తన కుమారుడిని చదివిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది



సంపూర్ణమ్మ, కొరిమెర్ల, పొదుపు సభ్యురాలు

ఒక గేదెతో మొదలై...

ఈమె పేరు సంపూర్ణమ్మ, సంగం మండలంలో కొరిమెర్ల గ్రామం. పొదుపు లీడరుగా ఉంటూ కుంటుంబ బాధ్యతలను తలకెత్తుకుని రాణిస్తోంది. బ్యాంకు రుణాలతో ఒక్కో గేదెను కొంటూ పదేళ్లలో 15 పాడి పశువులను అభివృద్ధి చేసింది. పది పశువుల దాకా పాలు ఇస్తున్నాయి. రోజుకు 40 లీటర్ల పాలను కేంద్రానికి సరఫరా చేస్తోంది. వచ్చే డబ్బులు పొలం సాగుకు పెట్టుబడితోపాటు ఇంటి ఖర్చులకు సరిపోతున్నాయి.



మహేశ్వరి, సంగం, పొదుపు లీడరు

ఫ్యాన్సీ దుకాణం నడుపుతూ..

సంగం కుమ్మరివీధికి చెందిన ముత్యం మహేశ్వరిది మధ్య తరగతి కుటుంబం. పొదుపులక్ష్మి రుణంతోనే సంగం సత్రం సెంటర్‌లో బంకు పెట్టుకుని చిన్న పిల్లల నుంచి పెద్దలకు అవసరమైన అన్ని రకాల ఫ్యాన్సీ వస్తువు విక్రయిస్తోంది. అలా వచ్చే ఆదాయంతో తన ఇద్దరి పిల్లలను కార్పొరేట్ పాఠశాలలో ఉన్నత చదువులు చదివిస్తోంది. కుంటుబానికి ఎటువంటి ప్రైవేటు అప్పులు చేయకుండానే ఆర్థిక స్వావలంబన సాధించింది. పొదుపు తనకు భరోసా ఇచ్చిందని గర్వంగా చెప్పుకుంటోంది.

లలిత, అనసూయ నగర్, పొదుపు లీడర్



ఎంబ్రాయిడింగ్‌తో స్వయం ఉపాధి

అనసూయనగర్‌కు చెందిన లలిత అనే యువతి పొదుపులీడరుగా చేరిన అనతికాలంలోనే ప్రభుత్వం అందచేసినసన ఎంబ్రాయిడింగ్‌లో శిక్షణ పొందింది. ఆ శిక్షణతో పొదుపు ద్వారా బ్యాంకు నుంచి తెచ్చిన రుణంతో ఇంటివద్దే ఎంబ్రాయిడింగ్ చేస్తూ మరో నలుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తోంది.

ఇష్టారాజ్యం..ఇక చెల్లదు !

- సచివాలయాల్లో ముఖహాజరు అమలు
- ఉదయం, సాయంత్రం తప్పనిసరి
- ఒకపూటే హాజరు వేస్తే సెలవు కింద లెక్క



వలేటివారిపాలెం గ్రామ సచివాలయం

వలేటివారిపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించేందుకు వీలు లేకుండా కూటమి ప్రభుత్వం నూతన చర్యలు తీసుకోనుంది. రెండుపూటలా సచివాలయాల్లో ముఖ హాజరు వేసేలా చర్యలు తీసుకునేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎప్పటి నుంచో ఈ హాజరు అమలులో ఇన్నా ఎవరూ పట్టించుకునేవారు కాదు. రోజులో ఏదో ఒక పూట హాజరు వేసుకొని వెళ్లి పోయేవారు. కానీ ఇప్పుడు ఈ విధానానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టనుంది. ప్రతి ఉద్యోగి రోజూ రెండుపూటలా హాజరు వేసుకోవాల్సిందే. ప్రభుత్వ పనివేళలు ఉదయం 10గంటలకు ఖచ్చితంగా సచివాయానికి చేరుకొని తమ యాప్‌లో ముఖ హాజరు వేయాలి. ఆ తరువాత సాయంత్రం 5గం టలకు యాప్‌లో ముఖహాజరు వేసుకున్న తరువాత ఇంటికి వెళ్లాలి. ఈ హాజరు కూడా సచివాలయ పరిధిలోని 500 మీటర్ల లోపే వేయాలి. ఎక్కడో కూర్చొని హాజరు వేసుకుందాంలే అన్నకుంటే వీలుకాదు. రెండుపూటలా హాజరు వేసుకుంటేనే ఆ ఉద్యోగి విధులకు హాజరు అయినట్లు పరిగణిస్తారు. ఇప్పటివరకు రోజులో ఒకపూట హాజరు వేసి సిబ్బంది వెళ్లిపోయేవారు. కొందరు విధులకు డుమ్మా కొట్టేవారు. ఇప్పటినుంచి ఆ పరిస్థితి ఉండదు.

ఒకటి నుంచే నూతన విధానం అమలు

ఈ నెల 1వ తేదీ నుంచి రెండుపూటలా యాప్‌లో ముఖ హాజరు పద్ధతిని అనుసరించాలని జిల్లా ఉన్నతాధికారులు టెలికాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికైనా ఆ సిబ్బంది కార్యాలయంలో ఉండి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తారా లేదా అనేది వేచి చూడాలి. మండలంలో 15సచివాలయాలు ఉంటే ఒక్కొక్క సచివాయలంలో 11మంది చొప్పున్న 15సచివాయాల్లో 165మంది సిబ్బంది ఉన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సగం మంది బదిలీలు అయ్యారు. వీళ్ల స్థానంలో ఎవరూ విధుల్లో చేరలేదు. దీంతో సచివాలయ్యాలో సగానికి పైగానే సిబ్బంది కొరత ఉంది.

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు

బిట్రగుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి పలుచోట్ల గురువారం దాడులు నిర్వహించారు. చెంచుల క్రీపురం శివారులో నాటుసారా తయారు చేస్తున్న కట్టా మనోహర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే సారా తయారీ ఉంచిన 50లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశామన్నారు.

స్లోప్ ర్యాంపు ఏర్పాటు



బిట్రగుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావు పేట పంచాయతీ కొత్తూరులో ఈ నెల 10 న సీసీరోడ్డు వేశారు. అప్పటి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న రోడ్డుకు స్థానికులే ఎవరి ఇళ్ల వద్ద వారు (స్లోప్) ర్యాంప్ ఏర్పాటు చేసుకుం టున్నారు. రోడ్డు వేసిన గుత్తేదారులు పట్టించుకోకపోవడంతో గరుసు తెప్పించుకుని వేసుకున్నట్లు చెప్పారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

- కే అంకమ్మ, ఉలవపాడు ఎస్ఐ



ఇంటర్వ్యూ...

ఉలవపాడు, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని ఎస్ఐ కే.అంకమ్మ తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో అవగాహన సదస్సులు ప్రజలను చైతన్యం చేస్తామన్నారు.

? లాఅండ్ ఆర్డర్ పరిస్థితి?

! జాతీయ రహదారిపై పలు రకాల నేరాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న నేరగాళ్లను చాకచక్యంగా పట్టు కున్నాం. నకిలీ బ్రేక్ ఇన్‌స్పెక్టర్, బైక్‌లపై వచ్చి వాహనదారుల ను మారణాయుదాలతో బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్స్, విలువైన వస్తువులు అపహరిస్తున్న దొంగల ఆటలను కట్టడిచేస్తున్నాం.

? హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలేవి

! ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ఆ ప్రదేశాల్లో క్యాషనరీ, సైన్ బోర్డులు, సోలార్ సిస్టమ్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశాం. రవాణాశాఖ, నేషనల్ హైవే అథారిటీ సమన్వయంతో ప్రమాదాలను అరికట్టే చర్యలు చేపడుతున్నాం.

? యువత పెడదారి పట్టకుండా చర్యలు చేపడుతున్నారా ?

! యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నతపాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో అవగాహన సదస్సులు, కౌన్సిలింగ్ చేపడుతున్నాం.

రైతులకు నీరందించాలి

లింగసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు కుడి కాలువ మరమ్మతు పనులను నిపుణులతో త్వరితగతిన చేయించి ఆయకట్టు రైతాంగానికి సకాలంలో నీరు అందించాలని వైసీపీ మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ అధికారులను కోరారు. గురువారం ఆయన రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ పనులను పరిశీలించారు. ఆయన వెంట తోకల కొండయ్య, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర రెడ్డి, కళ్లగుంట ప్రసాదు, పెన్నా రమణయ్య, కిలారి సంతోష్ ఉన్నారు.

చెరువు అభివృద్ధికి కృషి

లింగసముద్రం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపవని చెరువు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సాగునీటి సంఘం ఛైర్మన్ మల్లిశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం అభ్యర్థిగా జనసేన పార్టీ నుంచి తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, జనసేన నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. చెరువు అక్రమణలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటంకాలు తొలగించండి

కావలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని 40వ వార్డులోని పంట కాలువ లో నీటిపారుదలకు ఉన్న ఆటంకాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ ఇంజనీరింగ్, శానిటరీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పంటకాలువను సందర్శించి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను చెత్తను పరిశీలించారు. ఆయనే దగ్గరుండి ఇంజనీరింగ్, శానిటరీ సిబ్బందితో కాలువలో పేరుకపోయిన వ్యర్థాలను కొంత మేర తొలగింపచేశారు.

నైపుణ్యతపై శిక్షణ

కావలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళల కుటుంబసభ్యులకు నైపుణ్యతపై శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, గ్రీజర్, టీవీ, రిఫ్రిజరేటర్, వాషింగ్‌మిషన్ రిపేర్లు చేసేవారు బ్యూటీషియన్, పెయింటింగ్ తదితర సేవలందించే వారికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30వ తేదీ లోపు వివరాలను మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న మెప్మా ఆఫీస్‌లో అందజేయాలన్నారు. వివరాలకు సెల్:79013 11620, 94908 43600 నంబర్లను సంప్రందించాలని కోరారు.

జనసైనికులను తీసుకోవాలి

కావలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమస్యల పరిష్కారంలో 40వార్డుల జనసేన ఇన్‌చార్జిలను కూడా పరిగణనలో తీసుకుని ఆయా వార్డుల వివరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని జనసేన జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను కలిసి 40వార్డుల జనసేన ఇన్‌చార్జి జాబితాను అందచేశారు.

ఎరువులు కొన్న రైతులకు రసీదు ఇవ్వాలి



సంగం: ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి శ్రీహరి



కలువాయి: తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ ఏవో ప్రతాప్,సిబ్బంది

అల్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు దుకాణ యజమానులు రైతులు కొనుగోలు చేసిన మందులకు తగిన బిల్లును తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలని కావలి ఏడీఏ నాగరాజు తెలిపారు. మండలంలోని పలు ఎరవుల, పురు గు మందుల దుకాణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మండల సమావేశ మందిరంలో డీలర్లతో సమావేశం అయ్యారు. యూరియా అత్యధి ధరులకు విక్రయించినట్లు సమాచారం అందితే చర్యలు తప్పవని హెచ్చ రించారు. అలాగే యూరియా అన్ని సొసైటీల్లో అందుబాటులో ఉంచామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- కొండాపురం: యూరియాను అధిక ధరలకు అమ్మే ఎరువుల దుకాణ యజమానులపై చ ర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి షేక్ సైదా తెలిపారు. సొసైటీ, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణా లపై వీఏఏ, ఎమ్‌పీఈవోల పర్యవేక్షణ ఉంటుందన్నారు.
- కావలి రూరల్: అధిక ధరలకు ఎరువులను అమ్మే విధానాన్ని అరికట్టేందుకు ప్రతి ఎరువుల దుకాణానికి ఒక వ్యవసాయ సహాయకుడిని నియమించినట్లు మండల వ్యవసాయ అధికారి లలిత తెలిపారు. పట్టణంలోని 10ఎరువులు, పురుగు మందుల దుకాణాలను పరిశీలిం చారు. వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.
- బిట్రగుంట: మండల వ్యవసాయఅధికారి విజయలక్ష్మీ 16ఎరువుల దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. బోగోలులో మన గ్రోమోర్, లక్ష్మీ ప్రసన్న, విజయలక్ష్మీ రైతు డిపోలను పరిశీలించా రు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలులో రైతులకు ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఏఈవో అశోక్, వీఏఏలు ఉన్నారు.
- సంగం: స్థానిక బస్టాండ్‌లోని ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి శ్రీహరి తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న యూరియా, పురుగు మందులు, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రతి దుకాణంలో ఒక వీఏఏను నియమించినట్లు తెలిపారు. యూరియా కావలసిన రైతులు వీఏఏ దగ్గర పర్మిట్ రాయించుకుని తెచ్చుకోవచ్చునన్నారు. పర్మిట్ లేకుండా యూరియా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు. అదేవిధంగా ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ వసూలు చేసినట్లు ఫిర్యాదులందితే విచారణ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట వీఏఏలు ఉన్నారు.
- కలువాయి: రైతులకు ఎమ్మార్పీ ధరకే యూరియా సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రతాప్ తెలిపారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సరఫరాలో ఇబ్బందులు ఉంటే 833105728, 8331057184, 8331057204 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు.



అల్లూరు: పురుగు మందుల దుకాణంలో విచారణ జరుపుతున్న ఏడీఏ నాగరాజు



కావలి: ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో లలిత

అన్న క్యాంటీన్లకు అపూర్వ ఆదరణ



ఆత్మకూరు: అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అతితక్కువ ధరకే రుచికరమైన భోజనం అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లకు అపూర్వ ఆదరణ లభిస్తోందని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆత్మకూరు అన్నకాం టీన్‌ను సందర్శించి ఆహార నాణ్యతను పరిశీలిం చారు. కార్యక్రమంలో దర్గా కమిటీ మాజీ చైర్మన్ షేక్ హయత్‌బాష, క్యాంటీన్ సూపర్‌వైజర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే ఊరుకోం



సమావేశంలో పాల్గొన్న నేతలు

కందుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడికాలువ స్లాప్‌లాక్ గేటు వ్యవహారంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుపై వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ విమర్శలు చేయటం తగదని టీడీపీ నేతలు మండిపడ్డారు. బాధ్యతలేకుండా ఆధారాలు లేని విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గురువారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ మండలాధ్యక్షులు జనిగర్ల నాగ రాజు, రాళ్లపాడు ప్రాజెక్టు అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 20రోజులుగా ఎమ్మెల్యే ఇంటూరి రేయింబవళ్లు గేటు మరమ్మతుల కోసం శ్రమించి నీరందించారని గుర్తు చేశారు. సమస్య పరిష్కా రానికి సలహాలు ఇవ్వాల్సింది పోయి ఎమ్మెల్యేపై బురదజల్లే ప్రయత్రం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీన రసింహ, కమిటీసభ్యులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నేతలు

వింజమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అసైన్‌మెంట్ భూములను కొనడం, అమ్మడం నేరమని, నియోజకవర్గవ్యాప్తంగా 700రెవెన్యూ సమస్యలు నా దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారానికి కృషిచేస్తానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం శంకవరం పంచాయతీ వెంకటాద్రిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామాలయం స్లాబు నిర్మాణానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. బీసీలు నిర్మించుకుంటున్న ఈ రామాలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి సుమారు రూ.10లక్షలు ఎండోమెంట్ ద్వారా నిధులు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొంతమంది ప్రభుత్వ భూములను పట్టాలు పొంది అమ్ముకున్నారని ఎమ్మె ల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, శంకవరం, వెంకటాద్రి పాలెం, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): నార్త్ కొండాయపాళెం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దారు హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీజేఎఫ్ఎస్ భూములకు డీకేటీ పట్టాలు పంపిణీ చేసినప్పటికీ అసైన్‌మెంట్‌గా బదలాయింపు చేయలేదని కొందరు రైతులు వాపోయారు. ఐదు విడతల భూ పంపిణీలో పట్టాలు పొందినా తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని వినతిపత్రాలు అందించారు. వీటికితోడు ధర్మవరం గ్రామ నిర్మాణ ప్రాంతాన్ని నిషేధిత జాబితా నుంచి తొలగించాలన్నారు. విరువూరులోనూ డీటీ చెంచయ్య ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ముజ్జే లక్ష్మీనారాయణ, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

- సంగం: పడమటిపాళెంలో గురువారం తహసీల్దారు సోమ్లా నాయక్ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించి స్థానిక అధికారులతో చర్చించి రికార్డులు పరిశీలించారు. నిర్దేశించిన గడువు లోపు సమస్యలు పరిష్కరిస్తామని రైతులకు తెలిపారు. ఆర్ఐ రాజనారాయణ, సర్వేయర్ శివరంజని, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రతి ఒక్కరికీ ‘ఆధార్’ తప్పనిసరి

ఆత్మకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ తప్పని సరిగా ఆధార్‌కార్డు కలిగి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు తెలిపారు. గురువారం ఆయన కరటంపాడులోని ఎస్టీ కాలనీని సందర్శించి ఆధార్‌కార్డు లేని ఎస్టీ కుటుంబాల వివరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం ఆయన ఆధార్‌కార్డు లేని 40మంది ఎస్టీలను బట్టేపాడులో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌కు తీసుకెళ్లి దరఖాస్తు చేయించి సమస్యలను పరిష్కరించారు.

రుచికరమైన భోజనం అందించాలి

ఉదయగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. గురువారం సర్వరబాదు, నేలటూరు ప్రాథమిక పాఠశాల లను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు తనిఖీ చేయడంతోపాటు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయం పరిశీలన

వింజమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని గురువారం నెల్లూరుజిల్లా ఏపీసీ వెంకటసుబ్బయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలోని పాఠశాలల వివరాలు అడిగి తెలసుకున్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి ఎంమధుసూదన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవికి పూజలు

సంగం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న సరస్వతీ ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బుజ్జయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాడి రైతులు తగుజా గ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గేదెలు, రెండేళ్లలోపు దూడలు గొంతువాపు, గురక, పచ్చికడొమ్మ వ్యాధుల బారినపడి మృతిచెందే ప్రమాదముందన్నారు. అలాంటి రైతులు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే టీకాలను తమ గేదెలకు వేయించుకోవాలని కోరారు.

మోడల్ టెస్ట్ పేపర్ల కరదీపిక ఆవిష్కరణ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్),డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని యూటీఎఫ్ రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్ల కరదీపికను గురువారం పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చలపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాఖా జిల్లా కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు కరదీపిక ఎంతగానో తోడ్పాటునందిస్తుందన్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు కరదీపికలోని అంశాలపై దృష్టిసారిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, గోపి, జలీల్‌సుల్తాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రారంభం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఏపీ రీ సర్వే ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా గురువారం భాస్కరాపురంలో సర్వే ప్రక్రియను ప్రారంభించినట్లు తహసీల్దారు హేమంత్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎలాంటి లోపాల్లేకుండా పక్కాగా సర్వే కొనసాగించేందుకు చర్యలు చేపడతామన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే రైతులు తగు సస్యరక్షణ చర్యలు చేపడితే పెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయా ధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం సోమలరేగడ గ్రామంలో సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటలో తెగుళ్లను గుర్తించి వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీ, శేషగిరి, చెన్నారెడ్డి, మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి, ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబాల దివస్



వీరబాలురకు నివాళులర్పిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు

కందుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజ్ఞాన్‌విహార్ ఉన్నత పాఠశాలలో ని ర్వహించిన వీర బాలదివస్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ ఖండ సంఘచాలక్ తన్నీరు మల్లికార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరులైన జోరావర్ సింగ్, ఫతేసింగ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, నాయకులు మన్నే పల్లి వరప్రసాదరావు, చుండి మురళీధర్, గొడ్డటి బాలరాఘవ యాదవ్, భూషయ్య పాల్గొన్నారు.

బాలదివస్‌పై అవగాహన

వలేటివారిపాలెం: నేకునాంపురం అంగన్‌వాడీ కేంద్రం -2లో గురువారం కందుకూరు ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్ఠ వీర బాలదివస్ కార్యక్రమంపై గర్భవతులు, బాలింతలు, చిన్నారుకు అవగాహన కల్పించారు. సిక్కుల పదో గురువు గురు గోవిదసింగ్ కుమారులు ఫత్‌సింగ్, జూరావర్‌సింగ్, ధైర్యానికి, సాహసానికి చిహ్నంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు రాధ, మహిళా పోలీస్ ప్రసన్న టీచరు భారతీలక్ష్మీ తదితరలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ రెవెన్యూ పరిధిలో 200 ఎకరాల ప్రభుత్వ భూములను పక్క గ్రామాలకు చెందిన కొందరు ఆక్రమించి పట్టాలు పొందారని గురువారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సుభద్రకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర గ్రామస్థుల అనుభవంలో ఉన్న భూములకు పట్టాలను రద్దు చేసి తమ గ్రామంలో అర్హులైన వారికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు భూ, ఇతర సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేంద్ర, వీఆర్వో పెంచలయ్య, పాల్గొన్నారు.

- దుత్తలూరులో: సోమలరేగడలో తహసీల్దారు నాగరాజు సదస్సులో పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణన సర్వే వివరాల ప్రదర్శన

సంగం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇటీవల చేసిన ఎస్సీ కుల గణన సర్వే వివరాలను మండలంలోని అన్ని సచివాలయాల్లో అధికారులు ప్రదర్శించారు. అందులో భాగంగా సంగం 1,2 సచివాలయాల్లో ఏఎస్‌డబ్ల్యుఓ బ్రహ్మానందచారి సర్వే జాబితాను నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు. అదేవిధంగా ఆయా గ్రామాల పరిధిలోని ఎస్సీ కుల గణన సర్వే వివరాలను సంబంధిత సచివాలయ నోటీస్ బోర్డులో కార్యదర్శు లు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఉంచారు.

సమస్యల పరిష్కారానికి కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

కావలి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువా రం మున్సిపల్ కార్మికులు స్థానిక కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణ మోహన్ మాట్లాడారు. 16రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్న ఒప్పందాన్ని ఇప్పటి వరకు చేయలేదన్నారు. కార్మికులకు రూ.7లక్షల ప్రమాదబీమా, దహన సంస్కారాలకు రూ.20వేలు, విధుల నిర్వహణ వయసు 62ఏళ్లకు పొడిగిం చాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవా ధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, తురకా శీనయ్య, ఒంగోలు రమేష్, రమేష్, మహేష్ పాల్గొన్నారు.